Postel No. MBN/08/2016-2018



పురాతనమైన సమస్తరోగాలకు
ఆయుర్వేద చికిత్స
మూల వ్యాధి, తెల్లమచ్చలు,పక్షవాతములతోపాటు అన్ని రకాల రోగాలకు సమూలంగా వైద్యం చేయబడును.
శ్రీ దత్తత్రిలింగేశ్వరామాలయము
నారాయణపేట రోడు,ఊట్కూర్‌మండలం
మహబూబ్‌నగర్ జిల్లా సెల్ 9640418895



# వార్తా తరంగాలు

జాతీయ తెలుగు దిన పత్రిక

website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar | సంపుటి :23 | సంచిక :105 సంపాదకులు: కోటకొండ ఎల్ల విజయరాజు | శనివారం 02 ఆగస్టు 2025 | పేజీలు :12 | వెల రూ5 /-


## ఖైరతాబాద్ లో రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభం

### పాల్గొన్న మంత్రి పొన్నం



**హైదరాబాద్:**ఖైరతాబాద్ నియోజకవర్గంలో రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ ప్రారంభం అయింది. ఈ కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే దానం నాగేందర్, నగర మేయర్ విజయలక్ష్మి, అధికారులు హజర్యారు. మంత్రి పొన్నం మాట్లాడుతూ తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో అర్హులైన అందరికీ రేషన్ కార్డులు ఇస్తున్నాం. తెలంగాణ లోని 32 జిల్లాలో రేషన్ కార్డుల పంపిణీ జరుగుతుంది. హైదరాబాద్ జిల్లాలో సివిల్ సప్లైస్, జీహెచ్ ఎంసీ సమన్వయం తో రేషన్ కార్డులు ఇస్తున్నామని అన్నారు. రేషన్ కార్డులు పొందుతున్న వారందరికీ శుభాకాంక్షలు . గతంలో దొడ్డు బియ్యం తినే పరిస్థితి లేకుండే. పెద్దలకే పరిమితమైన సన్న బియ్యం ఇప్పుడు అందరికీ సన్న బియ్యం పంపిణీ చేస్తున్నాం . గతంలో 5 లక్షల రేషన్ కార్డులు తొలగించారు. గత 10 సంవత్సరాలుగా లక్షలాది మంది రేషన్ కార్డులు అడిగారు..ఒక్కటి ఇవ్వలేదు. అప్లికేషన్ పెట్టుకోగానే అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు ఇస్తున్నాం. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. మహిళలకు ఆర్టీసి బస్సులో ఉచితంగా ప్రయాణం కల్పిస్తున్నాం..ఇప్పటికీ వరకు 200 కోట్లు ఉచిత ప్రయాణాలు జరిగాయి. ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నాం. గతంలో ఉప్పల్ లో పని చేస్తుంటే కొల్లూరు లో ఇల్లు ఉంటే ప్రజలకు ఎలా ఉపయోగపడుతుంది. ఉన్న చోటే ఇల్లు ఇవ్వాలని, హైదరాబాద్ లో 55,378 రేషన్ కార్డులు కొత్తగా ఇస్తున్నాం..ఫలితంగా 3,79,249 రేషన్ కార్డులు అయ్యాయి. లబ్ధిదారుల సంఖ్య 23,61,440 లక్షల నుండి 27,40,689 లక్షలకు పెరిగిందని అన్నారు.ఖైరతాబాద్ నియోజకవర్గంలో 1953 కొత్తగా రేషన్ కార్డులు పంపిణీ చేస్తుండగా 7435 మందికి కొత్తగా రేషన్ కార్డు లబ్దిదారులు అయ్యారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో మొత్తం 35648 నుండి 37601 కి పెరిగాయి. లబ్ధిదారుల సంఖ్య 1,07.087 నుండి 1,20,974 కి పెరిగింది. ఈ నియోజకవర్గంలో ఇంకా 4898 కొత్త రేషన్ కార్డులు పరిశీలించాల్సి ఉంటుంది. ప్రజా సమస్యలు వినడం మా బాధ్యత వాటిని పరిష్కారం చేయడం మా ప్రభుత్వ బాధ్యత. ఆర్థిక సంక్షోభం ఉన్న ఇన్ని కార్యక్రమాలు చేస్తున్నాం. మహిళలకు వడ్డీలేని రుణాలు ఇస్తున్నాం. సన్న వడ్ల కి 500 బోనస్ ఇస్తున్నాం. రైతులకు రైతు భరోసా,రుణమాఫీ చేశాం.

## కాళేశ్వరం రిపోర్ట్... అధికారులపై చర్యలేవి

**కరీంనగర్, ఆగస్టు1:**కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి, అక్రమాలు, అవకతవకలు అంటూ మొదటి నుంచి బలంగా విమర్శిస్తూ వచ్చిన కాంగ్రెస్ ప్రభు త్వం ఏర్పడిన తరువాత విచారణ సంస్థల సిఫారసుల ప్రకారం చర్యలు తీసుకోవడంలో మాత్రం అంత వేగంగా అడు గులు వేయడం లేదు.2023 డిసెంబరులో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తరువాత కాంగ్రెస్ ప్రభుత్వం.. కాళేశ్వరం ప్రాజెక్టుపై విజిలెన్స్ విచారణకు ఆదేశించడం.. ఆపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను ఏర్పాటు చేయడం చాలా వేగంగా సాగింది. అయితే విజిలెన్స్ విచారణ నివేదిక వచ్చినప్పటికీ.. చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కపెడుతుందనే ఆరోపణలున్నాయి. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు తరువాత కాళేశ్వరం ప్రాజెక్టుపై విజిలెన్స్, ఎన్‌ఫో ర్స్‌మెంట్ విచారణకు ఆదేశించింది. దాదా పు ఏడాదికిపైగా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం చేసిన విచారణలో అత్యంత కీలకమైన సమాచారం, రికార్డులు, ఫైళ్లు బయట కు వచ్చాయి. కాళేశ్వరం ప్రాజెక్టు రీడిజైనింగ్, నిర్మాణ ప్రారంభ పనుల నుంచి మొదలుకుని.. 2023 అక్టోబర్‌లో మేడిగడ్డ బ్యారేజీ ఏడో నెంబరు బ్లాక్ కుంగుబాటు వరకు అస లు ఏం జరిగింది.. ఎలాంటి లోటుపాట్లు ఉన్నాయి.. ఎవరి బాధ్యత ఎంతవరకు ఉం ది.. ఎవరిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి.. తదితర అన్ని అంశాలతో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం రాష్ట్ర విజిలెన్స్ కమి షన్‌కు నివేదికను ఇచ్చింది. దీనిని పరిశీలించిన విజిలెన్స్ కమిషన్ ఎవరెవరిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి.. ఎవరిపై



ఎలాంటి చర్యలు తీసుకోవాలనేది సిఫా రసు చేస్తూ.. 18.3.2025న రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికను అందించింది. దాదాపు 10 పేజీల విజిలెన్స్ కమిషన్ నివేదికలో.. ఆర్థిక శాఖ, నీటిపారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీలతోపాటు బాధ్యులైన వారి సబార్డినేట్స్‌పై కూడా చర్యలు తీసుకునేందుకు ఆలోచించాలని స్పష్టంగా సిఫారసు చేసింది. బాధ్యులైనవారిని పేర్కొంటూ చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ కమిషన్ సిఫారసులను 18.3.2025న ప్రభుత్వానికి కమిషన్ లేఖ రాసింది. అంటే ఇప్పటికి దాదాపు నాలుగున్నర నెలల కాలం గడిచింది. ఇప్పటివరకు అటు ఆర్థిక శాఖ, ఇటు నీటిపా రుదల శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీలుగా (విజిలెన్స్ కమిషన్ పేర్కొన్న ఏప్రిల్ 2015 నుంచి 21.10.2023 వరకు) పనిచేసిన ఐఏఎస్ అధికారులపై చర్యలు తీసుకోవడానికి మాత్రం ప్రభుత్వం జంకుతూనే ఉన్నట్టు కనపడుతోంది.విజిలెన్స్ కమిషన్ పేర్కొన్నట్టు.. కాళేశ్వరం ప్రాజెక్టు రీడిజైన్ చేసినప్పటి నుంచి మేడిగడ్డ బ్యారేజీ ఏడో బ్లాక్‌కు పగుళ్లు వచ్చి కుంగినప్పటి వరకు నీటిపారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ/స్పెషల్ చీఫ్ సెక్రటరీలుగా పలువురు పనిచేశారు. గతంలో సీఎస్‌గా చేసి రిటైర్డ్ అయిన ఎస్.కె. జోషి అంతకుముందు నీటిపారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా, స్పెషల్ చీఫ్ సెక్రటరీగా పనిచేశారు.తరువాత వికాస్‌రాజ్ నీటి పారుదల శాఖ సెక్రటరీగా, ప్రిన్సిపల్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వర్తించారు. 2021 జనవ రి, ఫిబ్రవరిలో చీఫ్ సెక్రటరీగా పనిచేసిన సోమేశ్‌కుమార్ నీటిపారుదల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగాకూడా అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. ఆ తర్వాత రజత్‌కుమార్ 2021 ఫిబ్రవరి నుంచి 2023 నవంబర్ వరకు నీటిపారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా, స్పెషల్ చీఫ్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వర్తించారు. వీరెవరికీ నోటీసులు ఇవ్వలేదు. చర్యలు తీసుకోలేదు. కాళేశ్వరం ప్రాజెక్టులో లక్ష కోట్ల అవినీతి, అక్రమాలు, అవకతవకలు జరిగాయని బలంగా చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం విచారణ సంస్థల నుంచి వచ్చిన నివేదికల ప్రకారం చర్యలు తీసుకోవడానికి మాత్రం ఎందుకో తాత్సారం చేస్తున్నట్టుగా అర్థమవుతోంది. ఎంత బలంగా విమర్శలు చేశారో.. అంతే వేగంగా విచారణకు ఆదేశించిన ప్రభుత్వం.. చర్యల విషయంలో మాత్రం ఆ వేగాన్ని ప్రదర్శించడం లేదనే విమర్శలు వినపడుతున్నాయి

## యాదాద్రి పవర్ ప్లాంట్ మొదటి యూనిట్ జాతికి అంకితం!

**నల్గొండ, ఆగస్టు 1:**యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ రాష్ట్రానికి ఆశాదీపమైంది. దీంతో విద్యుత్తు సరఫరాలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం నంబర్‌వన్ స్థానంలో నిలువనుంది. సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో దేశంలో ప్రభుత్వ రంగంలో అతిపెద్ద థర్మల్ విద్యుత్ కేంద్రంగా యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ అవతరించింది. దేశ విద్యుత్ రంగానికి దేశానికి కలికితురాయిగా నిలిచిన యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ మొదటి యూనిట్ ను ప్రభుత్వం జాతికి అంకితం చేసింది. గత ఏడాది డిసెంబర్ లో సీఎం రేవంత్ రెడ్డి రెండవ యూనిట్‌ను జాతికి అంకితం చేశారు. మొదటి, రెండో యూనిట్ల నుంచి పూర్తి స్థాయిలో విద్యుత్ ఉత్పత్తితో కాంతులు విరజిమ్ముతున్నాయి.రాష్ట్రంలో విద్యుత్ కోతలు లేకుండా నిరంతరాయంగా వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ ను సరఫరా చేసి మిగులు విద్యుత్తు కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ను ప్రభుత్వం చేపట్టింది. నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో నిర్మాణాన్ని తెలంగాణ జెన్కో చేపట్టింది. 34,500 కోట్లతో నాలుగు వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో ఐదు యూనిట్ల నిర్మాణాన్ని చేపట్టింది. దక్షిణాదిలో ప్రభుత్వ రంగంలో అతిపెద్దదైన యాదాద్రి పవర్ ప్లాంట్.. మొదటి, రెండో యూనిట్ల నుంచి పూర్తి స్థాయిలో కాంతులు విరజిమ్మనుంది. ప్లాంట్ పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు సందర్శించి అధికారులతో ఎప్పటికప్పుడు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమీక్షించారు.దశల వారీగా పవర్ ప్లాంట్



విద్యుత్ ఉత్పత్తినీ ప్రభుత్వం జాతికి అంకితం చేస్తోంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి,అడ్లూరి లక్ష్మణ్ లు పవర్ ప్లాంట్ ను సందర్శించారు. మొదటి యూనిట్ ను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క జాతికి అంకితం చేసి కమర్షియల్ ఆపరేషన్ డిక్లరేషన్(%జూణ%) చేశారు. ఇప్పటికే రెండో యూనిట్ ను గత ఏడాది డిసెంబర్ లో సీఎం రేవంత్ రెడ్డి జాతికి అంకితం చేశారు. ప్లాంట్ లో రెండు యూనిట్లను వాడకంలోకి తీసుకురాగా.. 1600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. యాదాద్రి పవర్ ప్లాంట్ పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. జెన్ కో అధికారులు పవర్ ప్లాంట్ పనులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

## సెప్టెంబర్ 9న ఉపరాష్ట్రపతి ఎన్నిక

74 **న్యూఢిల్లీ, ఆగస్టు 1:**ఉపరాష్ట్రపతి పదవిని భర్తీ చేసేందుకు ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. పదవి ఖాళీ అయితే వెంటనే భర్తీ చేయాలన్న నిబంధన ఉండటంతో ఉపరాష్ట్రపతి రాజీనామా అధికారికంగా ఆమోదం పొందిన వెంటనే సన్నాహాలు ప్రారంభించింది. ఓటర్ల జాబితాను రెడీచేసింది. లోక్ సభ, రాజ్యసభల్లో సభ్యులంతా ఓటు హక్కు కలిగి ఉంటారు. రాష్ట్రపతి ఎన్నికల్లో అయితే ఎమ్మెల్యేలు కూడా ఓటర్లుగా కూడా ఉంటారు.కానీ ఉపరాష్ట్రపతి పదవికి మాత్రం పార్లమెంట్ సభ్యులు మాత్రమే ఓటు హక్కు వినియోగించుకుంటారు. ఏడో తేదీ నుంచి నామిషన్లు ప్రారంభమవుతాయి. 21వ తేదీ వరకూ నామినేషన్లు స్వీకరిస్తారు. పోలింగ్ అవసరం అయితే వచ్చే నెల తొమ్మిదో తేదీన నిర్వహిస్తారు. అదే రోజు కౌంటింగ్ నిర్వహిస్తారు. ఉపరాష్ట్రపతి అభ్యర్థి ఎవరు అన్నదానిపై అధికార ఎన్డీఏలో ఇంకా క్లారిటీ లేదు. బీహార్ సీఎం నితీష్ కుమార్ తో సహా చాలా మంది పేర్లు ప్రచారంలోకి వస్తున్నాయి. నామినేషన్లకు చివరి తేదీ ఆగస్టు 21వ తేదీ కాబట్టి.. చివరి వరకూ నిర్ణయం తీసుకునే అవకాశం ఉండదని భావిస్తున్నారు. నామినేషన్ల గడువుకు రెండు రోజుల ముందు బీజేపీ హైకమాండ్ పేరును ఖరారు చేసే అవకాశం ఉంది. ఎవరూ ఊహించని అభ్యర్థులను రంగంలోకి తీసుకు వచ్చే చాన్సులు ఉన్నాయి. బీహార్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఉపరాష్ట్రపతిని ఎంపిక చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు. మిత్రపక్షాలకు ఇచ్చే అవకాశం లేదని.. బీజేపీ నుంచి మాత్రమే ఉపరాష్ట్రపతి ఉంటారని బీజేపీ వర్గాలు భావిస్తున్నాయి. మరో వైపు ఇండియా కూటమి అభ్యర్థిని నిలబెట్టకపోతే ఏకగ్రీవం అవుతుంది. పోటీకి అభ్యర్థిని పెట్టాలని ఇండియా కూటమి భావిస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. అదే జరిగితే ఓటింగ్ ఖాయం. ఓటింగ్ జరగాల్సి




వస్తే సెప్టెంబర్ 9న నిర్వహిస్తారు. కౌంటింగ్ కూడా అదే రోజు జరుగుతుంది. ఉపరాష్ట్రపతిని పార్లమెంటు ఉభయ సభలకు ఎన్నికైన, నామినేటెడ్ సభ్యులతో కూడిన ఎలక్టోరల్ కాలేజీ ఉపరాష్ట్రపతి ని ఎన్నుకుంటుంది. ఎన్నిక ఒకే బదిలీ ఓటు ద్వారా జరుగుతుంది. గెలుపొందడానికి అభ్యర్థికి సభలోని మొత్తం ఓట్లలో సగం కంటే ఎక్కువ అంటే సాధారణ మెజారిటీ అవసరం. అభ్యర్థి నామినేషన్‌ను దాఖలు చేయడానికి కనీసం 20 మంది ఎలక్టోరల్ కాలేజీ సభ్యులు ప్రతిపాదకులుగా, 20 మంది బలపరిచేవారిగా సంతకం చేయాలి. ఉపరాష్ట్రపతి పదవీకాలం 5 సంవత్సరాలు. 2025 జులై 21న ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ ఆరోగ్య కారణాలతో రాజీనామా చేశారు. దీంతో కొత్త ఉపరాష్ట్రపతి ఎన్నిక కోసం ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. ప్రస్తుతం జరిగేది ఉపఎన్నిక కాదు. అందుకే ఎన్నికయ్యే వారు ఐదేళ్లు పదవిలో ఉంటారు. ఉపరాష్ట్రపతి రాజ్యసభ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు . రాష్ట్రపతి పదవి ఖాళీ అయినప్పుడు తాత్కాలిక రాష్ట్రపతిగా విధులు నిర్వహిస్తారు

## రాహుల్ గాంధీ వ్యాఖ్యలను తప్పుపట్టిన కాంగ్రెస్ ఎంపీలు...



**న్యూఢిల్లీ, ఆగస్టు 1:**భారత్, రష్యా సంబంధాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సమర్థించడాన్ని సొంత పార్టీకి చెందిన ఎంపీ శశిథరూర్ తప్పుబట్టారు. రాహుల్ వ్యాఖ్యలతో తాను విభేదిస్తున్నానని ఆయన స్పష్టం చేశారు.వాణిజ్య ఒప్పందాల గురించి మాట్లాడుతూ, భారత్-రష్యా ఆర్థిక వ్యవస్థలు ఇప్పటికే పతనమయ్యాయని, వాటిని మరింత దిగజార్చుకోవద్దని ట్రంప్ వ్యాఖ్యనించారు. భారత ఆర్థిక వ్యవస్థ పతనమైందంటూ ట్రంప్ వాస్తవం చెప్పారంటూ రాహుల్ గాంధీ సమర్థించారు. రాహుల్ గాంధీ తీరుపై అధికార పక్షం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇప్పుడు సొంత పార్టీ నేతల నుంచి ఆయన విమర్శలు ఎదుర్కొంటున్నారు.ట్రంప్‌ను రాహుల్ గాంధీ సమర్థించడంపై పార్లమెంటు వెలుపల మీడియా ప్రశ్నించగా, థరూర్ కొట్టిపారేశారు. భారత ఆర్థిక వ్యవస్థ ఎలా ఉందో అందరికీ తెలుసని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన మరో ఎంపీ కార్తి చిదంబరం కూడా రాహుల్ గాంధీ వ్యాఖ్యలతో విభేదించారు. ట్రంప్ సంప్రదాయేతర రాజకీయ నాయకుడంటూ చురకలు అంటించారు.

## సీఎం రేవంత్ రెడ్డికి హైకోర్టులో ఊరట



**హైదరాబాద్:**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హైకోర్టు లో ఊరట లభించింది. సిఎం రేవంత్ పై బీజేపీ నేత కాసం వెంకటేశ్వర్లు పెట్టిన కేసును హైకోర్టు కొట్టివేసింది. రిజర్వేషన్లపై సీఎం రేవంత్ చేసిన వాఖ్యల పై గురించి కాసం వెంకటేశ్వర్లు నాంపల్లి స్పెషల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేసారు. ఆ కేసును కొట్టివేయాలని హైకోర్టులో సీఎం రేవంత్ క్వాష్ పిటిషన్ దాఖలు చేసారు. రేవంత్ క్వాష్ పిటిషన్ కు హైకోర్టు అనుమతినిచ్చింది.

## బనకచర్లను అడ్డుకుని తీరుతాం

**హైదరాబాద్, ఆగస్టు 1:**బనకచర ప్రాజెక్టు విషయంలో రేవంత్ రెడ్డి పెదవులు మూసుకోవడం వల్ల చంద్రబాబు ఆడిందే ఆట, పాడిందే పాట అన్నట్లు పరిస్థితి మారుతోందని మాజీ హరీష్‌రావు విమర్శించారు. లోపాయికార ఒప్పందం చేసుకొని ప్రాజెక్టు కోసం రేవంత్ రెడ్డి సహకరిస్తున్నారని ఆరోపించారు. ఢిల్లీలో పవర్ ఉంది అని లోకేష్ ప్రాజెక్టు కట్టి తీరుతమంటూ మాట్లాడుతున్నారని అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని, సీఎం, మంత్రులు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్‌తో తెలంగాణ ప్రభుత్వం లోపాయికార ఒప్పందం చేసుకుందని ఆరోపించారు. బనకచర్ల అంశంపై చర్చకు రాబోమని చీఫ్ సెక్రటరీ లేఖ రాస్తే రేవంత్ రెడ్డి మాత్రం బనకచర్ల అంశం ఉన్నప్పటికీ చర్చల్లో పాల్గొని పాల్గొని, కమిటీ వేసేందుకు ఒప్పుకొని వచ్చారని ఎద్దేవా చేశారు. ఇదే



ధైర్యంతో లోకేష్ మాట్లాడుతున్నాడని అన్నారు. బనకచర్ల కట్టి తీరుతా అంటున్నారంటే విమర్శించారు. బనకచర్లపై చంద్రబాబు బుల్డోజ్ విధానానికి బిజేపీ, కాంగ్రెస్ మౌనమే కారణమని ఆరోపించారు హరీష్‌రావు. వీళ్ల సహకారంతోనే అంత ధైర్యంగా ప్రకటిస్తున్నారని అన్నారు. లోకేష్ ఏమో ప్రాజెక్టు కట్టి తీరుతాం అంటే, రేవంత్ రెడ్డి మాత్రం బనకచర్ల కడుతలేరు అంటున్నారని విమర్శలు చేశారు. రేవంత్ రెడ్డి గురుదక్షిణ చల్లించుకునే పనిలో పడ్డారని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డితోపాటు కాంగ్రెస్, బిజేపీ దూడూ బసవన్నలాగా చంద్రబాబు చేపట్టే వాటికి తలూపుతున్నారని హరీష్‌రావు అన్నారు. ధైర్యంగా మాట్లాడుతున్నరని చెప్పుకొచ్చారు. రేవంత్ గురుదక్షిణలో భాగంగా చంద్రబాబు మెప్పు కోసం, ఢిల్లీ మెప్పు కోసం ప్రయత్నం చేస్తున్నారే తప్ప రాష్ట్ర ప్రయోజనాల కోసం కాదన్నారు.

# సంపాదకీయం

## భారత జాతీయోద్యమ పిత


బాలగంగాధర తిలక్ (జూలై 23, 1856 – ఆగష్టు 1, 1920) స్వరాజ్య పోరాటంలో పాల్గొన్న తొలితరం త్యాగమూర్తులతో బాలగంగాధర తిలక్ అగ్రగణ్యులు. ఆయనను భారత జాతీయోద్యమ పితగా పేర్కొంటారు. తిలక్ జాతీయోద్యమాన్ని కొత్తపుంతలు తొక్కించాడు. దేశవ్యాప్తంగా సామాన్య ప్రజలను ఉద్యమంలో పాల్గొనేటట్లు చేయడంలో ఆయన పాత్ర మరిచి పోలేనిది. భరత జాతిని స్వాతంత్ర్య సమరోత్సాహంతో జాగృత మొనర్చిన మహానేత లోకమాన్య తిలక్. అందుకే ఆయనను భారత దేశంలో బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రేగిన అశాంతికి మూల కారకుడుగా భావిస్తారు. బాలగంగాధర తిలక్ 1856 జూలై 23వ తేదీన మహారాష్ట్ర రాష్ట్రంలోని రత్నగిరిలో మధ్య తరగతి బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. తండ్రి గంగాధర్ రామచంద్ర తిలక్ సంస్కృత పండితుడు, ఉపాధ్యాయుడు. బాల్యంలో తిలక్ చాలా చురుకైన విద్యార్థి. ప్రత్యేకించి గణిత శాస్త్రంలో విశేష ప్రతిభ కనబరచేవారు. చిన్నప్పటి నుంచి అన్యాయం ఎక్కడ జరిగినా సహించని గుణమాయనది. నిజాయితీతో బాటు ముక్కుసూటి తనం ఆయన సహజ గుణం. కళాశాలకు వెళ్ళి ఆధునిక విద్య నభ్యసించిన తొలితరం భారతీయ యువకుల్లో ఆయనొకరు. ఆంగ్ల విద్యను అందుకున్న తొలి తరం భారతీయులలో అగ్రగణ్యులు. ఆంగ్ల విద్య ప్రభావంతో భారతీయులు అనుభవిస్తున్న బానిసత్వం గురించి తెలుసుకున్న వర్గంలో కూడా తిలక్ అగ్రగణ్యులే. తిలక్ కు పదేళ్ళ వయసున్నప్పుడు అతను తండ్రికి రత్నగిరి నుంచి పుణెకు బదిలీ అయింది. ఇది తిలక్ జీవితంలో పెనుమార్పు తీసుకు వచ్చింది. ఆయన అక్కడ ఆంగ్లో–వెర్నాక్యులర్ పాఠశాలలో చేరి కొందరు ప్రసిద్ధి చెందిన ఉపాధ్యాయుల వద్ద విద్యనభ్య సించారు. ఐతే పూణెకు వచ్చిన కొంతకాలానికే అతను తన తల్లిని, పదహారేళ్ళ వయసులో తన తండ్రిని కోల్పోయారు. మెట్రిక్యు లేషన్ చదువు తున్నప్పుడే సత్యభామ అనే పదేళ్ళ అమ్మాయితో పెళ్ళయింది. మెట్రిక్ పాసయ్యాక అతను దక్కన్ కళాశాలలో చేరారు. 1877లో అతను గణిత శాస్త్రంలో ప్రథమ శ్రేణిలో పట్టభద్రు డయ్యారు. ఆ తర్వాత తన చదువును కొనసాగించి ఎల్ ఎల్ బి పట్టా కూడా పొందారు. తిలక్ 1890లో కాంగ్రెస్ లో చేరారు. కానీ త్వరలోనే కాంగ్రెస్ మితవాద రాజకీయాలపై నమ్మకం పోయింది. స్వరాజ్యం కోసం పోరాటమే సరైన మార్గమని అతను నమ్మారు. అప్పటి వరకు కాంగ్రెస్ ప్రతి సంవత్సరం డిసెంబరు చివరి వారంలో మూడు రోజులపాటు సమావేశమై బ్రిటిష్ ప్రభుత్వాన్ని, ప్రభుత్వ విధానాల గురించి మెతక వైఖరి తో చర్చించడానికే పరిమితం అయ్యేది. మితవాదుల ధోరణి సమ్మతంగా ఉండేది కాదు. విన్నపాలు, వినతులు వలస ప్రభుత్వాన్ని లొంగదీయ లేవని తిలక్ సిద్ధాంతం. దాదాభాయ్ నౌరోజీ అంటే ఎంతో గౌరవం. భారత పేదరికం బ్రిటిష్ పుణ్యమేనన్న నౌరోజీ సిద్ధాంతాన్ని సమర్థించడమే కాకుండా, తన పత్రికలో ఎంతో ప్రాచుర్యం కల్పించారు. అలాగే గోఖలే చాలా అంశాలలో తిలక్ కు విభేదాలు ఉండేవి. కాంగ్రెస్ నేతల విధానాలపై తిలక్ ఘాటైన విమర్శలు చేశారు: “మీరు సంవత్సరాని కొకసారి మూడు రోజులపాటు సమావేశమై కప్పల మాదిరి బెకబెకలాడడం వల్ల ప్రయోజనం లేదు.” అని, “అసలు కాంగ్రెస్ సంస్థ అడుక్కునేవాళ్ళ సంఘం (బెగ్గర్స్ ఇన్‌స్టిట్యూషన్)” అన్నారు. కాంగ్రెస్ సమావేశాలను 3–డే తమాషాగా అభివర్ణించారు. “స్వరాజ్యం నా జన్మహక్కు. దాన్ని నేను పొంది తీరుతాను.” అని తీర్మానించారు. 1889లో బొంబాయి కాంగ్రెస్ మహాసభకు ప్రతినిధిగా హాజరైన తిలక్ అక్కడనే లాలాలజ్‌పత్ రాయ్, బిపిన్‌చంద్ర పాల్‌ను కలుసు కున్నారు. ఆ ముగ్గురు మహా నేతలు భారతదేశ చరిత్రలో లాల్–బాల్–పాల్‌గా ప్రసిద్ధులైనారు. వారితోనే కాంగ్రెస్‌లో అతివాదుల శకం ప్రారంభమైంది. 1907లో మహారాష్ట్ర లోని సూరత్‌లో జరిగిన సమావేశంలో కాంగ్రెస్ చీలిపోగా, మితవాదులు కాంగ్రెస్ పై తమ పట్టును నిలబెట్టు కున్నారు. అతివాదులుగా పిలవబడే తిలక్, ఆయన మద్దతు దారులు కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చేశారు. తిరిగి 1916లో లక్నోలో జరిగిన సమావేశంలో అంతా ఒకటైనారు. అదే సమావేశంలో కాంగ్రెస్ కు, ముస్లిం లీగుకు మధ్య లక్నో ఒప్పందం కుదిరింది. తిలక్ పాశ్చాత్య విద్యా విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. అది భారతీయ సాంస్కృతిక వారసత్వాన్ని అగౌరవ పరచి భారతీయ విద్యార్థులను చిన్న బుచ్చే విధంగా ఉందని, ప్రజలకు మంచి విద్యను అందించడం ద్వారానే వాళ్ళను మంచి పౌరులుగా మార్చవచ్చనే ఉద్దేశం ఆయనది. ప్రతి భారతీయునికి భారతీయ సంస్కృతి గురించి, భారత దేశపు ఔన్నత్యాన్ని గురించి బోధించాలని ఆయన ఆశయం. అదే ఆశయంతో అగార్కర్, విష్ణుశాస్త్రి చిప్లుంకర్ లతో కలిసి “దక్కన్ ఎడ్యుకేషనల్ సొసైటీ”ని స్థాపించారు. తర్వాత తాను నడిపిన పత్రికలు “మరాఠా (ఆంగ్ల పత్రిక)”, “కేసరి (మరాఠీ పత్రిక)” లలో మొద్దు నిద్రపోతున్న భారతీయులను మేల్కొల్పడానికి పదునైన భాషలో బ్రిటిష్ పాలనలోని వాస్తవ పరిస్థితుల గురించి వివరంగా రాశారు. బాల్య వివాహాలను నిరసించి వితంతు వివాహాలను స్వాగతించారు. జాతీయ స్ఫూర్తిని రగల్చడానికి వీలున్న ఏ అవకాశాన్నీ ఆయన వదిలి పెట్టలేదు. మొట్టమొదటి సారిగా శివాజీ ఉత్సవాలను, గణపతి ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించడం ద్వారా ప్రజలను సమీకరించడం, వారిని జాతీయోద్యమం వైపు నడిపించడం మొదలు పెట్టారు. తన పత్రికల్లో ప్రజలను రెచ్చగొట్టే రాతలు రాసినందుకు 1897లో ఆయనకు ఒకటిన్నరేళ్ళు కారాగారశిక్ష పడింది. విడుదల య్యాక అతను స్వదేశీ ఉద్యమాన్ని ప్రారంభించారు. 1906లో దేశద్రోహం నేరం క్రింద ఆయనకు ఆరేళ్ళు ప్రవాసశిక్ష విధించారు. కారాగారంలో ఉన్నప్పుడే అతను “గీతారహస్యం” అనే పుస్తకం రాశారు. తిలక్ చరిత్రకారుడు కూడా. ఆర్యులు ఆర్కిటిక్ ప్రాంతం నుంచి వచ్చారని ఆయన అభిప్రాయం. భగవద్గీతపై ఆయన రచించిన భాష్యం–856 పేజీల గీతా రహస్యం అనే ఉద్గ్రంథం మొదటి కూర్పు ఆరు వేల ప్రతులు ఒక పక్షంలోనే అమ్ముడు పోయాయంటే అది ఎంత ప్రజాభిమానమైన గ్రంథమో స్పష్టం అవుతున్నది. అన్ని భారతీయ భాషల్లో దాని అనువాదాలు వెలువడ్డాయి. 1916 ఏప్రిల్ లో హోంరూల్ లీగ్‌ని స్థాపించి దాని లక్ష్యాలను వివరిస్తూ మధ్య భారత దేశంలో గ్రామ గ్రామాన తిరిగారు. అనీబిసెంటు అదే సంవత్సరం సెప్టెంబర్‌లో మొదలుపెట్టి హోంరూల్ ఉద్యమాన్ని దేశవ్యాప్తం చేసింది. ఆ ఉద్యమం ఉధృతంగా కొన సాగుతున్న సమయంలో ఒక కోర్టుకేసులో ఆయన లండనుకు వెళ్ళవలసి వచ్చింది. అప్పుడే, అంటే 1917 ఆగస్టులో అప్పటి సెక్రటరీ ఆఫ్ స్టేట్ మాంటేగు “బ్రిటిష్ సామ్రాజ్యంలో భాగమైన భారత దేశంలో బాధ్యతాయుత ప్రభుత్వాన్ని ఏర్పరచ డానికి వీలుగా అన్ని పాలనాంశాల్లో భారతీయులకు అధిక ప్రాధాన్యాన్ని వ్వడమే ప్రభుత్వ విధానమని బ్రిటిష్ ప్రభుత్వం తరపున ప్రకటించారు. బ్రిటిష్ ప్రభుత్వ నిజాయితీని నమ్మిన అనీబిసెంటు ఆ ప్రకటనతో ఉద్యమాన్ని ఆపేయగా, ఆ ప్రకటన స్పష్టంగా లేక పోవడంతో, తిలక్ విభేదించగా, ఇద్దరు నాయకులదీ చెరొక దారి కావడంతో హోంరూల్ ఉద్యమం చల్లబడి పోయింది. కానీ ప్రజల్లో తిలక్ రగిలించిన స్ఫూర్తి మాత్రం కొనసాగింది. అందుకే 1920లో ఆగస్టు 1వ తేదీన తిలక్ మరణం తో జాతీయోద్యమం చుక్కాని లేని నావ అవుతుందని చాలా మంది భయపడ్డారు.

# నేడు పింగళి వెంకయ్య జయంతి

### జాతీయ పతాక నిర్మాత పింగళి వెంకయ్య

### జాతీయ పతాకం ఎగిరే వరకు స్మరించుకోదగిన ధన్యజీవి పింగళి వెంకయ్య

జాతీయ పతాక నిర్మాత పింగళి వెంకయ్య ఆగస్ట్ 02, 1878లో కృష్ణా జిల్లా భట్ల పెనుమర్రులో ఆయన జన్మించారు. బొంబాయిలో సైనిక శిక్షణ పొంది ఆఫ్రికా వెళ్లారు. బోయరు యుద్ధంలో పాల్గొని తిరిగి వస్తూ అరేబియా, ఆఫ్ఘనిస్తాన్ పర్యటించారు. 1911–44 వరకు బందరు జాతీయ కళాశాలలో అధ్యా పకునిగా పనిచేశారు. మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో భూ గర్భ శాస్త్ర పరిశోధనలు చేసి డిప్లొమా పొందారు. 1924 నుండి 1944 వరకు నెల్లూరులో ఉండి మైకా గురించి పరిశోధనలు చేశారు. బొగ్గు వజ్రంగా మారే విధానాన్ని గురించి ‘తల్లిరాయి’ అనే పుస్తకం రాశారు. 1916లో ‘భారతదేశమునకు ఒక జాతీయ పతాకం’ అనే గ్రంథాన్ని రచించారు. ఈ గ్రంథంలో సుమారు 30 రకాల పతాకాలను ప్రదర్శించారు. 1921లో బెజవాడ అఖిల భారత కాంగ్రెస్ మహాసభలు జరిగినప్పుడు గాంధీజీ ఆదేశానుసారం త్రివర్ణ పతాకాన్ని రూపొందించారు. గాంధీ సూచన మేరకు దానిపై రాట్నం గుర్తు చేర్చారు. స్వాతంత్ర్యానంతరం నెహ్రూ సూచనమేరకు రాట్నం స్థానంలో అశోకచక్రం చేర్చబడింది. అశోకుని ధర్మచక్రం మన పూర్వ సంస్కృతికి సంకేతం. ఆఖరికి ధర్మచక్రంతో కూడిన త్రివర్ణ పతాకాన్ని 22




జూలై, 1948న జాతీయ పతాకంగా భారత జాతి స్వీకరించింది. ఏప్రిల్ 13, 1936 నాటి ‘యంగ్ ఇండియా’ పత్రికలో గాంధీజీ పింగళి వెంకయ్య ని ప్రత్యేకంగా ప్రశంసించారు. మన జాతీయ పతాకం’ పేరుతో యంగ్ ఇండియా పత్రికలో గాంధీజీ రాసిన మాటలు ప్రత్యేకమైనవి. “మన జాతీయ జెండా కోసం త్యాగం చేసేందుకు మనం సిద్ధంగా ఉన్నాం. మచిలీపట్నంలోని ఆంధ్ర జాతీయ కళాశాలలో పనిచేస్తున్న పింగళి వెంకయ్య ఒక పుస్తకం ప్రచురించారు. అందులో వివిధ దేశాల జెండాల నమూనాలు ఉన్నాయి. అలాగే మన జాతీయ పతాకం నమూనా ఎలా ఉండాలో కూడా ఆయన సూచించారు. జాతీయ పతాకాన్ని ఖరారు చేయడానికి కాంగ్రెస్ సభలలో ఆయన పడిన శ్రమ, తపనలకు నేను అభినందిస్తున్నాను. నేను విజయవాడ వెళ్లినప్పుడు ఆకుపచ్చ, ఎరుపు %–% ఆ రెండు రంగులతో పతాకాన్ని రూపొందించవలసిందని వెంకయ్య కు సూచించాను. పతాకం మధ్యలో ధర్మచక్రం ఉండాలని కూడా సూచించాను. తరువాత మూడు గంటలలోనే వెంకయ్య పతాకం తెచ్చి ఇచ్చారు. తరువాత తెలుపు రంగు కూడా చేర్చాలని భావించాం. ఎందుకంటే ఆ రంగు మన సత్య సంధతకీ, అహింసకీ ప్రతీకగా ఉంటుంది.” అని గాంధీజీ తన పత్రికలో రాశారు. 1963, జూలై 4 న వెంకయ్య దివంగతుడయ్యాడు. కన్నుమూసేముందు అతను చివరి కోరికను వెల్లడిస్తూ “నా అంత్య దశ సమీపించింది. నేను చనిపోయిన తర్వాత త్రివర్ణ పతాకాన్ని నా భౌతిక కాయంపై కప్పండి. శ్మశానానికి చేరిన తర్వాత ఆ పతాకం తీసి అక్కడ ఉన్న రావి చెట్టుకు కట్టండి. ఇది నా తుది కోరిక” అన్నాడు. నిరాడంబరమైన, నిస్వార్థమైన జీవితం గడిపిన మనిషి పింగళి వెంకయ్య.

# ఆపరేషన్ శివ్ శక్తి.. 100 రోజుల్లో 12 మంది మోస్ట్‌వాంటెడ్ టెర్రరిస్ట్‌లు హతం

**న్యూ డిల్లీ ఆగష్టు 1:**బీపహల్గాం దాడి తర్వాత దేశంలో ఉగ్రవాద కార్యకలాపాలపై భద్రతా దళాలు ప్రత్యేకంగా దృష్టిపెట్టాయి. ఇందులో భాగంగా జమ్ము కశ్మీర్‌లో ఉగ్రవాదుల ఏరివేతే లక్ష్యంగా పలు ఆపరేషన్‌లు చేపట్టాయి. ఈ ఆపరేషన్‌ల ద్వారా 100 రోజుల్లో 12 మంది మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్ట్‌లను అంతం చేసినట్లు సంబంధిత వర్గాలు తాజాగా వెల్లడించాయి. హతమైన 12 మందిలో ఆరుగురు పాకిస్థాన్ ఉగ్రవాదులు కాగా.. మిగతా వారు జమ్ము కశ్మీర్‌లో జరిగిన ప్రధాన ఉగ్రదాడుల్లో పాల్గొన్న స్థానికులు. ఈ ఏడాది ఏప్రిల్‌లో పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిన విషయం తెలిసిందే. మే 6–7 మధ్య చేపట్టిన ఈ ఆపరేషన్ సందర్భంగా పాక్‌లోని ఉగ్రస్థావరాలే లక్ష్యంగా విరుచుకుపడింది. ఈ దాడిలో 100 మందికిపైగా ఉగ్రవాదులను త్రివిధ దళాలు మట్టుబెట్టాయి. ఆ తర్వాత పలు ఆపరేషన్‌ల ద్వారా ఉగ్రవాద ఏరివేతను కొనసాగించాయి. వీటిలో అత్యంత ముఖ్యమైనది ‘ఆపరేషన్ మహాదేవ్’ ఈ ఆపరేషన్‌లో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పహల్గాం దాడికి పాల్పడిన ముగ్గురు ఉగ్రవాదులను భద్రతా దళాలు హతమార్చాయి. జులై 28న శ్రీనగర్‌లోని దచిగామ్ ప్రాంతం సమీపంలో సైన్యం, సీఆర్‌పీఎఫ్, జమ్ము కశ్మీర్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఈ ఆపరేషన్‌లో లష్కరే తోయిబా ఉగ్రవాదులు సులేమాన్, ఆఫ్ఘన్, జిబ్రాన్ హతమయ్యారు. వీరు పహల్గాం దాడికి పాల్పడిన ముష్కరులని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో స్వయంగా ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ తర్వాతి రోజే శివశక్తి పేరుతో మరో ఆపరేషన్ ను భద్రతా దళాలు మొదలు పెట్టారు. ఈ ఆపరేషన్‌లో సైన్యం మరో ఇద్దరు ఉగ్రవాదులను మట్టుబెట్టింది. పహల్గాం దాడి తర్వాత దక్షిణ కశ్మీర్, షోపియన్, పుల్వామాలో ఉగ్రవాదుల కోసం భద్రతా దళాలు వేట కొనసాగించాయి. షోపియన్‌లోని కెల్లర్ ఫారెస్ట్‌లో జరిగిన ఆపరేషన్‌లోముగ్గురు లష్కరే ఉగ్రవాదులు హతమయ్యారు. మే 15న ట్రాల్‌లోని నాదర్ ప్రాంతంలో జరిగిన మరో ఆపరేషన్‌లో ముగ్గురు ముష్కరులను మట్టుబెట్టాయి. పహల్గాం దాడికి ముందు పాక్




ఆక్రమిత కశ్మీర్‌లో దాదాపు 42 ఉగ్రవాద లాంచ్ ప్యాడ్‌లు చురుకుగ్గా పనిచేస్తున్నట్లు ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు గుర్తించాయి. వాటిల్లో 110–130 మంది ఉగ్రవాదులు ఉన్నట్లు పేర్కొన్నాయి. కశ్మీర్‌లో దాదాపు 70 నుంచి 75 మంది ఉగ్రవాదులు చురుగ్గా ఉండగా.. జమ్ము, రాజౌరి, పూంచ్‌లో 60–65 మంది ఉగ్రవాదులు ఉగ్ర కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు.

# ‘రష్యాతో ఇతరులు వాణిజ్యం చేస్తే తప్పు, మీరు చేస్తే ఒప్పా’..!

### అమెరికా అధ్యక్షుడు తీరుపై, చైనా ఆగ్రహం

**న్యూ డిల్లీ ఆగష్టు 1:**అమెరికా తీరుపై, ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీరుపై చైనా ఆగ్రహం వ్యక్తంచేసింది. రష్యా తో వాణిజ్యం చేయొద్దంటూ అమెరికా ప్రపంచ దేశాలను హెచ్చరించడంపై తీవ్రంగా మండిపడింది. తమ హెచ్చరికలను పెడచెవిన పెడితే భారీగా ఆంక్షలు విధిస్తామని ట్రంప్ పదేపదే హెచ్చరికలు జారీ చేస్తుండటంపై అసహనం వ్యక్తంచేసింది. అమెరికా దుర్నీతిని చైనా ఎండగట్టింది. మిగతా దేశాల సంగతి పక్కన పెడితే.. రష్యాతో అమెరికానే భారీగా వాణిజ్య కార్యకలాపాలు కొనసాగిస్తోందని ఆరోపించింది. ఈరోజు వరకు కూడా రష్యాతో అమెరికా వాణిజ్యం కొనసాగుతోందని తెలిపింది. ‘రష్యాతో ఇతరులు వాణిజ్యం చేస్తే తప్పు, మీరు చేస్తే ఒప్పా’ అని అమెరికాను ఐక్యరాజ్య



సమితిలో చైనా శాశ్వత ప్రతినిధి గెంగ్ షువాంగ్ నిలదీశారు. కాగా రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాలపై భారీ మొత్తంలో టారిఫ్‌లు విధిస్తామని డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ప్రపంచ దేశాలను హెచ్చరించారు. ఈ హెచ్చరికలపై గెంగ్ షువాంగ్ స్పందిస్తూ.. మిగతా దేశాల కంటే అమెరికానే ఎక్కువగా రష్యాతో వ్యాపారం చేస్తోందన్నారు. ఉక్రెయిన్‌కు కానీ, రష్యాకు కానీ తాము ఆయుధాలు సరఫరా చేయడంలేదని, అంతర్జాతీయ చట్టాలకు లోబడి వాణిజ్యం మాత్రమే చేస్తున్నామని తెలిపారు. భద్రతా మండలిలో చైనాపై అమెరికా ప్రతినిధి చేసిన ఆరోపణలను గెంగ్ షువాంగ్ తోసిపుచ్చారు. రష్యా, ఉక్రెయిన్‌తో తమ వాణిజ్య కార్యకలాపాలు అంతర్జాతీయ చట్టాలకు లోబడే ఉన్నాయని, ఎలాంటి ఉల్లంఘనలు జరగలేదని తెలిపారు. ఇతరులపై నిందలు వేయడం మానుకోవాలని అమెరికాకు హితవు పలికారు. అదేవిధంగా ఉక్రెయిన్ సంక్షోభానికి ముగింపు పలకడానికి ఇదే సరైన సమయమని, అందుకు కృషి చేయాలని ట్రంప్‌కు సూచించారు.

# ధర్మస్థలలో బయిటపడుతున్న మృతదేహాలు

### మిస్టరీ కంటిన్యూ...

**బెంగళూరు, ఆగస్టు 1:**కర్ణాటకలోని ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రం ‘ధర్మస్థల’ మరణాల మిస్టరీ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న సిట్ అధికారులకు కేసులో తొలి ఆధారం లభించింది. తవ్వకాల్లో భా గంగా శ్రీక్షేత్ర సమీపంలోని అటవీ ప్రాంతంలోని ఆరో పాయింట్ వద్ద మానవ అస్థిపం జర అవశేషాలను గుర్తించారు. ఇప్పటివరకు ఈ కేసులో బయటపడిన తొలి ఆధారం ఇదే కావడంతో కేసు దర్యాప్తులో ఉత్కంఠ పెరిగినట్టయింది. అస్థిపంజరం ఆనవాళ్లు చూ స్తుంటే అది ఒక పరుషుడివి అయి ఉండవచ్చని సిట్ అధికారులు భావిస్తున్నారు. అవశే షాలను ఫోరెన్సిక్ బృందం సేకరించి ల్యా చ్‌కు పంపించింది. ల్యాబ్‌లో పరీక్షించిన తర్వాత వాటి వివరాలు బయటికి రానున్నాయి. శ్రీక్షేత్ర సమీపంలోని అటవీ ప్రాం తంలో రెండు దశాబ్దాల్లో అనేక మంది మహిళలు, యువతుల శవాలను పూడ్చి పెట్టినట్టు ఒక మాజీ పారిశ్యుధ్య కార్మికుడు పోలీసులకు ఫిర్యాదు చేయడం సంచలనం రేపింది. దీంతో ధర్మస్థల సాముహిక ఖనన కేసు దర్యాప్తును సిట్ ప్రారంభించింది. ఇప్పటికే మృతదేహాలు పూడ్చి పెట్టిన 15 అను మానిత ప్రదేశాలను పోలీసులు గుర్తించిన విషయం తెలిసిందే. పారిశుద్ధ్య కార్మికుడి ఫిర్యాదు ఆధారంగా కేసు దర్యాప్తు మొదలుపెట్టిన సిట్ అధికారులు అతడిని వెంట తీసు కెళ్లి నేత్రావతి నది స్నానఘట్టానికి అవతలి వైపు ఉన్న ప్రాంతం నుంచి పరిశోధన ప్రారంభించారు. మృతదేహాలను పూడ్చిపెట్టనట్టుగా మొత్తం 13 చోట్లను అతడు గుర్తిం చగా.. ఆ ప్రాంతాల్లో తవ్వకాలు కొనసాగిస్తున్నారు. కాగా బుధవారం వరకు ఐదు ప్రదే శాల్లో మాన అవశేషాలకు సంబంధించిన ఆధారాలు లభించలేదని పోలీసు వర్గాలు ధ్రువీకరించాయి. తాజాగా ఆరో పాయింట్ వద్ద మృతదేహం అవశేషాలు బయటపడడంతో కేసులో కీలక పురోగతి లభించి నట్టయింది. దక్షిణ కన్నడ జిల్లాలో ధర్మస్థల ప్రముఖ శైవక్షేత్రం. గతంలో అక్కడ పనిచేసిన ఒక పారిశుద్ధ్య కార్మికుడు 1998 నుంచి 2014 మధ్య ఇక్కడ అనేక మంది మహిళలు, యువతులు హత్యకు గురయ్యారని.. వారి మృతదేహాలను తానే పూడ్చి పెట్టానని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అవన్నీ అనుమానాస్పద రీతిలో అ దృశ్యమైన వారివని, లైంగిక దాడులకు గురై చనిపోయినట్టు అనుమా నాలు ఉన్నట్టు పేర్కొనడం సంచలనం కలిగించింది. మృతదేహాలను ఎవరు ఖననం చేయమన్నారు? వాటిని ఎవరి సహాయంతో తీసుకువెళ్లేవారు? తదితర ప్రశ్నలపై పారి శుద్ధ్య కార్మికుడి నుంచి సిట్ అదికారులు వివరాలు అడిగి తెలుసుకుం టున్నారు. ప్రస్తుతం దీనిపై దర్యాప్తు కొనసాగుతోంది.

# మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి ల సభ్యత్వాన్ని రద్దు చేయాలి

**హైదరాబాద్:**ఇద్దరు ఎమ్మెల్యే సభ్యత్వాలను రద్దు చేయాలని ఓయూ విద్యార్థి ఉద్యమ నేత కోట శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేసారు. గత ఎన్నికల్లో మామ అల్లుళ్ళు తప్పుడు అఫిడవిట్లు సమర్పించారు. మామ అల్లుళ్ళు పలు ఆస్తులను అఫిడవిట్లలో చూపించలేదు. 2023 ఎన్నికల్లో చామకూర మల్లారెడ్డి, మర్రి రాజశేఖరరెడ్డి, తప్పుడు ఎన్నికల అఫిడవిట్ దాఖలు చేశారని అన్నారు. మల్లారెడ్డి సుమారు 200 కోట్ల విలువైన పోచంపల్లి, కండ్ల కోయ, దూలపల్లి గ్రామాల లోని 21 ఎకరాల భూమిని చూపించలేదు. ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి దూలపల్లి గ్రామంలోని సుమారు 100 కోట్లకు పైగా విలువైన 2 ఎకరాల భూమిని ఎన్నికల అఫిడవిట్ లో చూపించలేదు. ఎలక్షన్ కమిషన్ ను తప్పుదారి పట్టించి ప్రజలను వంచించారు. ఇద్దరు ఎమ్మెల్యేల విషయంలో హైకోర్టును ఆశ్రయిస్తాం. మల్లారెడ్డి అక్రమాలు చాలా ఉన్నాయి త్వరలోనే బయట పెడతాం. సమాచార హక్కు చట్టం ద్వారా పూర్తి సమాచారం తమ వద్ద ఉంది. తప్పుడు అఫిడవిట్ లు సమర్పించిన మామ అల్లుడు ఎమ్మెల్యే లు మల్లారెడ్డి, రాజశేఖరరెడ్డి సభ్యత్వాలను రద్దు చేయాలని డిమాండ్ చేసారు. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల అధికారికి, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పూర్తి ఆధారాలతో ఫిర్యాదు చేస్తామనిఅన్నారు.

# కేసీఆర్ డైరక్షన్ లో కవిత...?

**మెదక్, ఆగస్టు 1:** కేసీఆర్ తో కేటీఆర్, హరీష్ రావు భేటీలో ఏం జరిగింది. ఏ విషయాలపై ప్రధానంగా చర్చ జరిగింది అనే విషయంలో ఆసక్తికరమైన వార్తలు మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.మిగతా విషయాలపై ఏం చర్చ జరిగినా, ప్రధానంగా జాగృతి అధ్యక్షురాలు, తన చెల్లెలు కవితపై చర్యలు తీసుకోవాలని కేసీఆర్ కు కేటీఆర్ అడిగారని, ఆ విషయంపై కేసీఆర్ ససేమిరా అనడంతో తండ్రి, కొడుకు మధ్య అభిప్రాయ బేధం నెలకొందని మీడియా కథనాలు రావడంతో తెరవెనుక ఏం జరుతుందని ఆసక్తికరమైన చర్చ ఊపందుకుంది. అది ఏ పరిస్తితులకు దారి తీస్తుందో అని పార్టీలో గందరగోళం ఆవరించింది.బీసీ రిజర్వేషన్ల విషయంలో పార్టీ స్టాండ్, స్థానిక సంస్థల ఎన్నికలకు ఏవిధంగా సంసిద్ధం కావాలి అనే విషయాలు చర్చించినట్లు తెలుస్తోంది. అయితే బీసీలకు 42 రిజర్వేషన్ సాధించే దిశగాకవిత 72 గంటల పాటు దీక్ష చేస్తానని ప్రకటించడంపై కూడా చర్చిస్తూ, పార్టీ నిర్ణయాల కన్నా ముందే కవిత దూకుడు ప్రదర్శించడంపై కేటీఆర్ కొంత అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది.తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత బీఆర్ఎస్ పార్టీ నాయకత్వానికి కొరకరాని కొయ్యగా మారిందని, ఆమె దూకుడుకు కళ్ళెం వేయకుంటే పార్టీలో



గందరగోళం చోటు చేసుకుంటుందని, ఆమెపై చర్యలు తీసుకోవాలని కేటీఆర్, కేసీఆర్ కు సూచించగా, ఆ విషయం తనకు వదిలివేయండి. మిగతా విషయాలు చూసుకోవాలని కేసీఆర్ చెప్పినట్లు మీడియా కథనాలు వస్తున్నాయి. అయితే కేసీఆర్ తన కూతురైన కవితను ఎందుకు వెనకవేసుకు వస్తున్నాడు, దీని వెనుక ఏదైనా వ్యూహరచన జరుగుతోందా అనే కోణంలో చర్చ జరుగుతోంది. కేటీఆర్ రాజకీయాల్లోకి వచ్చేనాటికి ముందునుంచే కవిత, కేసీఆర్ కు కూతురుగానే కాకుండా రాజకీయాల్లో చేదోడు వాదోడుగా ఉంటూ వస్తున్నారు. పార్టీలో ఏ నిర్ణయమైనా, కవితకు తెలియకుండా జరగలేదని, పార్టీ టిక్కెట్లు ఇచ్చే విషయంలో కూడా కవిత చొరవ చూపడం, తన టీమ్ తో ఆశావహులపై సమాచారం తెప్పించుకొని, అభ్యర్థుల ఎంపికల్లో ప్రధాన భూమిక నిర్వహించేవారు. అలాంటి పరిస్థితి నుంచి తనను పార్టీలో ప్రాముఖ్యత తగ్గించేలా వ్యవహరించడంపై ఆమె కినుక వహించింది.కానీ కేసీఆర్ మాత్రమే తమ నాయకుడని, మిగతా వారెవరు తనకు లెక్కలోకి రారని అర్థమయ్యే రీతిలో మీడియాలో బహిరంగంగానే ఆమె మాట్లాడడం, కేసీఆర్ దేవుడని, కానీ ఆయన చుట్టూ దయ్యాలు ఉన్నాయని ఆమె కామెంట్ చేయడం, ఆ విషయంలో పార్టీ ఆమెను ప్రశ్నించే ధైర్యం చేయలేకపోవడానికి కారణం కేసీఆర్ ఆమెకు అండగా ఉన్నారని చర్చ జరిగింది. గతంలో కేటీఆర్ ను ముఖ్యమంత్రి చేయాలనే, సూచనలు, ప్రతిపాదనలను కూడా కేసీఆర్ ఒక మాటతో చర్చకు తెరదించారు. ఈ విషయంలో కూడా కవిత సూచన మేరకే కేసీఆర్ ఆ విషయంలో నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం జరిగింది. కేసీఆర్ తీసుకునే ప్రతీ నిర్ణయం వెనుక కవిత ప్రమేయం ఉన్నట్లుగా ప్రచారం జరిగింది. అయితే కవిత స్వయం ప్రకటిత నిర్ణయాలు చేస్తుందా లేక కేసీఆర్ ఆమె వెనుక ఉండి నడిపిస్తున్నారా అనే అనుమానాలు పార్టీలో వ్యక్తమౌతున్నాయి.

### రాహుల్ గాంధీ వ్యాఖ్యలు
## బాధ్యతారాహిత్యం.. తప్పుపట్టిన ఈసీ



**న్యూఢిల్లీ:** మహారాష్ట్రలో ఏవిధంగా ఓట్ల చోరీ జరిగిందో బిహార్‌లోనూ అదే తరహా ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలను భారత ఎన్నికల సంఘం శుక్రవారం నాడు తోసిపుచ్చింది. ఈ ఆరోపణలు పూర్తిగా నిరాధారమని, బాధ్యతా రహితమని పేర్కొంది. ప్రతిరోజూ వచ్చే ఇలాంటి బెదిరింపులను తాము పట్టించుకోమని తెలిపింది. పారదర్శకంగా పని చేస్తూ రాహుల్ వంటి వారు చేస్తున్న బాధ్యతారహిత వ్యాఖ్యలను పట్టించుకోనవసరం లేదని తమ అధికారులకు కూడా చెప్పామని ఈసీ స్పష్టం చేసింది.

**రాహుల్ ఏమన్నారు?**

బిహార్‌లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను రాహుల్ మొదట్నుంచీ వ్యతిరేకిస్తున్నారు. 'ఓట్ల చోరీ జరుగుతోంది. దీనికి ఎన్నికల కమిషన్ సహకరిస్తోందనడానికి మా దగ్గర తిరుగులేని ఆధారాలు ఉన్నాయి. 100 శాతం సాక్ష్యాలున్నాయి. మేము వాటిని బహిరంగ పరిస్తే ఈసీ ఏథంగా ఓట్ల చోరీ చేస్తోంది, ఎవరి కోసం చేస్తోందనేది యావద్దేశానికి తెలుస్తుంది' అని రాహుల్ అన్నారు. బీజేపీ కోసమే ఈసీ ఈ ఓట్ల చోరీకి పాల్పడుతోందని ఆయన ఆరోపించారు.

**ఆటం బాంబ్**

ఎన్నికల కమిషన్ నుంచి ఎలాంటి సహకారం లేకపోవడంతో ఓట్ల చోరీపై తమ పార్టీ స్వతంత్ర విచారణ జరిపిందని రాహుల్ తెలిపారు. ఇందు కోసం 6 నెలలు పట్టిందన్నారు. 'అటం బాంబు' వంటి వివరాలు వెలికితీశామని, ఆ బాంబు పేలితే ఎన్నికల సంఘం దాక్కోవడానికి అవకాశమే ఉండదని రాహుల్ సంచలన వ్యాఖ్యలు చేశారు.

### ఎఫ్ 35 విమానాల
# కొనుగోళ్లకు బ్రేక్

**భారత్ ఫస్ట్ షాక్**

**న్యూఢిల్లీ, ఆగస్టు 1:**భారత్‌పై అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌ల పిడుగు వేశారు. పాతిక శాతం సుంకాలను విధిస్తున్నట్లు ప్రకటించారు. దీనికి అనేక కారణాలు చెబుతున్నా.. అక్కసుతోనే ఈ టారిఫ్‌లు వేశారన్నది సుస్పష్టం. బ్రిక్స్‌లో భాగమైనందుకు, రష్యా ఆయిల్ కొంటున్నందుకు, తమ వస్తువులపై ఎక్కువ పన్నులు వేస్తున్నందుకు ఇలా అనేక విషయాలను మనసులో పెట్టుకుని ట్రంప్ భారత్‌పై పిడుగులాంటి టారిఫ్‌ను సంధించారు. ఇది ప్యూర్ మైండ్‌గేమ్‌తో తీసుకున్న డెసిషన్. దీంతో భారత్‌లో పొలిటికల్ దుమారం కూడా చెలరేగింది. ఈ క్రమంలోనే వాణిజ్య ఒప్పందం గురించి భారత్–అమెరికా మధ్య చర్చలు జరుగుతున్నాయి. అయితే, ఈలోగా, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారతదేశంపై 25 శాతం సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించారు. ఆగస్టు 7 నుండి ఈ సుంకాలు అమలులోకి రానున్నాయి. ఈ నేపథ్యంలోనే భారతదేశం కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. నివేదిక ప్రకారం, అమెరికాకు %ఖీ%–35 యుద్ధ విమానాలను కొనుగోలు చేయడానికి భారత్ నిరాకరించింది. అమెరికన్ ఉత్పత్తుల కొనుగోలును వేగవంతం చేయాలని భారత ప్రభుత్వం ఆలోచిస్తున్నప్పటికీ, అమెరికా నుండి అదనపు రక్షణ ఉత్పత్తులను కొనుగోలు చేసే అవకాశం లేదని అధికారులను ఉటంకిస్తూ బ్లూమ్‌బెర్గ్ తన కథనంలో పేర్కొంది. బ్లూమ్‌బెర్గ్ విడుదల చేసిన నివేదిక ప్రకారం, %ఖీ%–35 స్టీల్త్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ కొనుగోలుపై ఆసక్తి లేదని భారత్ అమెరికాకు తెలియజేసిందని పేర్కొంది. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫిబ్రవరి 2025లో అమెరికాను సందర్శించారు. వైట్ హౌస్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను కలిశారు. ఈ సందర్భంగా, ట్రంప్ భారతదేశానికి %ఖీ%–35 యుద్ధ విమానాలను విక్రయించడానికి ముందుకొచ్చారు. అయితే దేశీయంగా రక్షణ పరికరాల ఉమ్మడి రూపకల్పన, తయారీపై దృష్టి సారించిన భాగస్వామ్యాలపై భారత ప్రభుత్వం ఎక్కువ ఆసక్తి చూపుతుందని అధికారులు తెలిపారు. దీనిపై భారత రక్షణ మంత్రిత్వ శాఖ ఇంకా స్పందించలేదు. ఆగస్టు 1 నుండి భారతదేశం నుండి దిగుమతి చేసుకునే ఉత్పత్తులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 25 శాతం సుంకాన్ని ప్రకటించారు. రష్యా నుండి దిగుమతులకు శిక్షాత్మక చర్యగా భారతదేశంపై జరిమానాను కూడా విధించారు. ఇది 25 శాతం సుంకం నుండి వేరుగా ఉంటుంది. భారతదేశం సుంకాలు చాలా ఎక్కువగా ఉన్నందున అమెరికా భారతదేశంతో సాపేక్షంగా తక్కువ వాణిజ్యం చేసిందని ట్రంప్ భావిస్తున్నారు. భారతదేశంపై డొనాల్డ్ ట్రంప్ సుంకాలు విధించిన తర్వాత, కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పియూష్ గోయల్ పార్లమెంటులో ఒక ప్రకటన చేశారు. సుంకాల ప్రభావాలను అంచనా వేస్తున్నామని, జాతీయ ప్రయోజనాలను పరిరక్షించడానికి, ముందుకు తీసుకెళ్లడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని పియూష్ గోయల్ అన్నారు. రైతులు, కార్మికులు, వ్యవస్థాపకులు, ఎగుమతిదారులు, %మీవీజు%లు, పరిశ్రమలోని అన్ని వాటాదారుల రక్షణ, ప్రోత్సాహానికి మోదీ ప్రభుత్వం అత్యంత ప్రాముఖ్యతనిస్తుందని పియూష్ గోయల్ పార్లమెంటులో స్పష్టం చేశారు.

### 'ట్రస్ట్ బ్యాంకు' ఏర్పాటు చేసే యోచనను ప్రభుత్వం
# వెంటనే విరమించుకోవాలి

## బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్

**హైదరాబాద్ ఆగష్టు 1:**ఫీజుల చెల్లించకుండా ఫీజుల స్కీములు ఎత్తివేయడానికి 'ట్రస్ట్ బ్యాంకు' ఏర్పాటు చేసే యోచనను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీ విద్యార్థుల స్కాలర్షిప్ ఫీజు బకాయిలు చెల్లించాలని క్విజ్ల కోసం ట్రస్ట్ బ్యాంక్ ఏర్పాటును నిర్మించుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఇందిరాపార్క్ వద్ద వేలాది మంది విద్యార్థులతో భారీ ర్యాలీ ధర్నా ను నిర్వహించారు. బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేముల రామకృష్ణ నాయకత్వం వహించారు. సందర్భంగా ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో 14 లక్షల మంది కాలేజీ విద్యార్థుల ఫీజుల బకయి 6000 కోట్లపైనే ఉందని వీటిని వెంటనే చెల్లించాలనిలు, అలాగే 100 బీసీ కాలేజ్ హాస్టల్ లో మంజూరు చేయాలని 119 బీసీ గురుకులాలు మంజూరు చేయాలని బీసీ గ్రూప్ గురుకుల పాఠశాలలో 20 శాతం సీటు పెంచాలని డిమాండ్ చేశారు. ముఖ్యమైన స్కాలర్షిప్ విలువ కాయలు స్కీమును ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగతన్నారు. విద్యా రాజ్యాంగ బద్ధమైన హక్కు అని ఎస్సీ ఎస్టీ బీసీలకు అభివృద్ధికి ఉపయోగపడే ఈ స్కీమును ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా నేరుగా వస్తుందని ఆర్ కృష్ణయ్య విమర్శించారు అనేక స్క్రీన్ లకు లక్షల కోట్ల అప్పులు తెస్తున్న ప్రభుత్వం లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే ఈ పథకం కు 6000 కోట్లు అప్పు చేస్తే ఎవరు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు ఈ పథకం కు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 20 నెల కాలంలో 20 రూపాయలు కూడా విడుదల చేయలేదని అన్నారు ఈ పథకం అమలుకు ఏటా నాలుగు శాఖల ద్వారా బడ్జెట్లో 5000 కోట్లు కేటాయించాలని అయినా కూడా ఒక రూపాయి కూడా విడుదల చేయకుండా అవి ల్యాప్స్ అయినాయని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎస్సీ ఎస్టీలకు ఈ పథకం కింద



వేరే కోట్ల రూపాయలు కేటాయిస్తుందని వీటిని ఏం చేస్తున్నారని కృష్ణయ్య ప్రశ్నించారు .పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రెండు జపాలుగా 1500 కోట్లు విడుదల చేశారని సందర్భంగా ఆయన గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఫీజులు స్కాలర్షిప్ల ఫిర్యాదు చేయకుండా విద్యార్థుల భవిష్యత్తుతో చలగాటం మారుతుందని ఆయన తీర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసారు. ఈ స్కీమును అమలు చేయకపోవడం వల్ల లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలోకి నెత్తిమీద పడుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజులు చెల్లిస్తామని ప్రభుత్వం కొత్త నాటకానికి తెరలేపిందని కృష్ణయ్య దుయ్యబట్టారు. ఈ స్కీం పెట్టిన తర్వాత గ్రామాల్లో వ్యవసాయ కూలీలు పిల్లలు కూలీల పిల్లలు మెడిసిన్ ఇంజనీరింగ్ పీజీ డిగ్రీలు చదువుతున్నారు అన్నారు సమాజంలో గునాత్మకమైన మార్పు ప్రారంభమైందని చైల్డ్ లేబర్ అరికట్టబడిందని ప్రతి ఒక్కరు ఉన్నత విద్యను చదువుకుంటున్నారన్నారు. ఈ గుణాత్మక మార్పును చదువుకోకుండా ప్రభుత్వము అడ్డుకుంటుందని కృష్ణయ్య విమర్శించారు. ఈ కార్యక్రమం లో సిపిఐ జాతీయ నాయకులు కే నారాయణ, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, గుజ్జ సత్యం,వకులాబారణం కృష్ణమోహన్ రావు, నీల వెంకటేష్, పగుడాల సుధాకర్, నందకిషోర్, రాందేవ్, చంద్రశేఖర్, ప్రసాద్, మనీష్, శివ యాదవ్, నరేష్ గౌడ్, శివ ముదిరాజ్, తిరుమలేష్, రజాక్ తదితరులు పాల్గొన్నారు

### మెరుపు దాడులు..
## భారీగా నగదు స్వాధీనం: ఏసీబీ




**హైదరాబాద్, ఆగస్ట్ 01**: ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది లంచం డిమాండ్ చేస్తే వెంటనే తమకు ఫిర్యాదు చేయాలని రాష్ట్ర ప్రజలకు తెలంగాణ అవినీతి నిరోధక శాఖ ఉన్నతాధికారులు శుక్రవారం హైదరాబాద్‌లో సూచించారు. అవినీతిని నిరోధించేందుకు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విస్తృతంగా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. అందులో భాగంగా బహిరంగ ప్రదేశాల్లో పోస్టర్లు, స్టిక్కర్లు ద్వారా అవినీతికి వ్యతిరేకంగా ఫిర్యాదులు చేసేలా ప్రజలను అప్రమత్తం చేస్తున్నామన్నారు. అయితే రాష్ట్రంలో అవినీతి అధికారులపై మెరుపు దాడులు చేసినట్లు చెప్పారు. ఆ క్రమంలో 2025 జులై మాసంలో మొత్తం 22 అవినీతి కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఆ జాబితాలో ట్రాప్ చేయడం, లెక్కకు మించిన ఆదాయం కలిగి ఉండడం, క్రిమినల్ మిస్ కండక్ట్ తదితర కేసులు ఉన్నాయని పేర్కొన్నారు. ట్రాప్ కేసుల్లో రూ.5.75 లక్షలు, లెక్కకు మించిన ఆదాయం కేసులో రూ.11.5కోట్ల విలువైన ఆస్తులు వెలుగులోకి వచ్చాయన్నారు. అలాగే ఆర్టీఏ, చెక్ పోస్టులు, సబ్ రిజిస్ట్రార్ తదితర కార్యాలయాల్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ఆ సమయంలో లెక్కల్లోకి రాని రూ.1.49 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అయితే ఈ ఏడాది జనవరి నుంచి జులై మాసం వరకు 148 కేసులు నమోదు చేసినట్లు తెలిపింది. ఈ కేసులో ప్రమేయం ఉన్న మొత్తం 145 ప్రభుత్వ ఉద్యోగులు / ఔట్ సోర్సింగ్ సిబ్బందిని అరెస్ట్ చేశామన్నారు. అలాగే మొత్తం రూ.30.32 లక్షలు ట్రాప్ కేసుల్లో స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. లెక్కకు మించిన ఆదాయం కేసుల్లో ఆస్తుల విలువ రూ.39కోట్లకు పైగా ఉందన్నారు.మరోవైపు నీటి పారుదల శాఖలో పలువురు ఇంజనీర్లు.. ఇంజనీర్ ఇన్ చీఫ్ మరళీధర్ రావు, నూనె శ్రీధర్‌తోపాటు మరో ఇంజనీర్ హరిరామ్‌ను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. ఈ ముగ్గురు అధికారుల వద్దే దాదాపు రూ.1000 కోట్లకు పైగా అవినీతి నగదు ఉన్నట్లు ఈ సందర్భంగా ఏసీబీ అధికారులు నిర్ధారించారు.

### మోసం, దగా, నయవంచనకు
# మరో పేరు కాంగ్రెస్

**-బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**అధికారం కోసం అడ్డమైన హామీలు ఇచ్చిన రేవంత్ నమ్మకద్రోహానికి మరో ఉదాహరణ ఫార్మా సిటీ**

**ఎన్నికల సమయంలో హామీ ఇచ్చినట్టుగా ఫార్మా రైతులకు భూములను తిరిగి ఎందుకు ఇవ్వడం లేదు. రైతులతో ఎందుకు చర్చించడం లేదు?**

**అనుముల అన్నదమ్ముల కోసమే ఫార్మా భూముల్లో ఫ్యూచర్ సిటీ**

**ఫార్మా రైతుల భూములను తిరిగి ఇచ్చేవరకు బీఆర్ఎస్ పోరాడుతుంది**

**హైదరాబాద్:**కాంగ్రెస్ అంటేనే మోసం, దగా, నయవంచన అన్న నిజం ఫార్మా సిటీ భూముల వ్యవహారంతో మరోసారి తెలిసిందన్నారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. తారక రామారావు. అధికారంలోకి వస్తే ఫార్మా సిటీని రద్దుచేసి భూములను తిరిగి ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇతర అవసరాలకు వాటిని మళ్లించడం అత్యంత నీచమైన చర్య అని మండిపడ్డారు. అధికారం ఉందన్న అహంకారంతో ప్రజల అనుమతి లేకుండా భూముల సర్వే జరపాలనుకోవడం ఫాసిస్టు చర్య అన్నారు. మా భూములు మాగ్గావాలె అని మర్లవడ్డ రైతులపై అక్రమ కేసులు పెడుతున్న రేవంత్ రాక్షసత్వాన్ని అడ్డుకుంటామన్నారు. ఫార్మా రైతులను నిలువునా ముంచి అనుముల అన్నదమ్ముల కోసమే ఫ్యూచర్ సిటీ ని రేవంత్ రెడ్డి నిర్మిస్తున్నాడని కేటీఆర్ విమర్శించారు. అడుగడుగునా అన్నదాతలు మర్లవడుతున్నా, ఏకంగా ఎమ్మెల్యేల ఇళ్లు ముట్టడిస్తున్నా ముఖ్యమంత్రి రేవంత్ కి బుద్ధి రావడం లేదన్నారు. చట్టప్రకారం భూములను తిరిగి పొందే హక్కు ఉన్న రైతులతో ప్రభుత్వం ఎందుకు చర్చించడం లేదని ప్రశ్నించారు. ఓవైపు ఫార్మా సిటీ రద్దు చేస్తున్నట్టు ప్రకటించి, మరోవైపు కొనసాగిస్తామని హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిన రేవంత్ ప్రభుత్వం, అటు ప్రజలను, ఇటు న్యాయస్థానాలను మోసం చేసిందన్నారు. ఫార్మా సిటీ రద్దైతే తమ భూములు తిరిగి వస్తాయని ఆశపడ్డ రైతుల నోట్లో మట్టికొడుతున్న రేవంత్ రెడ్డికి కర్రుగాల్చి వాతపెట్టేందుకు అన్నదాతలు సిద్ధంగా ఉన్నారని కేటీఆర్ హెచ్చరించారు. లగచర్ల గిరిజన రైతుల భూములు,



కంచె గచ్చిబౌలి అటవీ భూములు, అనుముల బ్రదర్స్ కోసం ఇప్పుడు ఫార్మాసిటీ అన్నదాతల భూములను చెరబట్టే పన్నాగాల దాకా..రేవంత్ పాపాల పుట్ట రోజురోజుకూ పెరిగిపోతూనే ఉందన్నారు కేటీఆర్.అబద్ధపు హామీలి ఇవ్వడం, యథేచ్చగా చట్టాలను ఉల్లంఘించడం, ప్రశ్నించిన వారిని వేధించడం, సిగ్గులేకుండా భూ కబ్జాలు చేయడమే మూల స్తంభాలుగా రేవంత్ ప్రభుత్వ పాలన నడుస్తుందని కేటీఆర్ మండిపడ్డారు. అంతరించి పోయాయని అనుకున్న రాబందులు కాంగ్రెస్ నేతల రూపంలో తెలంగాణ ప్రజలను పీక్కు తింటున్నాయని చెప్పారు. దోస్తులకు దోచిపెట్టేందుకు చీకటి ఒప్పందాలతో తెరపైకి తెచ్చిన ఫ్యూచర్ సిటీకి అక్రమంగా భూములు కేటాయిస్తే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. భూములు తిరిగి ఇచ్చేవరకు రైతుల పక్షాన బీఆర్ఎస్ ఉద్యమిస్తుందని కేటీఆర్ స్పష్టం చేశారు.

### దేశంలో హాట్ టాపిక్ గా మారిన
## కేరళ నన్స్ అరెస్ట్..



**ఇంటర్నెట్ డెస్క్:** ఛత్తీస్‌గఢ్‌లో కేరళ నన్స్ అరెస్ట్ వ్యవహారం దేశవ్యాప్తంగా హాట్ టాపిక్ అవుతోంది. దుర్గ్ రైల్వేస్టేషన్‌లో జులై 25న కేరళకు చెందిన ఇద్దరు నన్స్ సిస్టర్ ప్రీతి మేరీ, సిస్టర్ వందన ఫ్రాన్సిస్‌ను ఛత్తీస్‌గఢ్ పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. మానవ అక్రమ రవాణా, బలవంతపు మతమార్పిడి ఆరోపణలపై ఈ అరెస్టులు జరిగాయి. అయితే, ఈ ఘటన ఇప్పుడు దేశ రాజకీయ, సామాజిక వర్గాల్లో చర్చనీయాంశమైంది. పార్లమెంటు వెలుపల సైతం కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ సహా పులువురు రాజకీయ నేతలు ప్లకార్డులు చేతబట్టి నిరసనలకు దిగారు. అటు, కేరళ వ్యాప్తంగా క్రిస్టియన్ వర్గాలు నిరసన ప్రదర్శనలు చేస్తున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో అరెస్టు చేసిన ఇద్దరు కేరళ నన్స్ లను వెంటనే విడుదల చేసేలా జోక్యం చేసుకోవాలని కోరుతూ డీఎంకే ఎంపీ విల్సన్ .. కేంద్ర మంత్రులు అమిత్ షా, కిరణ్ రిజిజుకు లేఖ రాశారు కాగా, ఛత్తీస్‌గఢ్‌లోని దుర్గ్ రైల్వేస్టేషన్ సమీపంలో ముగ్గురు గిరిజన యువతులతో కలిసి ప్రయాణిస్తున్న నన్స్‌ను బజరంగ్ దళ్ సభ్యులు అడ్డుకున్నారు. మానవ అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని, మతమార్పిడి చేస్తున్నారని నన్స్ మీద బజరంగ్ దళ్ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వీరిన పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే, సదరు యువతులు స్వచ్ఛందంగా ఉద్యోగ అవకాశాల కోసం ఆగ్రా వెళ్తున్నారని, వారి దగ్గర చెల్లుబాటు అయ్యే డాక్యుమెంట్లు కూడా ఉన్నాయని నన్స్ వాదించారు. అయినప్పటికీ, ఈ ఆరోపణల ఆధారంగా నన్స్‌ను అరెస్టు చేసి దుర్గ్ సెంట్రల్ జైలులో ఉంచారు.

వార్తాతరంగాలు
శనివారం 02 ఆగస్టు 2025

# పార్టీ పిరాయింపు లకు బ్రాండ్ అంబాసిడర్ బిఆర్ ఎస్ పార్టీ

**రాష్ట్రంలో ఉప ఎన్నికలు రావు:ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**



**హైదరాబాద్:**కేటీఆర్, హరీష్ రావు రాష్ట్రం లో కొత్త డ్రామా కి తెర తీశారు. ఉప ఎన్నికలు వస్తాయి అని అంటున్నారు. రాష్ట్రం లో ఉప ఎన్నికలు రావని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. బీఆర్ ఎస్ అధికారం లో ఉన్న పదియేళ్ళ లో 60 మంది ప్రతిపక్ష ఎంఎల్ఏ లను కొనుగోలు చేసిన నీచ చరిత్ర కేసీఆర్ ది. అప్పుడు రాని ఉపఎన్నికలు ఇప్పుడు ఎలా వస్తాయని అయన ప్రశ్నించారు. కాంగ్రెస్,టీడీపీ,వై ఎస్ ఆర్ సీ పీ,బీఎస్పీ చివరికి కమ్యూనిస్ట్ పార్టీ ఎంఎల్ ఏ లను బెదిరించి,ప్రలోభ పెట్టి అవినీతి డబ్బు తో కొనుగోలు చేసిన నీచులు మీరు. దేశం లో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని ఖూనీ చేసిన చరిత్ర బీఆర్ ఎస్ పార్టీ ది. పార్టీ పిరాయింపు లకు బ్రాండ్ అంబాసిడర్ బిఆర్ ఎస్ పార్టీ. పార్టీ ఫిరాయింపుల గురించి మాట్లాడే అర్హత బీఆర్ ఎస్ కు లేదు. మీరు చేసిన ఫిరాయింపుల పైన ముందు కేసీఆర్ ముక్కు నేలకు రాసి మరీ క్షమాపణ చెప్పాలి . ఒక వేళ ఉప ఎన్నికలు వచ్చినా అన్ని సీట్లు మేమే గెలుస్తాం. పార్లమెంట్ ఎన్నికల్లో డిపాజిట్ లు పోయినట్లు ఉప ఎన్నికలు వస్తే బీ ఆర్ ఎస్ కు అదే జరుగుతుంది. మా సీఎం రేవంత్ రెడ్డి గేట్లు ఓపెన్ చేస్తే మీ కుటుంబం లోని ముగ్గరు నలుగురు తప్ప ఎవరూ బీఆర్ ఎస్ లో మిగలరని అన్నారు.

# ఏఐతో రీ నోట్ బుక్



**హైదరాబాద్, ఆగస్టు1:**రీనోట్ ఏఐ నోట్ బుక్ డిజిటల్ రాతల్లో కొత్త విప్లవం తీసుకొచ్చింది. పుస్తకాలు డైరీలు పక్కన పెట్టి కొత్త టెక్నాలజీతో రాతలు మార్చేలా హైదరాబాద్‌కు చెందిన క్వాడ్రిక్ ఐటీ సంస్థ రూపొందించిన ఈ సరికొత్త రీనోట్ ఏఐ నోట్ బుక్ చూపురులను హౌరా అనిపిస్తుంది. ఈ రీనోట్ ఏఐ నోట్ బుక్ అనేది ఒక స్మార్ట్, రీయూజ్ పరికరం. ఇది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఫిజికల్ రాతలను డిజిటల్ టెక్నాలజీతో కలిపి అద్భుతమైన అనుభవాన్ని అందిస్తుంది. ఇది ప్రపంచంలోనే మొట్టమొదటి %హా×%-ఆధారిత రీయూజబుల్ నోట్ బుక్‌గా గుర్తించబడింది.ప్రస్తుతం ఢిల్లీ ఎక్స్ ఫోలో ఈ ఏఐనోట్ బుక్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. 25 పేజీలు ఉండే ఈ పుస్తకాన్ని హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సుమన్ బాలబొమ్మ సృష్టించారు. టెక్నాలజీని ఉపయోగించి చేతిరాతను డిజిటల్ టెక్స్ట్‌గా మార్చే వినూత్న ఆలోచన ఆచరణలో పెట్టి అందర్ని ఆశ్చర్య పరిచారుడు సుమన్. తాను రూపొందించిన పరికరం అందరికీ అందుబాటులో ఉండాలనే ఆలోచనతో దీని ధరను కూడా కేవలం రూ.999కే ఆయన అందుబాటులో ఉంచారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు, ప్రొఫెషనల్స్, క్రియేటివ్ వ్యక్తులకు ఒక ఇదొక సంపూర్ణ సొల్యూషన్‌గా మారనుంది.ఈ సందర్భంగా సుమన్ బాబొమ్మ మాట్లాడుతూ.. ప్రస్తుతం టాప్ సిటీలు, ఇన్నోవేషన్‌ను ఇష్టపడే సంస్థలను టార్గెట్ చేసినా, త్వరలో చిన్న టౌన్లు, ప్రభుత్వ పాఠశాలలు, పల్లెటూళ్లకు కూడా దీన్ని తీసుకెళ్లాలన్నది తమ లక్ష్యమని తెలిపారు. ఇందుకోసం లోకల్ భాషల్లో ట్రైనింగ్ ఇస్తూ, అందరికీ ఈ టెక్నాలజీని పరిచయం చేస్తామన్నారు.రీ నోట్ కి దుబాయ్, జపాన్ వంటి దేశాల్లో జరిగిన టెక్ ఈవెంట్లలో సూపర్ రెస్పాన్స్ వచ్చిందని ఆయన తెలిపారు. జపాన్ ప్రభుత్వం సబ్సిడీ కూడా ఆఫర్ చేసినట్టు పేర్కొన్నారు. మన దేశంలో గూగుల్, కేంద్ర IT శాఖ కలిసి గుర్తించిన టాప్ 100 యాప్స్‌లో ఇదీ ఒకటి అని ఆయన తెలిపారు. ఇండియన్ టెక్నాలజీ ప్రపంచాన్ని ఎలా నడిపించగలదో చెప్పడానికి ఇదే నిదర్శనమని సుమన్ చెప్పుకొచ్చారు.

## పంచాయతీ కార్మికురాలిపై టీడీపీ నేత దాడి

**కార్మికుల నిరసన**




**మైలవరం:**మైలవరంలో పంచాయితీ లో పని చేస్తున్న కార్మికులపై దాడి జరిగి మూడు రోజులు అవుతున్న ఇంతవరకు టీడీపీ నేత కటారి ఉమామహేశ్వరావు అరెస్టు చేయకపోవడం నందిగామ మున్సిపల్ కార్మికులు తీవ్రంగా ఖండించారు. శుక్రవారం ఉదయం మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేసారు. ఈ సందర్భంగా సిఐటియు ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కె గోపాల్ మాట్లాడుతూ మైలవరం పంచాయతీలో పనిచేస్తున్న భవాని అనే కార్మికురాలుపై దాడికి తెగబడ్డ టిడిపి నేత కటారి ఉమామహేశ్వరరావు పై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. రోజువారి దినచర్యగా తన విధులలో హాజరైన పంచాయతీ కార్మికురాలు భవాని (40)ని చెత్తను వీధి వీధినా సేకరించే సమయంలో ఘటన జరిగింది. ??కారులో నుంచి దిగి వచ్చి రాగానే చంపలపై కొడుతూ కడుపులో తన్ని టిడిపి నేత కటారి ఉమామహేశ్వరరావు వీరంగం సృష్టించాడని ఆరోపించారు. ??తక్షణమే కటారి ఉమామహేశ్వరరావును అరెస్టు చేయాలి. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున కార్మికులందరూ ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు సలికేటి నరేష్, కార్యదర్శి దాసవరపు సైదా, మహిళా నాయకురాలు పుట్ట మాణిక్యం, ఆకుల బేబీ, రుతుమ్మ, చిన్నమ్మాయి, కార్మికులు పాల్గొన్నారు...

## శ్రమదానంలో పాల్గోన్న మీనాక్షి నటరాజన్

**పరిగి:**పరిగిలోని ప్రభుత్వ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో శ్రమదానం కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్. మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రచార కమిటీ ఛైర్మన్ మధు యాష్కీ, స్థానిక ఎమ్మెల్యే రాంమోహన్ రెడ్డి, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత తదితరులు పాల్గోన్నారు.

# సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నా..


**స్పీకర్ నిర్ణయాన్ని గౌరవిస్తాం**



**హన్మకొండ:**సుప్రీం కోర్టు ఫిరాయింపుల ఎమ్మెల్యేలపై ఇచ్చిన తీర్పు పై స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పందించారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నాం. మూడు నెలల లోపు పార్టీ మారిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని స్పీకర్ కు సుప్రీంకోర్టు ఆదేశాలు ఇవ్వడంపై స్పీకర్ గారు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో అని మేమంతా వేచి చూస్తున్నారు. ఉప ఎన్నికలు వస్తాయా...రావా అని నిర్ణయించాల్సింది ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా. బిఆర్ఎస్ పార్టీనో కేటీఆర్ ఓ కాదు. గతంలో పార్టీ మారిన ఎమ్మెల్యేల కు మంత్రి పదవులు ఇచ్చి పార్టీ ఫిరాయింపుల చట్టాన్ని ఉల్లంఘించింది బిఆర్ఎస్ పార్టీనే. స్పీకర్ ఏ నిర్ణయం తీసుకున్న గౌరవిస్తామని అన్నారు

# చంద్రబాబుతో రేవంత్ లోపాయికారి ఒప్పందం

**హరీష్ రావు**



**హైదరాబాద్:**బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయి. రేవంత్ రెడ్డి పెదవులు మూసుకోవడం వల్ల చంద్రబాబు ఆడిందే ఆట, పాడిందే పాట అన్నట్లు అయ్యింది. లోపాయికార ఒప్పందం చేసుకొని ప్రాజెక్టు కోసం సహకరిస్తున్నడు రేవంత్ రెడ్డని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు.శుక్రవారం అయన తెలంగాణ భవన్ లో మీడియాతో మాట్లాడారు. ఢిల్లీలో పవర్ ఉంది అని లోకేష్ ప్రాజెక్టు కట్టి తీరుతం అంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదు, ఎందుకు మాట్లాటం లేదు. సీఎం, మంత్రులు ఎందుకు మాట్లాడరు. మీరు లోపాయికార ఒప్పందం చేసుకున్నరు. మీ చీఫ్ సెక్రటరీ ఏమో బనకచర్ల అంశం మీద చర్చకు రాము అని రాస్తడు, రేవంత్ ఏమో బనకచర్ల అంశం ఉన్నప్పటికీ పాల్గొని, కమిటీ వేసేందుకు ఒప్పుకొని వస్తడని అన్నారు.మీ ధైర్యం చూసుకొని లోకేష్ మాట్లాడుతున్నడు. బనకచర్ల కట్టి తీరుతం అంటున్నడు. బనకచర్లపై చంద్రబాబు బుల్డోజ్ విధానానికి బిజేపీ, కాంగ్రెస్ ల మౌనమే కారణం. మీరు సహకరించడం వల్లనే అంత ధైర్యంగా ప్రకటిస్తున్నారు. లోకేష్ ఏమో ప్రాజెక్టు కట్టి తీరుతం అంటే, రేవంత్ రెడ్డి మాత్రం బనకచర్ల కడుతలేరు అంటడు. ఎజెండాలో లేదు అంటడు, డుతం అంటే కదా అడ్డు చెప్పేది అంటడు. రేవంత్ రెడ్డి గురుదక్షిణ చల్లించుకునే పనిలో పడ్డడు రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్, బిజేపీ డూడూ బసవన్న లాగా తలూపుతున్నరు. అందుకే ధైర్యంగా మాట్లాడుతున్నరని అన్నారు.రేవంత్ గురుదక్షిణలో భాగంగా చంద్రబాబు మెప్పు కోసం, ఢిల్లీ మెప్పు కోసం ప్రయత్నం చేస్తాడు తప్ప రాష్ట్ర ప్రయోజనాల కోసం కాదు. లోకేష్ అవగాహన లేకుండా మాట్లాడాడు, అధికారం ఉందని, మంద బలం ఉందని మాట్లాడటం పొరపాటు. మిగులు జలాలు అనేవి నిజంగా ఉంటే కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఎందుకు మీ డీపీఆర్ ను వెనక్కి తిప్పి పంపింది.పోలవరం అథారిటీ, గోదావరి బోర్డు, సిడబ్లుసి, ఎన్విరాన్ మెంట్ సంస్థలు ఎందుకు బనకచర్ల డిపిఆర్ ను తిరస్కరించాయి. నాలుగు కేంద్ర సంస్థలు బనకచర్లను తిప్పి పంపింది నిజం కాదా? మిగులు జలాలు ఉన్నాయని ఎవరు చెప్పారు? ఉంటే ఏపీకి ఎన్ని, తెలంగాణకు ఎన్ని కేటాయించారో చెప్పని అన్నారు.కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు, ఎత్తిపోతలకు పొక్క కొట్టుడో, చిల్లు కొట్టుడో ఉండదు. ఆనాడు తెలంగాణ కాంగ్రెస్ నాయకులు మౌనంగా ఉండటం వల్ల తెలంగాణకు అన్యాయం జరిగింది. పోతిరెడ్డికి పొక్క పెట్టి నీళ్లు తీసుకుపోయారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నట్లు నీళ్లు తీసుకుపోతా అంటే చూస్తు ఊరుకుంటామా. ఇక్కడ ఉన్నది బిఆర్ఎస్ పార్టీ, తెలంగాణ ప్రయోజనాల కోసం పదవులను గడ్డి పోచలుగా వదులుకున్నోళ్లం. కాళేశ్వరం ప్రాజెక్టుకు అన్ని రకాల అనుమతులు ఉన్నాయి. మీకు వివరాలు పంపిస్తా చూసుకోండి. అనుమతులు లేవు అని ఎలా అంటావని ప్రశ్నించారు.ఎప్పుడు తెలంగాణ ప్రాజెక్టులు అడ్డుకోలేదని చెబుతున్న లోకేష్, , ఇదే విషయం గురించి మీ నాన్న ని అడగండి. ఒక్క కాళేశ్వరం వ్యతిరేకిస్తూ మీ నాన్న గారు ఏడు ఉత్తరాలు రాసారు. మీరేమో వ్యతిరేకించలేదు అని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. ఇచ్చిన అనుమతులు నిలిపి వేయండి, ప్రాజెక్టులు ఆపండి అని లేఖలు రాసారు. కాళేశ్వరం అనేది కొత్త ప్రాజెక్టు కాదు, ప్రాణహితలో అంతర్భాగం, అందుకే ఏపీ రీఆర్గనైజేషన్ యాక్ట్ వర్తించదు అని స్పష్టంగా కేంద్రం పేర్కొన్నది. కాళేశ్వరానికి అవసరమైన 11 రకాల అనుమతులు తీసుకున్నాం. కాళేశ్వరం మీద కుట్ర చేసి, మేడిగడ్డ నుంచి నీళ్లు ఎత్తిపోయకుండా, నీళ్లు ఏపీకి పోవాలి అనే కుట్ర చేస్తున్నట్లుంది. ఏపీలో అక్రమ ప్రాజెక్టులు కట్టి కృష్ణా నదిలో నీళ్లు మళ్లించినట్లు, గోదావరి నీళ్లు మళ్లించాలనేది కుట్ర.రెండు నదులను హస్తాగతం చేసుకునే కుట్రలు జరుగుతున్నాయి.ఆనాడు ఉమ్మడి ఏపీలో అనేక కుట్రలు జరిగాయి. ఇప్పుడు బనకచర్ల కట్టి తీరుతాం అంటున్నారు. మీరు కట్టితీరుతాం అంటున్నారు, మేము అడ్డుకొని తీరుతాం అంటున్నాం.మీ ప్రాజెక్టులను అడ్డుకోవడం మా ఉద్దేశ్యం కాదు, మా హక్కుల గురించి మేం మాట్లాడుతున్నం మా వాటా మాకు ఇవ్వండి గౌరవిస్తం, బుల్డోజ్ చేస్తం అంటే సహించేది లేదు. కేసీఆర్ కాళేశ్వరం కోసం మహారాష్ట్రకు వెళ్లి గవర్నర్, అక్కడి సీఎం ను కలిసారు.మూడు సార్లు వెళ్లి ఒప్పించి, మెప్పించారు. కాళేశ్వరం కట్టారు. సముద్రంలో కలిసే నీళ్లు కదా అంటున్న లోకేష్ గారు.. ఉమ్మడి ఏపీ ఉన్నపుడు 968 టీఎంసీలను తెలంగాణకు వాటాగా కేటాయించారు. విభజన బిల్లు, శ్రీకృష్ణ కమిటీ అన్నింట్లో ఈ వాటా పేర్కొన్నరు.ఇందుకు లోబడి కదుతున్న ప్రాజెక్టులను ఎందుకు ఏపీ ప్రభుత్వం అడ్డుకుంటున్నది. ఉమ్మడి ఏపీలో ఇచ్చిన 968 పరిధిలో కట్టిన ప్రాజెక్టులను అడ్డుకుంటున్నరు, మరి బనకచర్ల ఎట్ల కడుతున్నరు, ఈ ప్రాజెక్టుకు ఉన్న అనుమతులు ఏమిటని అన్నారు.మా నోరు కొడతాం అంటే మాకు హక్కులు లేవా, మేం ఎందుకు ఊరుకోవాలె. సూటిగా లోకేష్ కి అడుగుతున్నా. 968 టిఎంసీలను అంగీకరించండి. దాన్ని వ్యతిరేకిస్తూ కేంద్రానికి రాసిన లేఖలను విత్ డ్రా చేసుకోండి. గోదావరి పై నిర్మించే మా ప్రాజెక్టులను వ్యతిరేకించారు. విత్ డ్రా చేసుకోండి. గోదావరి నీళ్లు కృష్ణాకు మళ్లిస్తే ట్రిబ్యునల్ నిబంధనల ప్రకారం ఇవ్వాల్సిన 155 టిఎంసీలు మాకు ఇస్తమని ఒప్పుకోండి. 1480 టిఎంసీల కంటే ఎక్కువ ఉన్న నీటిని 65:35 ప్రకారం వాటా లెక్క తేల్చాలి. ప్రాంతీయ విద్వేశాలు రెచ్చ గొడుతున్నారు అన్నడు లోకేష్.. గోదావరి నదిలో మా వాటా మాకు కావాలె అంటున్నడు, మిగులు జలాల లెక్క తేలాలి అంటున్నామని అన్నారు.గోదావరి బనకచర్ల ద్వారా గోదావరి నీళ్లు మాత్రమే కాదు, కృష్ణా నీళ్లను కూడా తరలించుకునే కుట్ర ఉంది. ఈ విషయం చంద్రబాబు నాయుడే చెప్పిండు. నాగార్జున సాగర్ కుడి కాల్వను డబుల్ చేస్తాం అన్నడు. నాలుగు కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఎందుకు మీ డిపిఆర్ ను తిప్పి పంపాయి కట్టి తీరుతాం అంటే అడ్డుకొని తీరుతాం. అనుమతులు తెచ్చుడు మీకు తెలిస్తే ఆపడం మాకు తెలుసని అన్నారు.

# ఆ బ్యాగ్ లు నిషేధం...



**హైదరాబాద్, ఆగస్టు1:**హైదరాబాద్ నగరంలో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తి స్థాయిలో తగ్గించడానికి జీహెచ్ఎంసీ అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. త్వరలోనే నగరంలో ప్లాస్టిక్ బ్యాన్ నిర్ణయం అమల్లోకి రానుంది. దీనిలో భాగంగా 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న క్యారీ బ్యాగులను నిషేధించేందుకు రెడీ అవుతున్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బ్యాన్ పేరుతో ఈ కార్యక్రమం మొదలు కానుంది. అయితే కొన్ని ప్రత్యేక అవసరాలకు మినహాయింపులు ఉంటాయని అధికారులు తెలిపారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు మీకోసం..హైదరాబాద్ వాసులకు జీహెచ్ఎంసీ అధికారులు కీలక అలర్ట్ జారీ చేశారు. ఈ నిర్ణయం గనక పటిష్టంగా అమలు చేస్తే ఇక భాగ్యనగరంలో ప్లాస్టిక్ కనుమరుగయ్యే అవకాశం ఉంది అంటున్నారు. ఇందుకోసం అధికారులు హైదరాబాద్‌లో ప్లాస్టిక్ వాడకంపై నిషేధం విధించేందుకు రెడీ అవుతున్నారు. ఇదే జరిగితే.. త్వరలోనే రాజధాని నగరంలో ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల వాడకం పూర్తిగా ఆగిపోనుంది. ఈ నిర్ణయాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు గాను ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకునేందుకు రెడీ అవుతుంది.దీనిలో భాగంగా భాగ్యనగరంలో త్వరలోనే 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న క్యారీ బ్యాగులను పూర్తిగా నిషేధించనున్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బ్యాన్ పేరుతో అతి త్వరలోనే ఈ కార్యక్రమం మొదలు కానుంది. గతంలో కూడా ఇలాంటి ప్రయత్నాలు జరిగాయి. కానీ, అవి సరిగ్గా అమలు కాలేదు. ఇప్పుడు దీన్ని పటిష్టంగా అమలు చేయడం కోసం జీహెచ్ఎంసీ ఏకంగా కొత్త చట్టాన్ని తీసుకురావడానికి రెడీ అవుతోంది.హైదరాబాద్ నగరంలో ప్లాస్టిక్‌ను పూర్తి స్థాయిలో నిషేధించాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. దీని కోసం 2007 నుంచి ప్రయత్నాలు జరుగుతున్నాయి. కానీ, ఇప్పటి వరకు అవి పూర్తి స్థాయిలో కార్యరూపం దాల్చలేదు. గతంలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు గాను.. రూ.5 వేల నుంచి రూ. లక్ష వరకు జరిమానా విధించేలా జీవోలు జారీ చేశారు. కానీ ఈ నిర్ణయాన్ని పటిష్టంగా అమలు చేయలేదు. ఈసారి మాత్రం నగరంలో ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని భావిస్తోన్న అధికారులు.. ఇందుకోసం జీహెచ్ఎంసీ చట్టాన్ని మార్చేందుకు గాను ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిన వెంటనే.. నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధిస్తారు. దీని ద్వారా హైదరాబాద్ నగరాన్ని ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు లేని నగరంగా మార్చాలని జీహెచ్ఎంసీ అధికారులు భావిస్తున్నారు. ప్లాస్టిక్ బ్యాన్ నిబంధనలను తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ (టీసీయూఆర్) వరకు అమలు చేయాలని యోచనలో ఉన్నారు. అయితే ముందుగా జీహెచ్ఎంసీ పరిధిలో.. ప్లాస్టిక్ బ్యాన్‌ను కఠినంగా అమలు చేయాలని భావిస్తున్నారు. పర్యావరణాన్ని కాపాడటం, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని చట్టంలో మార్పులు చేయనున్నారు.అయితే కొన్ని ప్రత్యేక అవసరాలకు ఈ ప్లాస్టిక్ వినియోగ నిషేధం నుండి మినహాయింపులు ఉండవచ్చని అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా ఎగుమతి కోసం ప్రత్యేక ప్లాస్టిక్ క్యారీబ్యాగ్స్ తయారు చేసేవారికి, పాలు, పాల ఉత్పత్తుల ప్యాకింగ్ కోసం వాడేది, సీల్డు చేసిన వస్తువుల ప్యాకేజీలు, నర్సరీల వంటి అవసరాలకు ప్లాస్టిక్ వినియోగాన్ని అనుమతించనున్నారు. హైదరాబాద్‌లో ప్లాస్టిక్ బ్యాన్ నిర్ణయం అమల్లోకి వస్తే నగరంలో చాలా సమస్యలు తగ్గుతాయని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ అభిప్రాయపడ్డారు. ప్రధానంగా నాలాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు తగ్గి.. వరద సమస్యలు చాలా వరకు తగ్గుతాయని అంటున్నారు. అలానే ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా మినహాయింపులు ఉంటాయని కమిషనర్ తెలిపారు.

## నువ్వు పోలీస్వా లేక... కాంగ్రెస్ కార్యకర్తవా...?

**రైతుకి అన్యాయం చేసినందుకు నిరసన తెలిపితే అరెస్ట్ చేస్తావా...?**
**మహిళా అని చూడకుండా బూతులు తిడుతావా...?**
**బోరు పీకి పక్కకి వేయడం..!రైతుని రోడ్డు మీద పడెసినట్టే...!**
**రైతు ఓదెలుకి న్యాయం చేయాలి.**
**మున్సిపల్ కమిషనర్ ను సస్పెండ్ చేయాలి..**
**మాజీ ఎమ్మెల్యే గండ్ర**



**జయశంకర్ భూపాలపల్లి:**భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మంజూరునగర్ నందు గత 30 ఏండ్లు గా బర్ల ఫామ్ పెట్టుకుని, పాలు అమ్ముతూ జీవనం సాగిస్తున్న కూరాకుల ఓదెలు – లలిత లకు చెందిన గేదెల ఫామ్ ను కూల్చివేసిన మునిసిపల్ కమిషనర్ ను వెంటనే సస్పెండ్ చేయాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం భూపాలపల్లి ఏమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గేదెలను తోలి నిరసన తెలిపిన రైతు ఓదెలు ఇంటి వద్ద చేస్తున్న నిరసన కార్యక్రమానికి మద్దతు తెలుపుతూ వారికీ భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి సంఘీభావం తెలిపారు. బిఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు,కార్యకర్తలతో కలిసి శుక్రవారం మాజీ ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ...

కూరకుల ఓదెలు యొక్క పశువుల కొట్టాన్ని చాలా దుర్మార్గంగా,ఈ రాష్ట్రంలో చట్టమే లేదన్నట్లు,నేను చెప్పేదే చట్టం అన్నట్లు కూలగొట్టడం జరిగింది. నిన్న పోలీసు, మున్సిపల్ అధికారులు ఇంత విచ్చల వీడి అధికారం ఎక్కడి నుండి వచ్చిందో అర్థం కావడం లేదని అన్నారు.పోలీసు అధికారులు చట్టాన్ని కాపాడాలి కానీ భూపాలపల్లి లో ఒక్కరి మోచేతి నీళ్ళు తాగడం సరికాదని,ఇదే కాదు భూపాలపల్లి లో చాలా జరుగుతున్నాయని అయినా ఎస్ పీ జిల్లా హెడ్ క్వార్టర్లోనే ఉన్నా కూతవేటు దూరంలో ఇంత దుర్మార్గం జరుగుతుంటే ఏమి చేస్తున్నారు అని ప్రశ్నించారు. ఇక్కడుండేటట్టువంటి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆయన ఎమ్మెల్యే కార్యకర్తగా పనిచేయాలనుకుంటే యూనిఫాం తీసి చేయాలని, లేదంటే ఖాకీ డ్రెస్ వేసుకుంటే సీ ఐ గా వ్యవహరించాలని చెప్తున్నారు. ఈ సందర్భంగా సీ ఐ కి ప్రజల తరుపున విజ్ఞప్తి చేస్తున్న మీరు చిన్న వయసు వారు,మీకు ఇంకా చాలా భవిష్యత్ ఉందని ఎమ్మెల్యేకి అనుచరుడిగా పనిచేయడం చాలా బాధాకరమని ఎమ్మెల్యే ఏది చెపితే అది చేయడం సరియైన పద్ధతి కాదని ఈ స్కూల్ కి భూమి దానం చేసినటువంటి మోహినోద్దీన్ ఈ స్కూల్ బాట కోసం ఆనాడే 12 ఫీట్స్ రోడ్డు ఇవ్వడం జరిగిందని అందులో రోడ్డు నిర్మించాలని,ప్రైవేట్ ప్రాపర్టీలో దౌర్జన్యంగా రోడ్డు వేయడానికి మీకు అధికారం ఎవరిచ్చారని ప్రశ్నించారు.ఇక్కడ ఉన్న ఎకరం భూమి యొక్క ప్రవేట్ వ్యక్తులకు లాభం చేయడం కొరకు దుర్మార్గంగా రోడ్డు వేయడం ఏంటి. ఈ భూమిలో స్థానిక ఎమ్మెల్యేకు వాటా ఉందని ఆయన కార్యకర్తలు కావటం ఉందా లేక పోలీస్ అధికారులకు ఉందా , రెవెన్యూ అధికారులకు వాటా ఉందా,లేక మున్సిపల్ అధికారులకు వాటా ఉందా అని వివరించాలని అన్నారు.

## పోలీసుల కస్టడికి డా. నమ్రత



**హైదరాబాద్:**సృష్టి ఐవిఎఫ్ కేసులో గోపాలపురం పోలీసులు డా. నమ్రతను కస్టడీకి తీసుకున్నారు. చంచల్ గూడ జైలునుంచి ఆమెను వైద్య పరీక్షల నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఐదు రోజుల పాటు నమ్రతను విచారించనున్నారు. నమ్రత కుమారుడు జయంత్, డాక్టర్ సదానందంతో పాటు టెక్నీషియన్ చెన్నారావును కస్టడీకి కోరుతూ పోలీసులు పిటిషన్ దాఖలు చేసారు. నేనేమి తప్పు చేయలేదని నమ్రత అంటున్నారు

## వైకాపా హయంలో ఇసుక స్కాం చాలా పెద్దది

**ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్**

**విజయవాడ:**వైసీపీ ఇసుక దోపిడీపై ఎమ్మెల్యే వసంతకృష్ణప్రసాద్ కీలక వ్యాఖ్యలు చేసారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఇసుక స్కామ్ చాలా పెద్దది. వైసీపీ ఇసుక దోపిడీ వివరాలు నా దగ్గరున్నాయి.

సినిమా






# పదింతల లాభాలిస్తున్న సినిమా..!




ఇప్పుడున్న పరిస్థితుల్లో స్టార్ పవర్ తో సంబంధం లేకుండా సినిమా చిన్నదైనా పెద్దదైనా పెట్టుబడి వస్తే చాలు భగవంతుడాని నిర్మాతలు కోరుకుంటున్నారు. లాభాలు వస్తే అదృష్టం అన్నట్టు. కానీ సైయారా మాత్రం రూపాయికి పది రూపాయలు లాభం పంచుతూ డిస్ట్రిబ్యూటర్లను కనక వర్షంలో ముంచెత్తుతోంది. ఓవర్సీస్ లో చావా ఫైనల్ రన్ ని కేవలం రెండు వారాల్లోనే దాటేయడం చూసి బయ్యర్లకు నోటమాట రావడం లేదు. చావా 91 కోట్లు వసూలు చేస్తే సైయారా 94 కోట్లు దాటేసి వంద మార్కు వైపు పరుగులు పెడుతోంది. అసలు ఎక్కడ ఎప్పుడు ఆగుతుందో ఎవరికి అంతు చిక్కడం లేదు. అంతగా దుమారం రేపుతోంది.ఇంతా చేసి సైయారాకు అయిన బడ్జెట్ కేవలం 30 కోట్లు. ఇప్పటిదాకా 400 కోట్ల గ్రాస్ దాటిపోయింది. అర సహస్రం ఈ వీకెండ్ లో అయిపోతుంది. దీని తర్వాత కొత్త రిలీజులు హరిహర వీరమల్లు, మహావతార్ నరసింహ, సామ్రాజ్య, సన్నాఫ్ సర్దార్ 2, ధడక్ 2 లాంటివి ఎన్ని వచ్చినా, వస్తున్నా సైయారా మాత్రం జోరు కొనసాగిస్తూనే ఉంది. నిర్మాణ భాగస్వామిగా ఉన్న యష్ రాజ్ ఫిలిమ్స్ మార్కెటింగ్ ప్లాన్ బ్రహ్మాండంగా వర్కౌట్ అయ్యింది. మొదటి రోజు ఆఫర్లు ఇచ్చి వదిలేస్తే తర్వాత జనం వద్దన్నా ఎగబడుతున్న వైనం బాక్సాఫీస్ వద్ద కనిపిస్తోంది. ఉత్తరాది రాష్ట్రాల్లో అయితే మరీ దూసుకెళ్ళిపోతోంది.విచిత్రం ఏంటంటే తెలుగు రాష్ట్రాల జిల్లా కేంద్రాలు, నగరాల్లో సైయారాని థర్డ్ వీక్ లోనూ కొనసాగిస్తున్నారు. ఇది ఒక కరంగా రేర్ ఫీట్ అని చెప్పాలి. ఎందుకంటే షారుఖ్, సల్మాన్ లాంటి వాళ్లే ఇంత లాంగ్ రన్ ని మైంటైన్ చేయలేక ఇబ్బంది పెడుతున్న ట్రెండ్ లో ఒక కొత్త జంట నటించిన లవ్ స్టోరీ ఇంత సెన్సేషన్ కావడం వింత కాక మరేమిటి. అహాన్ పాండే ఒక్కసారిగా హాట్ కేక్ అయిపోయాడు. దర్శకుడు మోహిత్ సూరికి మళ్ళీ డిమాండ్ పెరిగింది. హీరోయిన్ అనీత్ పడ్డా సంగతి సరేసరి. అవకాశాలు వెల్లువలా వచ్చి పడుతున్నాయి. ఇంతకీ సైయారా స్పీడ్ ని ఆపే మూవీ వార్ 2, కూలి అవుతాయేమో.

# భాగ్యశ్రీ హృదయాన్ని మాయం చేశారు



తాజాగా విడుదలైన కింగ్డమ్ భారీ ఓపెనింగ్స్ తో మొదలయ్యింది. టాక్, రివ్యూల సంగతి పక్కనపెడితే విజయ్ దేవరకొండ బ్రాండ్ తో పాటు గౌతమ్ తిన్ననూరి ఇమేజ్, అనిరుద్ రవిచందర్ సంగీతం బాగా ప్లస్ అయ్యాయి. అయితే ఫ్యాన్స్ కి టీమ్ ఊహించని ట్విస్ట్ ఇచ్చారు. యూట్యూబ్ లో 15 మిలియన్లకు పైగా వ్యూస్ తెచ్చుకున్న హృదయం లోపల సాంగ్ ని ఎడిటింగ్ లో తీసేశారు. సెకండాఫ్ లో ఎక్కడైనా వస్తుందేమోనని అభిమానులు ఎదురు చూశారు కానీ రాలేదు. నిజానికి కథలో ఉన్న సీరియస్ నెస్ వల్ల బలవంతంగా ఇరికిస్తే ఇంకాస్త మైనస్ అయ్యేది కానీ ఒకరకంగా చెప్పాలంటే ఎడిట్ చేయడమే మంచిదయ్యింది.తర్వాత జోడించే అవకాశాలు తక్కువే. ఇది ముందే గుర్తించి కాబోలు ఫుల్ వీడియో సాంగ్ ని రెండు నెలల క్రితమే అఫీషియల్ గా అప్లోడ్ చేశారు. అనిరుద్ కంపోజ్ చేసిన ఈ స్మూత్ మెలోడీ మ్యూజిక్ లవర్స్ ని ఆకట్టుకుంది. ఫ్లో ప్రకారం చూసుకుంటే అన్నదమ్ముల బాండింగ్ మీద ఎక్కువగా నడిచిన ఈ సినిమాలో ప్రేమకు పెద్దగా చోటు దక్కలేదు. విజయ్ దేవరకొండ, భాగ్యశ్రీ బోర్సేల మధ్య లవ్ స్టోరీకి స్కోప్ ఉన్నా గౌతమ్ తిన్ననూరి వాడుకోలేదు. ఆ మాటకొస్తే ట్రైలర్ లో చూపించిన కొన్ని షాట్లు, టీజర్ లో తగలబెట్టేస్తా అనే సీన్ మెయిన్ మూవీలో లేవు. దీనికి సమాధానం గౌతమ్, నవీన్ నూలి దగ్గరే ఉంటుంది. ఇది కాసేపు పక్కనపెడితే మిస్టర్ బచ్చన్ తరహాలో భాగ్యశ్రీ బోర్సేకు ఎక్కువ స్కోప్ దక్కలేదు. కథా గమనం వల్ల కొంత భాగానికి మాత్రమే పరిమితం కావాల్సి వచ్చింది. కాకపోతే ఇద్దరి మధ్య షూట్ చేసిన కొన్ని సీన్లు, ప్రేమకథ కోతకు గురైనట్టు తెలిసింది. మళ్ళీ రావా, జెర్సీకి భిన్నంగా ఈసారి మాస్ సీరియస్ బ్యాక్ డ్రాప్ ఎంచుకున్న గౌతమ్ తిన్ననూరి మొదటిసారి హీరో హీరోయిన్ మధ్య కెమిస్ట్రీని ఇంత తక్కువగా చూపించింది కింగ్డమ్ లోనే. ఇంకా రెండో భాగం ఉందంటున్నారు కానీ ఫైనల్ బాక్సాఫీస్ రన్ ముగిశాక నిర్ణయం తీసుకుంటారేమో చూడాలి. ప్రస్తుతానికి బాక్సాఫీస్ జోరు బాగానే ఉంది.

# కాస్టింగ్ కౌచ్‌కు సేతుపతి సమాధానం



అప్పుడప్పుడు కొందరు ఫిలిం సెలబ్రెటీలకు ఉన్న బయట ఇమేజ్‌కు భిన్నంగా కొన్ని ఆరోపణలు వస్తుంటాయి. వాటిని జనం నమ్మకపోయినా .. ఆ ఆరోపణలు సదరు వ్యక్తులను డిస్టర్బ్ చేస్తాయి. 'మీ టూ' ఉద్యమం మొదలయ్యాక తమకు జరిగిన అన్యాయం గురించి ధైర్యంగా అమ్మాయిలు గళం విప్పడం మొదలైంది. కానీ దీన్ని తమకు అనుకూలంగా వాడుకుని కొందరి మీద బురదజల్లే వాళ్లూ తయారయ్యారు. శేఖర్ కమ్ముల లాంటి క్లీన్ ఇమేజ్ ఉన్న వ్యక్తి మీద కూడా శ్రీరెడ్డి నిరాధారంగా ఆరోపణలు చేసి వార్తల్లో నిలిచిన సంగతి తెలిసిందే. శేఖర్ తీవ్రంగా స్పందించేసరికి తర్వాత ఆమె సైలెంట్ అయిపోయింది. ఇప్పుడు విజయ్ సేతుపతి మీద కూడా ఇలాగే రమ్య అనే మహిళ ఆరోపణలు చేయడం చర్చనీయాంశమైంది. తన స్నేహితురాలు సేతుపతి వల్ల ఇబ్బంది పడిందంటూ ఒక మహిళ సోషల్ మీడియా పోస్టు పెట్టి డెలీట్ చేయడం సంచలనం రేపింది. కోలీవుడ్లో కాస్టింగ్ కౌచ్ బాగా ఎక్కువగా ఉందని.. దీని వల్ల తన స్నేహితురాలు ఇబ్బంది పడిందని.. విజయ్ సేతుపతి ఆమెను ఇబ్బంది పెట్టాడని.. దీంతో తన ఫ్రెండు డిప్రెషన్‌కు గురైందని రమ్య అనే మహిళ పోస్ట్ పెట్టింది. ఐతే ఈ పోస్టు మీద సోషల్ మీడియాలో తీవ్ర వ్యతిరేకత వచ్చేసరికి దాన్ని ఆమె డెలీట్ చేసింది. ఈ నేపథ్యంలో సేతుపతి సైతం స్పందించాడు. తనను ఎన్నో ఏళ్లుగా చూస్తున్న వాళ్లంతా ఆమె ఆరోపణలు చూసి నవ్వుకున్నారని.. తనేంటో తనకు, చుట్టూ ఉన్న వాళ్లకు తెలుసని సేతుపతి వ్యాఖ్యానించాడు.

# జై హనుమాన్.. ముందుకు కదులుతుందా?



టాలీవుడ్ చరిత్రలోనే అత్యంత ఆశ్చర్యపరిచే హిట్లలో ఒకటనదగ్గ 'హనుమాన్' సినిమా రిలీజై ఏడాదిన్నర దాటిపోయింది. పెద్దగా పేరు లేని కాస్టింగ్.. పరిమిత బడ్జెట్.. అయినా సరే అద్భుతమైన ఔట్ పుట్‌తో ప్రేక్షకులను ఆశ్చర్యపరిచాడు ప్రశాంత్ వర్మ. పాన్ ఇండియా స్థాయిలో సెన్సేషనల్ హిట్ అయిన ఈ సినిమాతో ప్రశాంత్ మీద ఒక్కసారిగా అంచనాలు పెరిగిపోయియి. 'హనుమాన్' సినిమాలోనే ఆ సినిమాకు సీక్వెల్ ప్రకటించిన ప్రశాంత్.. తర్వాత ఆ చిత్రంతోనే పలకరిస్తాడని అంతా అనుకున్నారు. కానీ ఇదిగో అదిగో అంటున్నారే తప్ప ఆ సినిమా ముందుకే కదలట్లేదు. మధ్యలో బాలీవుడ్ హీరో రణ్వీర్ సింగ్‌తో ఓ సినిమా తెరపైకి వచ్చింది. తర్వాత మోక్షజ్ఞతో ఓ సినిమాకు అంతా సిద్ధం అన్నారు. ప్రభాస్‌తో ఓ సినిమా ఓకే అయినట్లు వార్తలు వచ్చాయి. కానీ ఇవేవీ కార్యరూపం దాల్చలేదు. ఇవన్నీ పక్కకు వెళ్లి 'జై హనుమాన్' అయినా పట్టాలెక్కుతుందేమో అనుకుంటే అదీ జరగట్లేదు. 'జై హనుమాన్'లో కన్నడ నటుడు రిషబ్ శెట్టి హనుమంతుడి పాత్ర చేస్తాడని ప్రకటించి చాలా కాలమైంది. కానీ తర్వాత ఏ అప్‌డేట్ లేదు. 'కాంతార'ను ముగించాక రిషబ్ ఈ సినిమా కోసం అందుబాటులోకి వస్తాడనుకుంటే.. వేరే ప్రాజెక్టులు ఒక్కొక్కటిగా ప్రకటిస్తూ వెళ్తున్నాడు. ఆల్రెడీ హిందీలో ఛత్రపతి శివాజీ బయోపిక్ చేయాల్సి ఉంది. ఇప్పుడేమో అశ్విన్ గంగరాజు గుణ్ణం దర్శకత్వంలో రిషబ్ హీరోగా సితార ఎంటర్టైన్మెంట్స్ ఒక భారీ చిత్రాన్ని ప్రకటించింది. మరోవైపు 'కాంతార'కు మరో సీక్వెల్ కూడా చేయాలని రిషబ్ అనుకుంటున్నట్లు వార్తలు వస్తున్నాయి.

# రాజా సాబ్ మనసు మార్చుకుంటే రిస్కే



డిసెంబర్ 5 విడుదల కాబోతున్న ది రాజా సాబ్ రిలీజ్ డేట్ గురించి ఫిలిం నగర్ వర్గాల్లో మళ్ళీ చర్చలు మొదలయ్యాయి. వాయిదా పడొచ్చంటూ, 2026 సంక్రాంతికి వెళ్లేలా పలు వర్గాలకు లీకులు ఇస్తున్నట్టు సోషల్ మీడియా వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. నిజానికి మేకర్స్ మార్పు కోరుకోవడం లేదు. సంజయ్ దత్ పుట్టినరోజు సందర్భంగా వదిలిన పోస్టర్ లోనూ అదే స్పష్టం చేశారు. ప్రభాస్ ఫుల్ కో ఆపరేషన్ తో షూటింగ్ లో పాల్గొంటున్నాడు. ఫౌజీకి బ్రేక్ ఇచ్చి సహకారం అందిస్తున్నాడు. ఇదంతా టైంకి సినిమా థియేటర్లలో అడుగు పెట్టడం కోసమే. ఒకవేళ పొంగల్ బరిలోకి వెళ్తే మాత్రం రిస్క్ అవుతుంది.ఎందుకంటే ఇప్పటికే కొన్ని స్లాట్లు లాకైపోయాయి. చిరంజీవి 157ని పండగ బరిలో దింపాలనే లక్ష్యంతోనే దర్శకుడు అనిల్ రావిపూడి శరవేగంగా పరిగెత్తిస్తున్నాడు. మూడు షెడ్యూల్స్ అయిపోయాయి. కొత్తది స్టార్ట్ కాబోతోంది. ఇందులో ప్రత్యేక పాత్ర చేస్తున్న వెంకటేష్ తాలూకు లుక్ టెస్ట్ కూడా ఫినిష్ చేశారు. ఇంత పక్కా ప్లానింగ్ తో ఉంటే వాయిదా సమస్యే ఉండదు. నవీన్ పోలిశెట్టి అనగనగా ఒక రాజు ఆన్ ట్రాక్ లో ఉంది. ఇది కూడా సంక్రాంతి బొమ్మే. రవితేజ అనార్కలి (ప్రచారంలో ఉన్న టైటిల్) ఆల్రెడీ అనౌన్స్ చేసుకుంది. విజయ్ జన నాయగన్ జనవరి 9 ఎప్పుడో ప్రకటించేసుకుంది. ఇంత పోటీ ఉంది. ఒకవేళ రాజా సాబ్ కనక సంక్రాంతి అంటే మాత్రం పైన చెప్పిన వాటిలో ఒకటో రెండో తప్పుకోవాల్సి ఉంటుంది. అది ఎవరనేది ఆసక్తికరంగా ఉంటుంది. ఇంకో కోణంలో ఎంత ప్రభాస్ సినిమా అయినా అవతలి వాళ్ళను తక్కువంచనా వేయకూడదు. బాహుబలి తర్వాత వచ్చిన డార్లింగ్ సినిమాలన్నీ సోలో రిలీజ్ తో లాభ పడినవే. టఫ్ కాంపిటేషన్ ఎప్పుడూ ఫేస్ చేయలేదు. ఇప్పుడు సవాల్ కి సై అంటే ఓపెనింగ్స్, రెవిన్యూ రెండూ పంచుకోవాల్సి ఉంటుంది. ఇతర బాషల మార్కెట్ కోణంలో పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ ఈ అనాలిసిస్ చేసుకోవాల్సి ఉంటుంది. మరి చివరికి రాజా సాబ్ ఏం చేస్తాడో వేచి చూడాలి.

# వాస్తవ సంఘటనలతో 'చేతబడి'



శ్రీ శారద రమణా క్రియేషన్స్ బ్యానర్ పై నంద కిషోర్ నిర్మాణంలో నూతన దర్శకుడు సూర్యాస్ రూపొందిస్తున్న చిత్రం 'చేతబడి' రియల్ ఇన్సిడెంట్స్ ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. దర్శకుడు సూర్యాస్ మాట్లాడుతూ,'చేతబడి అనేది 16వ శతాబ్దంలో మన ఇండియాలో పుట్టిన ఒక కల. రెండు దేశాలు కొట్టుకోవాలన్నా, రెండు దేశాలు కలవాలన్నా ఒక బలం, బలగంతో ఉండాలి. కానీ ఒక ఈవిల్ ఎనర్జీతో మనిషిని కలవకుండా అతన్ని చంపే విద్యే చేతబడి. అది ఎంత భయంకరంగా ఉంటుందో ఇప్పటికే చాలా సినిమాల్లో చూపించారు. ఇందులో చాలా విభిన్నంగా చూపి స్తున్నాం. మన బాడీలో ప్రతిదానికి ప్రాణం ఉంటుంది. అఖరికి వెంట్రుకలకు కూడా ప్రాణం ఉంటుంది. ఆ వెంట్రుకల ఆధారంగానే ఈ సినిమా ఉంటుంది. 1953 గిరిడ అనే గ్రామంలో రియల్‌గా జరిగిన యదార్ధ సంఘటనను ఆధారంగా చేసుకుని ఈ కథను సిద్ధం చేశాం. సీలేరు అనే గ్రామంలో 200 సంవత్సరాల క్రితం వెదురు బొంగులు చాలా థిక్‌గా ఉంటాయి. వర్షం పడినా అవి నెలలోకి దిగవు. అలాంటి మట్టిలో బతికున్న నల్లకోడిని పెట్టి, అమావాస్య రోజు బాణామతి చేస్తే ఎలా ఉంటుంది అనేది ఇందులో చూపించబోతున్నాం' అని చెప్పారు. 'ఒకప్పుడు బాణామతి భయం వల్ల రాజకీయ, సామాజిక, మానసిక సమస్యలు తలెత్తాయి. ప్రజల అమాయకత్వాన్ని కొందరు ఆసరాగా చేసుకున్న వారి గురించి ఈ చిత్రంలో రియలిస్టిక్‌గా చూపించబోతున్నాం' అని నిర్మాత నందకిషోర్ చెప్పారు.



# క్రీడలు



## బ్యాగ్‌లు మోసేందుకే ఈ ముగ్గురిని ఇంగ్లండ్‌కు తీసుకెళ్లారా?



ఈ మ్యాచ్‌లో గెలవడానికి పర్యాటక జట్టు తీవ్రంగా కృషి చేయాల్సి ఉంది. ఓవల్ టెస్ట్ కోసం టీమిండియా ప్లేయింగ్ ఎలెవెన్‌లో నాలుగు మార్పులు జరిగాయి. కరుణ్ నాయర్, ధ్రువ్ జురెల్, ఆకాష్ దీప్, ప్రసిద్ధ్ కృష్ణలకు ఈ కీలక మ్యాచ్‌లో ఆడే అవకాశం లభించింది. కానీ, జట్టులోని ముగ్గురు స్టార్ ఆటగాళ్లను మరోసారి విస్మరించారు. ఇంగ్లాండ్ వర్సెస్ భారత్ మధ్య ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ చివరి దశకు చేరుకుంది. జులై 31 నుంచి రెండు జట్లు లండన్‌లోని ఓవల్ మైదానంలో ఐదవ, చివరి టెస్ట్ మ్యాచ్‌లో ఒకదానికొకటి తలపడుతున్నాయి. సిరీస్‌లో రెండు మ్యాచ్‌లలో ఓడిపోయిన తర్వాత, శుభ్‌మాన్ గిల్ నేతృత్వంలోని భారత జట్టు 1-2తో వెనుకబడి ఉంది. ఇటువంటి పరిస్థితిలో, భారత జట్టు ఈ మ్యాచ్‌లో ఓడిపోతే లేదా మ్యాచ్ డ్రా అయితే, ఇంగ్లాండ్ సిరీస్‌ను గెలుచుకుంటుంది. అందువల్ల, ఈ మ్యాచ్ టీమ్ ఇండియాకు "డూ ఆర్ డై"గా మారింది. ఈ మ్యాచ్‌లో గెలవడానికి పర్యాటక జట్టు తీవ్రంగా కృషి చేయాల్సి ఉంది. ఓవల్ టెస్ట్ కోసం టీమిండియా ప్లేయింగ్ ఎలెవెన్‌లో నాలుగు మార్పులు జరిగాయి. కరుణ్ నాయర్, ధ్రువ్ జురెల్, ఆకాష్ దీప్, ప్రసిద్ధ్ కృష్ణలకు ఈ కీలక మ్యాచ్‌లో ఆడే అవకాశం లభించింది. కానీ, జట్టులోని ముగ్గురు స్టార్ ఆటగాళ్లను మరోసారి విస్మరించారు. సిరీస్ అంతటా అవకాశం కోసం వేచి ఉన్నప్పటికీ, గౌతమ్ గంభీర్ చివరి మ్యాచ్ కోసం చివరి ఎలెవెన్‌లో చేర్చలేదు.

1. కుల్దీప్ యాదవ్: భారత జట్టు అనుభవజ్ఞుడైన స్పిన్ బౌలర్ కుల్దీప్ యాదవ్ ఇంగ్లాండ్ పర్యటనలో జట్టులో కీలక పాత్ర పోషించాడు. తన వైవిధ్యమైన స్పిన్, వికెట్ తీసే సామర్థ్యంతో, అతను ఏ ప్రత్యర్థి బ్యాటింగ్ ఆర్డర్‌పైనా ఒత్తిడి తెచ్చే సామర్థ్యాన్ని కలిగి ఉన్నాడు. ఇటువంటి పరిస్థితిలో, ఇంగ్లాండ్‌తో జరిగే టెస్ట్ సిరీస్‌లో అతనికి ప్లేయింగ్ ఎలెవన్‌లో అవకాశం లభిస్తుందని భావించారు. అయితే, కుల్దీప్ యాదవ్ సిరీస్ అంతటా ప్లేయింగ్ ఎలెవన్‌లో చేర్చలేదు. నిరంతరం బెంచ్‌పై కూర్చొని కనిపించాడు. అతని నిరంతర నిర్లక్ష్యం ఎంపిక విధానం గురించి ప్రశ్నలను లేవనెత్తింది. ముఖ్యంగా జట్టు స్పిన్ దాడిలో లోతు అవసరమని భావించినప్పుడు కూడా జట్టులో చోటివ్వలేదు.

2. అర్ష్‌దీప్ సింగ్: 2025 అండర్సన్-టెండూల్కర్ ట్రోఫీ కింద ఇంగ్లాండ్‌తో జరిగిన ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో భారత ఫాస్ట్ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్‌కు ఒక్క మ్యాచ్‌లోనూ ప్లేయింగ్ ఎలెవన్‌లో స్థానం కల్పించలేదు. ఈ నిర్ణయం క్రికెట్ అభిమానులు, నిపుణులలో ఎంపిక విధానం గురించి తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తింది. పర్యటన అంతటా అతన్ని జట్టులోనే ఉంచారు. కానీ, అతని పాత్ర నెట్ బౌలర్‌కు మాత్రమే పరిమితం చేశారు. జస్‌ప్రీత్ బుమ్రా లేకపోవడంతో, అర్ష్‌దీప్ సింగ్ ఓవల్ టెస్ట్‌లో అరంగేట్రం చేసే అవకాశం లభిస్తుందని భావించారు. అతను తన తొలి టెస్ట్ క్యాప్ పొందే అవకాశం ఉందని అనేక మీడియా నివేదికలు కూడా పేర్కొన్నాయి. అయితే, ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, జట్టు యాజమాన్యం మరోసారి అతని స్థానంలో ప్రసిద్ధ్ కృష్ణకు అవకాశం ఇవ్వడం ద్వారా అందరినీ ఆశ్చర్యపరిచింది. 29 ఏళ్ల బౌలర్ గతంలో ఆడిన రెండు టెస్ట్ మ్యాచ్‌లలో ఖరీదైనదిగా నిరూపించబడ్డాడు. అయితే, యువ ఫాస్ట్ బౌలర్ దేశీయ క్రికెట్‌లో స్థిరంగా అద్భుతంగా రాణిస్తున్నాడు.

3. అభిమన్యు ఈశ్వరన్: భారత బ్యాట్స్‌మన్ అభిమన్యు ఈశ్వరన్ మరోసారి టీం ఇండియాతో పర్యటనకు వెళ్లాడు. కానీ, అతనికి మైదానంలో ఆడే అవకాశం రాలేదు. ఇంగ్లాండ్‌తో జరిగిన ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో రిజర్వ్ ఓపెనర్‌గా అతన్ని జట్టులోకి తీసుకున్నారు. కానీ, కోచ్ గౌతమ్ గంభీర్ జట్టు యాజమాన్యం అతన్ని ఒకే మ్యాచ్‌లో ప్రయత్నించాల్సిన అవసరం లేదని భావించారు. 29 ఏళ్ల ఈశ్వరన్ చాలా కాలంగా దేశవాళీ క్రికెట్‌లో అద్భుతంగా రాణిస్తున్నాడు. విదేశాలలో ఇండియా ఏ తరపున అనేక చిరస్మరణీయ ఇన్నింగ్స్‌లు కూడా ఆడాడు. అయినప్పటికీ, అతను ఇంగ్లాండ్‌పై అరంగేట్రం కూడా చేయలేకపోయాడు. ఇటువంటి పరిస్థితిలో, అతను బ్యాగ్ మోయడానికి మాత్రమే ఇంగ్లాండ్ పర్యటనకి వెళ్లాడని చెబుతున్నారు.

## ఈ ఇద్దరికీ ఇదే చివరి అవకాశం..!



ఓవల్‌లోని చివరి టెస్ట్ మ్యాచ్‌లో భారత జట్టులో నాలుగు ముఖ్యమైన మార్పులు జరిగాయి. గాయపడిన రిషబ్ పంత్ స్థానంలో ధ్రువ్ జురెల్, బుమ్రా స్థానంలో ప్రసీద్ కృష్ణ, శార్దూల్ ఠాకూర్ స్థానంలో కరుణ్ నాయర్, అన్షుల్ కాంబోజ్ స్థానంలో ఆకాష్ దీప్‌కు అవకాశం లభించింది. ఓవల్ క్రికెట్ గ్రౌండ్‌లో భారత్, ఇంగ్లాండ్ మధ్య చివరి టెస్ట్ మ్యాచ్ ప్రారంభమైంది. ఈ మ్యాచ్ కోసం టీమ్ ఇండియాలో నాలుగు ప్రధాన మార్పులు చోటు చేసుకున్నాయి. గాయపడిన వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ రిషబ్ పంత్ స్థానంలో ధ్రువ్ జురెల్‌కు అవకాశం ఇచ్చారు. ఫాస్ట్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా స్థానంలో ప్రసీద్ కృష్ణకు, శార్దూల్ ఠాకూర్ స్థానంలో కరుణ్ నాయర్‌కు, అన్షుల్ కాంబోజ్ స్థానంలో ఆకాష్ దీప్‌కు అవకాశం ఇచ్చారు. అయితే ముఖ్యంగా కరుణ్ నాయర్, ప్రసిద్ధ్ కృష్ణకు బహుషా ఇదే చివరి అవకాశం అయ్యే ప్రమాదం ఉంది. ఒక వేళ వాళ్లు ఇందులోనూ రాణించలేకపోతే. కరుణ్ నాయర్ కు చివరి అవకాశం లభించింది. తొలి మూడు మ్యాచ?ల్లో బాగా రాణించకపోవడంతో కరుణ్ 4వ టెస్ట్ మ్యాచ్ కు దూరమయ్యాడు. ఇప్పుడు శార్దూల్ ఠాకూర్ స్థానంలో కరుణ్ ను జట్టులోకి తీసుకున్నారు. కాబట్టి కరుణ్ తన కెరీర్ ను కాపాడుకోవాలంటే డూ ఆర్ డై మ్యాచ్ అయిన ఓవల్ టెస్ట్ మ్యాచ్ లో మెరవాలి. జట్టు పేసర్ జస్ప్రీత్ బుమ్రా వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా జట్టుకు దూరంగా ఉన్నాడు. అతని స్థానంలో ప్రసీద్ కృష్ణకు ప్లేయింగ్ ఎలెవన్‌లో స్థానం కల్పించారు. ప్రసీద్ కూడా ఈ సిరీస్‌లో పెద్దగా రాణించలేదు. అందువల్ల అతన్ని కూడా జట్టు నుండి తొలగించారు. కానీ ఇప్పుడు ప్రసీద్‌కు చివరి టెస్ట్‌లో చివరి అవకాశం దొరికింది. గాయం కారణంగా టీం ఇండియా వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ రిషబ్ పంత్ చివరి టెస్ట్‌కు దూరమయ్యాడు. అందువలన ధ్రువ్ జురెల్‌కు అవకాశం లభించింది. ఈ టెస్ట్ సిరీస్‌లో రిషబ్ పంత్ మంచి ఫామ్‌లో ఉన్నాడు, కానీ గాయం కారణంగా అతను జట్టుకు దూరమయ్యాడు. ఇప్పుడు అతనికి జట్టులో స్థానం లభించడంతో ధ్రువ్ జురెల్ బాగా రాణించాల్సి ఉంటుంది. ఈ సిరీస్ మొత్తంలో ఒక్క అవకాశం కూడా దక్కని అతికొద్ది మంది ఆటగాళ్లలో కుల్దీప్ ఒకడు. ఇంగ్లాండ్ జట్టులో ప్రధాన స్పిన్నర్‌గా వచ్చిన కుల్దీప్ బెంచ్ మీద వేచి ఉండటం తప్ప మరేమీ చేయలేకపోయాడు. అతనితో పాటు అభిమన్యు ఈశ్వరన్, అర్ష్‌దీప్ సింగ్ కూడా అవకాశం దక్కకుండా బెంచ్ మీద కూర్చోవాల్సి వచ్చింది. అయితే ఈ మ్యాచ్‌లోనూ రాణించకుంటే కరుణ్ నాయర్ ఇక అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ఇవ్వాల్సిందే అనే ప్రచారం జరుగుతోంది.

## 7 ఇన్నింగ్స్‌ల్లో ఒకేలా..



ఇంగ్లాండ్ పర్యటనలో యశస్వి జైస్వాల్ ఆశించిన ప్రదర్శన ఇవ్వలేకపోయాడు. ఆస్ట్రేలియాలో అద్భుతమైన ఫామ్‌లో ఉన్న జైస్వాల్, ఇంగ్లాండ్‌లో స్థిరమైన ప్రదర్శన ఇవ్వలేకపోయాడు. వరుసగా 7 అవుట్‌లు అతని బ్యాటింగ్ బలహీనతలను ఎత్తి చూపుతాయి. రాబోయే మ్యాచ్‌లలో మెరుగుపడటం అతనికి సవాలుగా మారింది. తన తొలి ఆస్ట్రేలియా పర్యటనలో యశస్వి జైస్వాల్ తన అద్భుతమైన బ్యాటింగ్‌తో అందరినీ ఆకట్టుకున్నాడు. అలాంటి పరిస్థితిలో, ఇంగ్లాండ్ పర్యటనలో కూడా యువ భారత ఓపెనర్ నుంచి ఇలాంటి ప్రదర్శన ఆశించారు. దీనికి తోడు, జైస్వాల్ కూడా ఇలాంటి ఆరంభాన్ని పొంది మొదటి ఇన్నింగ్స్‌లో అద్భుతమైన సెంచరీ సాధించాడు. కానీ ఆ తర్వాత, అతని ప్రదర్శన ప్రత్యేకంగా ఏం లేదు. ఇప్పుడు, జైస్వాల్ ఓవల్ టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో కూడా సింగిల్ డిజిట్‌కే అలసిపోయాడు. ఈ విధంగా, ఈ సిరీస్‌లో ఆరోసారి, అతను 50 కంటే తక్కువ స్కోరుకే ఔటయ్యాడు. కానీ, అతను 7వ సారి కూడా అదే విధంగా ఔట్ కావడం జట్టు ఆందోళనలను పెంచింది. భారత్, ఇంగ్లాండ్ మధ్య జరుగుతున్న టెస్ట్ సిరీస్ లో చివరి మ్యాచ్ జులై 31న ప్రారంభమైంది. ఈ మ్యాచ్ లోనూ టాస్ ఓడిన టీం ఇండియా ముందుగా బ్యాటింగ్ ప్రారంభించింది. కానీ ఈసారి కూడా టీం ఇండియాకు మంచి ఆరంభం లభించలేదు. నాల్గవ ఓవర్ లో జైస్వాల్ ను గస్ అట్కిన్సన్ ఎల్బీడబ్ల్యూగా అవుట్ చేసి జట్టుకు తొలి షాక్ ఇచ్చాడు. ఈ ఇన్నింగ్స్ లో జైస్వాల్ మరోసారి టీం ఇండియాకు భారీ ఆరంభం ఇవ్వలేకపోయాడు. ఎందుకంటే, అతను కేవలం 2 పరుగులకే ఔటయ్యాడు. ఈ సిరీస్‌లో ఇంగ్లాండ్‌తో జరిగిన తొలి టెస్ట్ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో జైస్వాల్ సెంచరీ చేశాడు. తర్వాతి మ్యాచ్‌లో కూడా జైస్వాల్ ఇలాంటి ప్రదర్శన చేస్తాడని ఊహించారు. కానీ, తర్వాతి 8 వరుస ఇన్నింగ్స్‌లలో జైస్వాల్ బ్యాటింగ్‌తో కేవలం 2 అర్ధ సెంచరీలు మాత్రమే చేశాడు. 4 సార్లు సింగిల్ ఫిగర్‌కు అవుట్ అయ్యాడు. వీటిలో, జైస్వాల్ 2 సార్లు తన ఖాతాను కూడా తెరవలేకపోయాడు. మొత్తం మీద, ఈ సిరీస్‌లో అతని స్కోర్లు వరుసగా 101, 4, 87, 28, 13, 0, 58, 0, 2గా ఉన్నాయి.

## రోహిత్ రిటైర్‌మెంట్ అందుకే.. మాజీ మేనేజర్ కీలక వ్యాఖ్యలు



ఇంగ్లండ్‌తో ప్రస్తుతం జరుగుతున్న టెండూల్కర్-అండర్సన్ ట్రోఫీకి ముందు టీం ఇండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ టెస్ట్ క్రికెట్‌కి వీడ్కోలు పలికాడు. 2024-25 బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో టీం ఇండియా ఓటమిపాలైన విషయం తెలిసిందే. దీంతో అప్పుడు కెప్టెన్‌గా వ్యవహరించిన రోహిత్‌ని ఏకంగా చివరి మ్యాచ్‌లో పక్కన పెట్టారు. అనంతరం రోహిత్ కెప్టెన్సీలో ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ విజయం సాధించింది. ఆ తర్వాత రోహిత్ టెస్ట్‌లకు గుడ్‌బై చెప్పేశాడు. అయితే రోహిత్ శర్మ రిటైర్‌మెంట్ వెనుక జట్టు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, మేనేజ్‌మెంట్ ప్రభావం ఉందని ఆరోపణలు వచ్చాయి. దీనిపై తాజాగా బోర్డర్-గవాస్కర్ ట్రోఫీకి మేనేజర్‌గా ఉన్న జయదేవ్ షా కీలక వ్యాఖ్యలు చేశారు. "ఆ టెస్ట్‌కు ముందు రోహిత్‌కి బాబు పుట్టిన కొన్ని రోజులకే గ్రౌండ్‌లోకి వచ్చాడు. కానీ, పరుగులు చేయలేకపోయాడు. ఆ తర్వాత జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీలో అతను జట్టును గెలిపించాడు. దీంతో అతను టెస్టుల కంటే పరిమిత ఓవర్ల క్రికెట్‌కే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించుకున్నాడు. మరోవైపు మేనేజ్‌మెంట్ కూడా కొత్త ఛాంపియన్‌షిప్ కోసం సిద్ధమవుతోంది. రెండేళ్ల పాటు కొత్త ప్లేయర్లను రెడీ చేసే పనిలో ఉంది. రోహిత్ కూడా రెండు సంవత్సరాలు ఆడేందుకు సిద్ధంగా లేడని తెలిసింది. పైగా అతనికి గాయాల బెడద ఉంది. ఐపీఎల్‌లోనూ అతను కొన్ని మ్యాచులు ఆడలేదు. దీంతో రోహిత్ ఇలాంటి కఠినమైన నిర్ణయం తీసుకున్నాడని అనుకుంటున్నా" అని జయదేవ్ అన్నారు.

## గౌతం గంభీర్‌కు సంకటమే..




ఇంగ్లండ్‌తో జరిగే టెస్టు సిరీస్‌లో టీమిండియా ఓడితే జట్టు ప్రధాన కోచ్ గౌతం గంభీర్ ఇబ్బందికర పరిస్థితి ఎదుర్కొవడం ఖాయమని ఇం గ్లండ్ మాజీ ఆటగాడు మైకెల్ అథర్టన్ అభిప్రాయపడ్డాడు. గంభీర్ ప్రధాన కోచ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత టీమిండియా టెస్టుల్లో వరుస ఓటములు చవిచూస్తున్న విషయాన్ని గుర్తు చేశాడు. సొంత గడ్డపై న్యూజిలాండ్‌తో జరిగిన మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో టీమిండియా వైట్‌వాష్‌కు గురైందన్నాడు. కివీస్‌పై ఇంత పేలవమైన ప్రదర్శన భారత్ ఎప్పుడూ చేయలేదన్నాడు. సొంత గడ్డపై జరిగిన సిరీస్‌లో కివీస్ వంటి జట్టు చేతిలో టీమిండియా క్లీన్‌స్వీప్‌కు గురైతుందని కలలో కూడా ఎవరూ ఊ హించి ఉండరన్నాడు.ఆ తర్వాత ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టు సిరీస్‌లో టీమిండియాకు ఘోర పరాభవం ఎదురైందన్నాడు. ఈ సిరీస్‌లో భారత్ 13 తో ఓటమి పాలైన సంగతి మరువకూడదన్నాడు. తాజాగా ఇంగ్లండ్‌తో జరుగుతున్న టెస్టు సిరీస్‌లో టీమిండియా ఇబ్బందుల్లో ఉందన్నాడు. మూడో టెస్టులో ఓడడంతో భారత్ సిరీస్ కోల్పోయే ప్రమాదంలో పడిందన్నాడు. ఒకవేళ చివరి మ్యాచ్‌లో భా రత్ విజయం సాధించక పోతే సిరీస్ కోల్పోవడం ఖాయమన్నాడు. ఇదే జరిగితే గంభీర్ భవితవ్యం ప్రశ్నార్థకంగా మారుతుందని అథర్టన్ వివరించా డు. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో గంభీర్ బాగానే ప్ర భావం చూపుతున్నా టెస్టులకు వచ్చే సరికి పూర్తిగా తేలిపోతున్నాడన్నాడు. గంభీర్ తీసుకుంటున్న అ ర్థంపర్థం లేని నిర్ణయాలతోనే జట్టుకు ఇలాంటి పరిస్థితి నెలకొందన్నాడు. గంభీర్ కోచ్‌గా పూర్తిగా తేలిపోయాడని, ఒక వేళ ఇంగ్లండ్‌తో చివరి టెస్టులో టీమిండియా గెలిస్తేనే అతన్ని కొనసాగించే అవకాశాలుంటాయని అథర్టన్ పేర్కొన్నాడు. సిరీస్‌లో భారత్ పరాజయం చవిచూస్తే గంభీర్ పదవి ప్రమాదంలో పడడం తథ్యమని జోస్యం చెప్పాడు.




# ఆరోగ్యం




## తిన్న వెంటనే స్నానం ఎందుకు చేయకూడదు?



భోజనం చేసిన వెంటనే స్నానం చేయడం అనేది చాలా మందిలో కనిపించే సాధారణ అలవాటు. అయితే ఇది జీర్ణక్రియను నెమ్మదింపజేసి అనారోగ్యానికి దారితీయవచ్చు. శాస్త్రీయంగా దీనికి ఉన్న కారణాలు, నిపుణుల సూచనలు, పాటించాల్సిన జాగ్రత్తల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. ఆరోగ్యంగా ఉండాలంటే ఈ అలవాటు మార్చాల్సిందే. మనకు చాలా మామూలుగా ఉండే అలవాట్లలో తిన్న వెంటనే స్నానం చేయడం ఒకటి. ఉదయాన్నే లేచి అలసటగా ఉంటే.. చాలా మంది ముందుగా టిఫిన్ చేసేసి తర్వాత స్నానానికి వెళ్తారు. కానీ ఈ అలవాటు వల్ల మన శరీరానికి కొన్ని సమస్యలు వచ్చే అవకాశం ఉంది. నిపుణులు చెబుతున్నదాని ప్రకారం.. తిన్న తర్వాత జీర్ణక్రియ జరిగే సమయంలో శరీరాన్ని ప్రశాంతంగా ఉంచడం చాలా ముఖ్యం. ఈ సమయంలో స్నానం చేస్తే జీర్ణక్రియకు అడ్డు వస్తుందని చెబుతున్నారు. తినగానే స్నానం చేయడం వల్ల జీర్ణక్రియ నెమ్మదిస్తుంది. మనం తిన్న వెంటనే.. ఆహారం జీర్ణం కావడానికి మన శరీరం పొట్ట వైపు ఎక్కువ రక్తాన్ని పంపిస్తుంది. అదే సమయంలో స్నానం చేస్తే.. శరీర ఉష్ణోగ్రత తగ్గుతుంది. దాంతో ఆ రక్తం జీర్ణక్రియకు కాకుండా చర్మానికి ప్రసరిస్తుంది. ఈ మార్పు వల్ల జీర్ణశక్తి తగ్గిపోయి అజీర్ణం, గ్యాస్, మలబద్ధకం లాంటి సమస్యలు వస్తాయి. నిపుణుల సలహా ప్రకారం.. భోజనం చేసిన వెంటనే కాకుండా కనీసం 90 నుంచి 120 నిమిషాల వరకు ఆగి తర్వాతే స్నానం చేయడం మంచిది. లేదంటే భోజనానికి ముందే స్నానం చేయడం ఆరోగ్యానికి ఉత్తమం. ముఖ్యంగా జీర్ణక్రియ బలహీనంగా ఉన్నవారు. మలబద్ధకం లేదా అజీర్ణం సమస్యలు ఉన్నవారు ఈ నియమాన్ని తప్పకుండా పాటించాలి. సబ్బుల వాడకం.. కొంతమంది ఎక్కువ నురుగు వచ్చే సబ్బులను వాడుతుంటారు. అలాంటి సబ్బులలో ఉండే రసాయనాలు, సువాసనలు చర్మాన్ని పొడిగా మార్చవచ్చు. దీని వల్ల చర్మం తేమ కోల్పోయి, చర్మ సమస్యలు వస్తాయి. సహజ సబ్బులు.. సున్నితమైన చర్మం ఉన్నవారు (ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు) సహజ పదార్థాలతో తయారైన సబ్బులను వాడటం మంచిది. ఇది చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. రోజువారీ అలవాట్లలో మనం చేసే ఈ చిన్న పొరపాట్లే చాలా ఆరోగ్య సమస్యలకు కారణం అవుతాయి. మనం ఈ శాస్త్రీయ కారణాలను తెలుసుకుని మన జీవనశైలిని మార్చుకుంటే.. ఆరోగ్యంగా ఉండవచ్చు. ఈ నియమాన్ని పాటిస్తే మీ జీర్ణక్రియ కూడా మెరుగుపడుతుంది.

## ఖర్జూరంలో ఆరోగ్య రహస్యాలు..!




ఖర్జూరాలను రాత్రి నానబెట్టి ఉదయం ఖాళీ కడుపుతో తినడం ద్వారా అనేక ఆరోగ్య లాభాలు పొందవచ్చు. ఎముకలు, గుండె ఆరోగ్యం నుంచి జీర్ణక్రియ, చర్మ కాంతి వరకు వాటి ప్రయోజనాలు అమోఘం. ఖర్జూరంలో విటమిన్లు, ఖనిజాలు (ఐరన్, కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం, జింక్), ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. ఖర్జూరాలను రాత్రిపూట నీటిలో నానబెట్టి ఉదయం ఖాళీ కడుపుతో తింటే అద్భుతమైన ఆరోగ్య లాభాలు కలుగుతాయి. బలంగా ఎముకలు.. నానబెట్టిన ఖర్జూరాల్లో మెగ్నీషియం, కాల్షియం, భాస్వరం వంటి పోషకాలు ఎక్కువగా ఉంటాయి. ఇవి ఎముకలు బలంగా తయారవడానికి సహాయపడతాయి. ముఖ్యంగా వయసు పెరిగే కొద్దీ ఎముకలు బలహీనపడకుండా కాపాడతాయి. జీర్ణక్రియకు.. ఖర్జూరంలో ఉన్న ఫైబర్ పేగుల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఇది జీర్ణవ్యవస్థ సరిగా పనిచేసేలా చేసి మలబద్ధకం సమస్యను తగ్గిస్తుంది. శరీరానికి తక్షణ శక్తి.. ఖర్జూరాల్లో సహజంగా ఉండే గ్లూకోజ్, ఫ్రక్టోజ్ శరీరానికి వెంటనే శక్తిని ఇస్తాయి. ఉదయం ఖాళీ కడుపుతో వీటిని తింటే రోజు మొత్తం ఉత్సాహంగా ఉంటారు. రక్తహీనత.. ఖర్జూరంలో ఐరన్ ఎక్కువగా ఉంటుంది. ఇది శరీరంలో హీమోగ్లోబిన్ స్థాయిలను పెంచుతుంది. ముఖ్యంగా మహిళలు, పిల్లలలో ఎక్కువగా కనిపించే రక్తహీనతకు ఇది ఒక మంచి పరిష్కారం. గుండె ఆరోగ్యం.. పొటాషియం, మెగ్నీషియం లాంటి ఖనిజాలు రక్తపోటును అదుపులో ఉంచుతాయి. రోజూ నానబెట్టిన ఖర్జూరాలను తింటే గుండె జబ్బులు వచ్చే అవకాశాలు తగ్గుతాయి. మంచి నిద్ర.. ఖర్జూరాల్లో ఉండే విటమిన్ బీ6, మెగ్నీషియం మెదడు పనితీరును మెరుగుపరుస్తాయి. రాత్రిపూట పాలలో నానబెట్టిన ఖర్జూరాలను తింటే మంచి నిద్ర పడుతుంది. అధిక బరువు.. ఖర్జూరాల్లో ఉన్న ఫైబర్ ఆకలిని తగ్గిస్తుంది. తద్వారా ఎక్కువగా తినాలనే కోరిక తగ్గుతుంది. ఇది బరువును అదుపులో ఉంచుకోవడానికి సహాయపడుతుంది.

### ఆహారంలో లేకుంటే రోగాలు తప్పవంతే..


క్షీణిస్తున్న జీవనశైలితోపాటు తప్పుడు ఆహారపు అలవాట్ల మధ్య మీరు ఆరోగ్యంగా ఉండాలనుకుంటే కొన్ని సూపర్ ఫుడ్స్ మీ ఆహారంలో చేర్చుకోవాల్సిందే. ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉండటానికి అతి ముఖ్యమైన విషయం సరైన ఆహారం. ప్రపంచంలోని అత్యంత ఆరోగ్యకరమైన ఆహారాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. వీటిని మీరు మీ ఆహారంలో భాగం చేసుకోవచ్చు. ఇవి మిమ్మల్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. అనేక వ్యాధుల నుంచి దూరంగా ఉంచుతాయి. ఆకు కూరలు.. మెంతులు, పాలకూర, ఆవాలు, ఉసిరికాయ వంటి క్రూసిఫెరస్, ఆకుకూరల్లో ఇనుము, కాల్షియం, ఫైబర్, యాంటీఆక్సిడెంట్లతో సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరంలోని రక్త లోపాన్ని తీర్చగలవు. శరీరాన్ని నిర్విషీకరణ చేయడంలో సహాయపడతాయి. దీంతో పాటు, క్రూసిఫెరస్ కూరగాయల గురించి మాట్లాడితే, కాలీఫ్లవర్, బ్రోకలీ, క్యాబేజీ ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. వాటిలో విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. గింజలు, విత్తనాలు.. వాల్‌నట్స్, బాదం వంటి విత్తనాలతో పాటు చియా గింజలు, అవిసె గింజలు, పొద్దుతిరుగుడు విత్తనాలలో ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు, ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. జ్ఞాపకశక్తిని పదును పెట్టడంలో కూడా సహాయపడతాయి. పప్పులు, బీన్స్ గురించి మాట్లాడుకుంటే, ఇవి శాఖాహారులకు ప్రోటీన్‌కు మంచి మూలం. పప్పులు, మూంగ్, లోబియా, గ్రామ్, కిడ్నీ బీన్స్ వంటి పప్పులు, పప్పుధాన్యాలు ప్రోటీన్, ఫోలేట్, ఐరన్, ఫైబర్‌తో సమృద్ధిగా ఉంటాయి. వెల్లుల్లి, పెరుగు..వెల్లుల్లిలో అల్లిసిన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది బీపీ, కొలెస్ట్రాల్, రక్తంలో చక్కెరను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇది సహజ యాంటీబయాటిక్. దీంతో పాటు, పెరుగు గురించి మాట్లాడుకుంటే, ఇందులో ప్రోటీన్, కాల్షియం పుష్కలంగా ఉంటాయి. పెరుగు జీర్ణక్రియకు సహాయపడే ప్రోబయోటిక్.

## జామ వర్సెస్ అవాకాడో? ఆరోగ్యానికి ఏది మంచిది..?



ఆరోగ్యానికి పండ్లు అత్యంత అవసరం. జామ, అవాకాడో రెండింటికీ ప్రత్యేకమైన పోషక విలువలు ఉన్నాయి. అయితే మీకు ఏ పండు మరింత అనుకూలమో తెలుసుకోవడం ముఖ్యమే. మన రోజువారీ ఆహారంలో పండ్లకు ప్రత్యేక స్థానం ఉంది. ఆపిల్ నుంచి అవాకాడో వరకు ప్రతి పండు శరీరానికి విలువైన పోషకాలను అందిస్తుంది. వీటిని మామూలుగా తినడమే కాకుండా.. షేక్స్, జ్యూస్ లు, సలాడ్‌లు, స్మూతీల రూపంలో కూడా తీసుకోవచ్చు. జామ, అవాకాడో ఈ రెండింటిలో ఏది మీ ఆరోగ్యానికి ఎక్కువ మంచిది..? ఈబలమైన రోగనిరోధక శక్తి.. దీనిలో విటమిన్ %జ% చాలా ఎక్కువగా ఉంటుంది. ఇది మీ ఇమ్యూనిటీని బాగా పెంచుతుంది. యాంటీఆక్సిడెంట్లు.. శరీరంలో ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే డ్యామేజ్‌ను నివారించే యాంటీఆక్సిడెంట్లు జామలో పుష్కలంగా ఉంటాయి. బరువు తగ్గడానికి సహాయం.. తక్కువ కేలరీలు, ఎక్కువ ఫైబర్ ఉండటం వల్ల బరువు తగ్గాలనుకునే వారికి ఇది ఒక మంచి పండు. రక్తపోటు అదుపు.. పొటాషియం ఎక్కువగా ఉండటం వల్ల రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. మధుమేహానికి బెస్ట్.. దీనికి తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ఉంది కాబట్టి షుగర్ ఉన్నవారు కూడా నిరభ్యంతరంగా తినవచ్చు. జామను ముక్కలుగా కట్ చేసి కొంచెం ఉప్పు, కారం చల్లి తినవచ్చు. జామ పేస్ట్, జ్యూస్, లేదా చట్నీగా కూడా తయారు చేసుకోవచ్చు. గుండెకు మేలు.. ఇందులో ఉండే మోనో అన్‌సాచురేటెడ్ కొవ్వులు గుండె ఆరోగ్యానికి చాలా మంచివి. చర్మం, కళ్లకు రక్షణ.. విటమిన్ జు, ఫోలేట్, యాంటీఆక్సిడెంట్లు చర్మాన్ని మెరిపిస్తాయి. అలాగే లూటీన్, జియాక్సంతిన్ కంటి చూపును కాపాడతాయి. మెరుగైన జీర్ణక్రియ.. ఎక్కువ ఫైబర్ ఉండటం వల్ల జీర్ణక్రియ సజావుగా సాగుతుంది, మలబద్ధకాన్ని తగ్గిస్తుంది. మెదడుకు పోషణ.. ఆరోగ్యకరమైన కొవ్వులు, విటమిన్ జు మెదడు పనితీరును మెరుగుపరుస్తాయి. అవాకాడోను మెత్తగా చేసి టోస్ట్‌పై స్ప్రెడ్‌గా తినడం ఒక ట్రెండీ మార్గం. దీన్ని సలాడ్ లలో, స్మూతీ లలో కలిపి లేదా గ్వాకామోల్‌గా తయారు చేసి శాండ్‌విచ్‌లలో ఉపయోగించవచ్చు. ఈ రెండు పండ్లూ వేర్వేరు రకాల ఆరోగ్య లాభాలను అందిస్తాయి. ఏది మంచిదనేది మీ వ్యక్తిగత ఆరోగ్య అవసరాలపై ఆధారపడి ఉంటుంది. జామ.. ఇమ్యూనిటీ పెంచుకోవాలనుకునేవారు, బరువు తగ్గాలనుకునేవారు, షుగర్ ఉన్నవారు జామను ఎంచుకోవచ్చు. దీనిలో తక్కువ కేలరీలు, ఎక్కువ విటమిన్ జ ఉంటాయి. అవాకాడో.. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచాలనుకునేవారు, చర్మం, మెదడుకు పోషణ కావాలనుకునేవారు అవాకాడోను తీసుకోవచ్చు. దీనిలో ఆరోగ్యకరమైన కొవ్వులు, ఫైబర్ ఎక్కువగా ఉంటాయి. పోషక నిపుణుల అభిప్రాయం ప్రకారం.. రెండింటినీ సమతుల్యంగా మీ ఆహారంలో చేర్చుకోవడం ద్వారా పూర్తి ఆరోగ్య లాభాలను పొందవచ్చు. ఒక పండును వదిలేసి మరొకటి మాత్రమే తీసుకోవడం కన్నా.. రెండింటినీ బ్యాలెన్స్ చేసుకుని తినడం ఉత్తమం.

## ఈ మార్పులు కనిపిస్తే అస్సలు నిర్లక్ష్యం చేయొద్దు..!



ప్రతి రోజూ జరిగే మల విసర్జన అలవాట్లను చాలా మంది పట్టించుకోరు. కానీ వాటిలో వచ్చే కొన్ని మార్పులు తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు సంకేతాలు కావచ్చు. ముఖ్యంగా క్యాన్సర్ వంటి సమస్యలు ప్రారంభదశలో ఇదే రూపంలో కనిపించవచ్చు. అలాంటి లక్షణాలను ఎలా గుర్తించాలో తెలుసుకోవడం చాలా ముఖ్యం. మన శరీరంలో వచ్చే కొన్ని చిన్న గుర్తులను మనం తరచూ పట్టించుకోము. ముఖ్యంగా మల విసర్జన అలవాట్లలో చిన్న మార్పులను మామూలుగా తీసుకోవడం సహజమే. అయితే అలాంటి మార్పులు కొన్నిసార్లు తీవ్రమైన జబ్బులకు గుర్తు కావచ్చు. కొన్నిసార్లు ఇవి క్యాన్సర్ లాంటి ప్రమాదకర ఆరోగ్య సమస్యలు మొదలయ్యాయని చూపించవచ్చు. ఈ రకమైన ఆరోగ్య గుర్తులను ముందుగానే గుర్తించడం వల్ల సరైన సమయంలో పరీక్షలు, చికిత్సలు తీసుకునే అవకాశం ఉంటుంది. ఇప్పుడు మల విసర్జన అలవాట్లలో కనిపించే కొన్ని ముఖ్యమైన లక్షణాల గురించి తెలుసుకుందాం. మీరు మూత్ర విసర్జన చేసేటప్పుడు లేదా మల విసర్జన చేసేటప్పుడు రక్తాన్ని చూస్తే.. వెంటనే జాగ్రత్తగా ఉండాలి. ఇది మూత్రాశయం, కిడ్నీలు లేదా పెద్దప్రేగుల సమస్యలకు గుర్తు కావచ్చు. ముఖ్యంగా ఇది పెద్దప్రేగు క్యాన్సర్ లేదా కిడ్నీ జబ్బుల సూచన కావచ్చు. మీరు రాత్రి సమయంలో చాలా సార్లు మల విసర్జన చేయాల్సి వస్తుందా..? ఇది వృద్ధులలో మామూలుగా కనిపించేదే అయినా.. ప్రోస్టేట్ లేదా మూత్రాశయ సంబంధిత క్యాన్సర్లకు కూడా ఇది గుర్తు కావచ్చు. ముఖ్యంగా పురుషులు ఈ లక్షణాన్ని గమనిస్తే.. వెంటనే డాక్టర్లను కలవడం అవసరం. మీ మలం ఆకారం పెన్సిల్ లాంటి సన్నని రూపంలో మారితే.. అది పేగులలో అడ్డుకుందని అనుకోవచ్చు. ఇది పెద్దప్రేగు క్యాన్సర్ లాంటి సమస్యలను సూచించే మొదట్లోని లక్షణం కావచ్చు. ఈ మార్పులు రోజూ ఉంటే తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలి. ఆహారంలో మార్పులు వచ్చినప్పుడు అప్పుడప్పుడు జీర్ణ సమస్యలు రావడం సహజమే. అయితే ఎక్కువ కాలంగా మలబద్ధకం లేదా విరేచనాలు ఉంటే వాటిని సీరియస్ గా తీసుకోవాలి. ఇది పెద్దప్రేగు లేదా ప్యాంక్రియాస్ క్యాన్సర్ కు సంబంధించి ఉండవచ్చు. ఈ లక్షణాలను పట్టించుకోకపోవడం ఆరోగ్యానికి ప్రమాదం కావచ్చు. మీరు మల విసర్జన సమయంలో నొప్పిని అనుభవిస్తున్నారా..? అది చిన్న ఇన్ఫెక్షన్ కాకపోవచ్చు. ఇది కిడ్నీలు, మూత్రనాళ సంబంధిత ఇన్ఫెక్షన్ లేదా క్యాన్సర్లకు గుర్తు కావచ్చు. అలాగే మల విసర్జన సమయంలో మళ్లీ మళ్లీ బాధగా అనిపించడం కూడా మలద్వారం దగ్గర క్యాన్సర్ సూచన కావచ్చు. మల విసర్జన అలవాట్లలో మార్పులతో పాటు బరువు వేగంగా తగ్గుతుంటే.. దీని వెనుక కొన్ని తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఉండే అవకాశం ఉంది. ముఖ్యంగా పెద్దప్రేగు, ప్యాంక్రియాస్ లేదా పొట్ట క్యాన్సర్ లాంటి సమస్యలకు ఇది గుర్తు కావచ్చు.



# వ్యాపారం




## అమెరికాకు కోలుకోలేని దెబ్బ..

### ఎఫ్-35 యుద్ధ విమానాలను కొనుగోలుకు భారత్ నిరాకరణ



ట్రంప్ దెబ్బ మామూలుగా పడలేదు. భారత్‌పై కనికరం లేకుండా 25శాతం సుంకాలని వేశారు. భారత్ పాక్ యుద్ధాన్ని ఆపేశాను.. అవన్నీ ట్రేడ్ డీల్స్ బెదిరింపులతోనే అంటూ గప్పాలు కొట్టుకున్న అమెరికా అధ్యక్షుడు.. ఇప్పుడు భారత్‌ను దొంగదెబ్బతీశారు. 25శాతం సుంకాలతోపాటు.. బయటకు చెప్పని పెనాల్టీ కూడా విధించారు. రష్యాతో భారత్ వాణిజ్యం చేస్తున్న కారణంగానే పెనాల్టీ విధిస్తున్నట్లు ప్రకటించారు. అంటే 25శాతం ప్లస్ పెనాల్టీ అంటే అది ఎంత శాతానికి చేరుతుందో ఇప్పడే బయటపడే విషయం కాదు. భారత్‌పై అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌ల పిడుగు వేశారు. పాతిక శాతం సుంకాలను విధిస్తున్నట్లు ప్రకటించారు. దీనికి అనేక కారణాలు చెబుతున్నా.. అక్కసుతోనే ఈ టారిఫ్‌లు వేశారన్నది సుస్పష్టం. బ్రిక్స్‌లో భాగమైనందుకు, రష్యా ఆయిల్ కొంటున్నందుకు, తమ వస్తువులపై ఎక్కువ పన్నులు వేస్తున్నందుకు ఇలా అనేక విషయాలను మనసులో పెట్టుకుని ట్రంప్ భారత్‌పై పిడుగులాంటి టారిఫ్‌ను సంధించారు. ఇది ప్యూర్ మైండ్‌గేమ్‌తో తీసుకున్న డెసిషన్. దీంతో భారత్‌లో పొలిటికల్ దుమారం కూడా చెలరేగింది. ఈ క్రమంలోనే వాణిజ్య ఒప్పందం గురించి భారత్-అమెరికా మధ్య చర్చలు జరుగుతున్నాయి. అయితే, ఈలోగా, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారతదేశంపై 25 శాతం సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించారు. ఆగస్టు 7 నుండి ఈ సుంకాలు అమలులోకి రానున్నాయి. ఈ నేపథ్యంలోనే భారతదేశం కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. నివేదిక ప్రకారం, అమెరికాకు ఎఫ్-35 యుద్ధ విమానాలను కొనుగోలు చేయడానికి భారత్ నిరాకరించింది. అమెరికన్ ఉత్పత్తుల కొనుగోలును వేగవంతం చేయాలని భారత ప్రభుత్వం ఆలోచిస్తున్నప్పటికీ, అమెరికా నుండి అదనపు రక్షణ ఉత్పత్తులను కొనుగోలు చేసే అవకాశం లేదని అధికారులను ఉటంకిస్తూ బ్లూమ్‌బెర్గ్ తన కథనంలో పేర్కొంది. బ్లూమ్‌బెర్గ్ విడుదల చేసిన నివేదిక ప్రకారం, ఎఫ్-35 స్టీల్త్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ కొనుగోలుపై ఆసక్తి లేదని భారత్ అమెరికాకు తెలియజేసిందని పేర్కొంది. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫిబ్రవరి 2025లో అమెరికాను సందర్శించారు. వైట్ హౌస్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను కలిశారు. ఈ సందర్భంగా, ట్రంప్ భారతదేశానికి ఎఫ్- 35 యుద్ధ విమానాలను విక్రయించడానికి ముందుకొచ్చారు. అయితే దేశీయంగా రక్షణ పరికరాల ఉమ్మడి రూపకల్పన, తయారీపై దృష్టి సారించిన భాగస్వామ్యాలపై భారత ప్రభుత్వం ఎక్కువ ఆసక్తి చూపుతుందని అధికారులు తెలిపారు. దీనిపై భారత రక్షణ మంత్రిత్వ శాఖ ఇంకా స్పందించలేదు. ఆగస్టు 1 నుండి భారతదేశం నుండి దిగుమతి చేసుకునే ఉత్పత్తులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 25 శాతం సుంకాన్ని ప్రకటించారు. రష్యా నుండి దిగుమతులకు శిక్షాత్మక చర్యగా భారతదేశంపై జరిమానాను కూడా విధించారు. ఇది 25 శాతం సుంకం నుండి వేరుగా ఉంటుంది. భారతదేశం సుంకాలు చాలా ఎక్కువగా ఉన్నందున అమెరికా భారతదేశంతో సాపేక్షంగా తక్కువ వాణిజ్యం చేసిందని ట్రంప్ భావిస్తున్నారు.

## జపాన్‌ను అధిగమించి భారతదేశం..



సౌరశక్తి ఉత్పత్తిలో జపాన్‌ను వెనక్కి నెట్టి భారతదేశం ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద దేశంగా అవతరించిందని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. అంతర్జాతీయ పునరుత్పాదక ఇంధన సంస్థ నుండి వచ్చిన డేటాను ఉటంకిస్తూ, భారతదేశం ఇప్పటివరకు 1,08,494 గిగావాట్ అవర్ సౌరశక్తిని ఉత్పత్తి చేసిందని, జపాన్ 96,459 +జౌట్ల సౌరశక్తిని ఉత్పత్తి చేసిందని ఇంధన మంత్రి అన్నారు. భారతదేశం జపాన్‌ను అధిగమించింది. ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద సౌరశక్తి ఉత్పత్తిదారుగా అవతరించిందని కేంద్ర ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి ప్రకటించారు. అంతర్జాతీయ పునరుత్పాదక ఇంధన సంస్థ నుండి డేటాను ఆయన ప్రస్తావించారు. భారతదేశం ఇప్పటివరకు 1,08,494 గిగావాట్ గంటల సౌరశక్తిని ఉత్పత్తి చేసిందని, జపాన్ 96,459 +జౌట్ల సౌరశక్తిని మాత్రమే ఉత్పత్తి చేసిందని ఆయన స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో భారతదేశం ప్రపంచ క్లీన్ ఎనర్జీ విప్లవానికి నాయకత్వం వహిస్తోందని కేంద్ర మంత్రి అన్నారు. 2030 నాటికి 500 గిగావాట్ల శిలాజేతర ఇంధన ఆధారిత విద్యుత్ సామర్థ్యం అనే ప్రతిష్టాత్మక లక్ష్యాన్ని చేరుకోవడానికి భారత్ బహుముఖ విధానంతో పనిచేస్తున్నందున ఈ విజయం సాధ్యమైందన్నారు. ఈ దిశలో భారతదేశం సాధించిన పురోగతి ఇంధన భద్రతను పెంచడమే కాకుండా ప్రపంచ వాతావరణ మార్పులకు వ్యతిరేకంగా ఒక బలమైన అడుగుగా కూడా నిరూపితమైందన్నారు. అంతర్జాతీయ ఇంధన సంస్థ 2024 డేటా ప్రకారం, సౌరశక్తి సామర్థ్య వృద్ధిలో చైనా ముందుంది. ఇది 2023లో 260 గిగావాట్లను ఉత్పత్తి చేసింది. ఇది మునుపటి సంవత్సరం కంటే దాదాపు మూడు రెట్లు ఎక్కువ. చైనా 14వ పునరుత్పాదక ఇంధన ప్రణాళిక 2022లో అమలు చేయడానికి ప్రతిష్టాత్మక లక్ష్యాలను నిర్దేశించుకుంది.

## అధిక సుంకాలతో జీడీపీ తగ్గొచ్చు

అమెరికా విధిస్తున్న అధిక సుంకాలు భారత జీడీపీని దెబ్బతీయనున్నాయని విత్త సంస్థ బార్క్‌లేస్ విశ్లేషించింది. భారత వస్తువులపై 25 శాతం సుంకాలు సహా రష్యన్ దిగుమతులపై అదనపు జరిమానా విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ పరిణామం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత జీడీపీని 30 బేసిస్ పాయింట్లు (0.3 శాతం) తగ్గించనుందని అంచనా వేసింది. అమెరికాతో వాణిజ్య చర్చలు కొనసాగుతున్నందున.. తుది సుంకాలు 25 శాతం కంటే తక్కువగా ఉండవచ్చని పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత వృద్ధి 6.5 శాతంగా ఉండొచ్చని ఆర్‌బీఐ, ఐఎంఎఫ్ 6.4 శాతంగా, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ 6.5 శాతంగా అంచనా వేశాయి. అమెరికా అధిక సుంకాలతో భారత్‌కు చెందిన ఫార్మాస్యూటికల్స్, రత్నాలు, వస్త్రాలు వంటి రంగాలు సుంకాల ప్రభావాన్ని ఎదుర్కొనే అవకాశం ఉంది. వ్యవసాయం , డెయిరీ రంగాలలో మార్కెట్ యాక్సెస్ విషయంలో భారతదేశం గతంలో జాగ్రత్తగా వ్యవహరించిందని మూడీస్ అనలిటిక్స్ అసోసియేట్ ఎకనమిస్ట్ అదితి రామన్ పేర్కొన్నారు.

## అమెరికా హెచ్చు సుంకాలు అమలు

### ఆక్వా రైతులకు భారీ నష్టమే




భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించిన హెచ్చు సుంకాలు శుక్రవారం నుంచి అమల్లోకి రానున్నాయి. భారత్‌ను అత్యంత సన్నిహిత మిత్రదేశంగా పేర్కొంటూనే 25 శాతం టారిఫ్‌లను విధించారు. ఆగస్టు 1 గడువు ముందు భారత్-అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం జరగాల్సి ఉండగా.. ఇంకా ఈ చర్చలు జరుగుతున్నాయి. ఈ తరుణంలోనే ట్రంప్ అధిక సుంకాలను అమల్లోకి తీసుకురావడం గమనార్హం. ట్రంప్ చర్యలతో ప్రధానంగా భారత ఎగుమతి రంగాలైన ఆటో పరికరాలు, స్టీల్, అల్యూమినియం, జెమ్స్ అండ్ జ్యువెలరీ, టెక్స్‌టైల్స్, సముద్రపు ఉత్పత్తులపై ప్రధానంగా ప్రభావం పడనుంది. అమెరికా విధించిన సుంకాలు ఆర్థిక వ్యవస్థపై, ముఖ్యంగా రొయ్యల ఎగుమతి రంగంపై తీవ్ర ప్రభావం చూపనుంది. భారతదేశ మొత్తం రొయ్యల ఎగుమతిలో ఆంధ్రప్రదేశ్ 70 శాతం కంటే ఎక్కువ వాటాను కలిగి ఉంది. ఈ రంగంపై దాదాపు 10 లక్షల కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని అంచనా. ట్రంప్ ప్రకటించిన 25 శాతం టారిఫ్‌లు ఈ రంగానికి తీవ్ర ఆటంకం కలిగిస్తాయని పరిశ్రమ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తోన్నారు. అధిక సుంకాలలో అమెరికా భారత రొయ్యల ధరలు పెరుగుతాయి. దీంతో పోటీతత్వాన్ని ఎదుర్కోలేవు. ఫలితంగా ఎగుమతి ఆదాయం తగ్గడంతో రొయ్యల సాగుదారులు నష్టాలను చవి చూసే ప్రమాదం ఉంది. ఈ రంగంలోని సంబంధిత ఉద్యోగులు, కూలీల జీవనోపాధి దెబ్బతిననుంది. అదే విధంగా టారిఫ్‌లు రాష్ట్రంలోని వ్యవసాయం, ఐటీ, తయారీ రంగాలను ఒత్తిడి గురి చేయనున్నాయి. మామిడి, మసాలాలు, బియ్యం తదితర వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు తగ్గిపోనున్నాయి. దీంతో ఈ రంగంలోని రైతులు స్థానిక మార్కెట్లపై లేదా ఇతర దేశాల మార్కెట్లపై ఎక్కువగా ఆధారపడవలసి వస్తుంది. ఎగుమతి ఆదాయం తగ్గడం వల్ల రాష్ట్రంలో వ్యవసాయ, ఆక్వా రంగంలో పెట్టుబడులు, మౌలిక సదుపాయాల అభివృద్ధి మందగించనుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## తగ్గిన బంగారం గిరాకీ

### అధిక ధరలే ప్రధాన కారణం




ఈ ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో భారత్‌లో గోల్డ్ డిమాండ్ వార్షిక ప్రాతిపదికన 10 శాతం తగ్గి 134.9 టన్నులకు పరిమితమైందని ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) గురువారం విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. గత ఏడాది ఇదే కాలానికి పసిడి గిరాకీ 149.7 టన్నులుగా నమోదైంది. విక్రయాల విలువ పరంగా చూస్తే, ఈ జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో బంగారం డిమాండ్ 30 శాతం పెరిగి రూ.1,21,800 కోట్లకు చేరింది. క్రితం సంవత్సరంలో ఇదే సమయానికి డిమాండ్ విలువ రూ.93,850 కోట్లుగా నమోదైంది. సమీక్షా కాలంలో బంగారం ధర తొలిసారిగా రూ.లక్షకు చేరడంతో.. గిరాకీ పరిమాణం తగ్గినప్పటికీ, విలువలో వృద్ధి నమోదైందని డబ్ల్యూజీసీ రీజనల్ సీఈఓ- ఇండియా సచిన్ జైన్ అన్నారు. ఈ ఏడాది ప్రథమార్ధం(జనవరి-జూన్)లో బంగారం గిరాకీ దాదాపు 253 టన్నులుగా ఉండగా.. పూర్తి ఏడాదికి గిరాకీ 600-700 టన్నుల స్థాయిలో ఉండవచ్చని ఆయన అంచనా వేశారు. అధిక ధరల కారణంగా జూన్ క్వార్టర్‌లో స్వర్ణాభరణాల విక్రయాలు 17 శాతం తగ్గి 88.8 టన్నులకు పరిమితమయ్యాయి. 2024లో ఇదే కాలానికి 106.5 టన్నుల సేల్స్ జరిగాయి. గోల్డ్ జువెలరీ విక్రయాల విలువ మాత్రం 20 ్ర వృద్ధితో రూ.80,150 కోట్లుగా నమోదైంది. ఈ ఏప్రిల్-జూన్‌లో బంగారంలో పెట్టుబడులు 7 శాతం పెరిగి 46.1 టన్నులకు చేరగా.. పెట్టుబడుల విలువ ఏకంగా 54 శాతం వృద్ధితో రూ.41,650 కోట్లుగా నమోదైంది. పసిడి దీర్ఘకాలంలో మెరుగైన ప్రతిఫలాలు అందించగలదన్న ఇన్వెస్టర్ల నమ్మకాన్ని ఇది నొక్కి చెబుతోందని సచిన్ జైన్ అన్నారు. జూన్ క్వార్టర్‌లో భారత్‌లోకి పసిడి దిగుమతులు 34 శాతం తగ్గి 102.5 టన్నులుగా నమోదయ్యాయి. గత ఏడాది ఇదే త్రైమాసికంలో దేశంలోకి 150 టన్నుల బంగారం దిగుమతైంది. సమీక్షా కాలంలో గోల్డ్ రీసైక్లింగ్ (పాత బంగారం పునర్వినియోగం) ఒక శాతం పెరుగుదలతో 23.1 టన్నులుగా నమోదైంది. ఈ ఏప్రిల్ - జూన్‌లో ప్రపంచవ్యాప్తంగా బంగారం గిరాకీ 3 శాతం పెరిగి 1,249 టన్నులకు చేరింది. అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చితుల నేపథ్యంలో గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ల (ఈటీఎఫ్)లోకి పెట్టుబడులు భారీగా పెరగడం ఇందుకు కారణమని డబ్ల్యూజీసీ తెలిపింది. అంతేకాదు, సెంట్రల్ బ్యాంకులు కూడా 166 టన్నుల బంగారం కొనుగోలు చేశాయని రిపోర్టులో వెల్లడించింది.

## బాహుబలి కారు
## ధర తెలిస్తే బిత్తరపోతారు?

కారు కొనుగోలు చేయాలనుకుంటున్నారా.? అయితే మీకోసం ఇది.. ఈ కారు రూ. 3 లక్షలు తక్కువగా దొరుకుతోంది. జూలై నెలలో పలు ప్రముఖ కార్ల తయారీ సంస్థలు ప్రీమియం, లాక్షు కార్లపై డిస్కౌంట్లను అందిస్తోన్న సంగతి తెలిసిందే. అందులో ఒకటి వోక్స్‌వ్యాగన్ టిగువాన్ = లైన్.. ఈ లాక్షు కారు ప్రస్తుతం రూ. 3 లక్షల భారీ తగ్గింపునకు దొరుకుతోంది. సరిగ్గా 90 రోజుల క్రితం మార్కెట్‌లోకి వచ్చిన ఈ కారు.. ఆ సమయంలో రూ. 49 లక్షలు(ఎక్స్-షోరూమ్) పలికింది. ఈ ప్రీమియం ఆల్-వీల్ డ్రైవ్ లాక్షు ఇప్పుడు ప్రత్యేకమైన డిస్కౌంట్లతో రూ. 46 లక్షలకే కస్టమర్లకు అందుబాటులోకి వచ్చింది. ఈ ప్రయోజనాలను నగదు, ఎక్స్ఛేంజ్ బోనస్, కార్పొరేట్ డిస్కౌంట్ రూపంలో పొందవచ్చు. వోక్స్‌వ్యాగన్ టిగువాన్ ఆర్ లైన్ 2.0-లీటర్ టర్బోచార్జ్డ్ పెట్రోల్ ఇంజిన్‌తో పనిచేస్తుంది. ఈ ఇంజిన్ 204 బీహెచ్‌పీ, 320 ఎన్ఎమ్ టార్క్ ఉత్పత్తి చేస్తుంది. 7-స్పీడ్ డ్యూయల్-క్లచ్ ఆటోమేటిక్ గేర్‌బాక్స్ ద్వారా 4 చక్రాలకు శక్తిని అందిస్తుంది. ఈ ఆల్-వీల్ డ్రైవ్ లాక్షు 7.1 సెకన్లలో 0 నుంచి 100 కిమీ వేగాన్ని అందుకుంటుంది. అలాగే గరిష్టంగా 229 కిమీ వేగాన్ని కలిగి ఉంటుంది. టిగువాన్ ఆర్ లైన్ పెట్రోల్ వేరియంట్ కారు కాగా.. ఇది లీటర్‌కు 12.58 కిమీ మైలేజ్ అందిస్తుంది. అలాగే దీని పెట్రోల్ ట్యాంక్ క్యాపసిటీ 60 లీటర్లుగా ఉంది.

## శ్రీ ఆంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టిన గ్రామస్తులు



**దేవరకద్ర అమరచింత ఆగస్టు 1( స్కై న్యూస్):**అమరచింత మండల కేంద్రంలో వెలసిన శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం పునర్నిర్మాణమునకు గ్రామస్తులు ముందుకు రావడం జరిగినది. అందులో భాగంగా శుక్రవారం గ్రామంలోని ప్రతి ఇంటికి ఆంజనేయస్వామి గుడి పునర్నిర్మాణం లో భాగంగా కరపత్రం పంపిణీ ప్రచారం నిర్వహించడం జరుగుతున్నది. ముఖ్యంగా ఏడవ తేదీ స్వామివారికి పూజా కార్యక్రమం నిర్వహించడం అందులో భాగంగా గ్రామంలోని ప్రతి వ్యక్తి స్వామివారిని దర్శనం చేసుకోవాల్సిందిగా ప్రచారం నిర్వహిస్తున్నాము. గ్రామంలోని ప్రతి కడప నుంచి ఒక టెంకాయ, కుంకుమ, పసుపు, ఊదు బత్తీలు, 5 తమలపాకులు స్వామివారికి సమర్పించి ఆలయ పునర్నిర్మాణంలో ఎటువంటి ఇబ్బందులు కలవకుండా స్వామివారి ఆశీస్సులు గ్రామస్తులపై ఉండాలని కోరుకుంటూ ఆలయ నిర్మాణం త్వరగా పూర్తి అయ్యే విధంగా ఈ యొక్క పూజా కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతున్నది. కాబట్టి గ్రామంలోని ప్రతి వ్యక్తి కూడా ఏడవ తేదీ స్వామివారిని దర్శించుకుని ఆశీర్వాదం తీసుకోవాల్సిందిగా భక్తులకు తెలియజేస్తున్నాము. ఈ ప్రచార కార్యక్రమంలో ఆలయ కమిటీ మెంబర్స్ కొట్టం వెంకట్ రెడ్డి, అచ్యుతారెడ్డి, ముష్టి శ్రీనివాస్ యాదవ్, కామారెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, కటిక శివాజీ, కటికే రాజేష్, ఎం కృష్ణారెడ్డి, బండారు శ్రీకాంత్, మరాఠీ రఘురాం, టీవీ,రవి, మంగ అనిల్, ఎర్ర సత్యనారాయణ, క్యామ నగేష్, తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు.

## కస్తూరిబా గాంధీ పాఠశాలను సందర్శించిన బిజెపి మండల అధ్యక్షురాలు డాక్టర్ లావణ్య, ఏబీవీపీ విద్యార్థి సంఘం నాయకులు




**దేవరకద్ర, అమరచింత ఆగస్టు 1 (స్కై న్యూస్):**అమరచింత శివారులో ఉన్న మండల నికి చెందిన కస్తూరిబా గాంధీ పాఠశాలను సందర్శించి అక్కడ విద్యార్థులతో పాఠశాలలో ఉన్న వసతులను, భోజన సౌకర్యాలను విద్య వసతులను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పాఠశాల స్టాఫ్ ఎస్ ఓ, టీచర్లతో తో మాట్లాడి ఇక్కడ విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాల గురించి మాట్లాడడం జరిగింది. కొంతకాలం క్రితం విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ ఇబ్బంది పడిన విద్యార్థులతో మాట్లాడి అదే విధంగా విద్యార్థులకు న్యాయమైన విద్య భోజన వసతులు కల్పించాలని కేంద్ర ప్రభుత్వం కల్పిస్తున్న కస్తూరిబా గాంధీ పాఠశాలల విద్యా విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని, అదేవిధంగా పాఠశాల స్టాఫ్ కూడా పరిసరాలను పరిశు భ్రంగా ఉంచి విద్యార్థుల ఆరోగ్యాన్ని కూడా దృష్టిలో ఉంచుకోవాలని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు రాజేష్, ఉదయ్ గౌడ్, బిజెపి మండల నాయకులు టైలర్ నరసింహ, తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## బూర్గుల గ్రామంలో బిజెపి నూతన పోలింగ్ బూత్ కమిటీ ఎన్నిక

**షాద్నగర్ 1(స్కైన్యూస్)** మండలం బూర్గుల గ్రామంలో బిజెపి నూతన పోలింగ్ బూత్ కమిటీ లను ఎన్నుకోవడం జరిగింది. బూర్గుల గ్రామలో 207 వ పోలింగ్ బూత్ 209 వ పోలింగ్ బూత్ కమిటీ ని ఎన్నుకోవడం జరిగింది. 207వ పోలింగ్ బూత్ అధ్యక్షులుగా యాదగిరి కార్యదర్శిగా జంగయ్య, శ్రీశైలం మన్ కీ బాత్ ప్రముఖ్ గా %శ్రీ%రాజశేఖర్, లాభార్తి ప్రముఖ్ గా వాల్ రమేష్, వాట్సాప్ గ్రూప్ ప్రముఖ్ గా వెంకటేష్, నర్సింహా, %దీూా% 2 గా శేఖర్ మరియు 209 వ పోలింగ్ బూత్ అధ్యక్షులుగా యాదగిరి కార్యదర్శిగా యాదగిరి గౌడ్, లాబార్థి ప్రముఖ్ గా హరిశ్వర్, మన్ కీ బాత్ ప్రముఖ్ గా కృష్ణ, వాట్సాప్ గ్రూప్ ప్రముఖ్ గా గిరి, %దీూా% 2 గా నవీన్ ను ఎన్నుకోవడం జరిగింది.ఈ కార్యక్రమలో బిజెపి సీనియర్ నాయకులు సన్ గోముల శ్యామ్ సుందర్ రెడ్డి, మోహన్ సింగ్, మండల ప్రధాన కార్యదర్శి రఘు గౌడ్, సీనియర్ నాయకులు చేగు సుధాకర్ అప్ప, హరీష్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు..

## పర్యావరణ పరిరక్షణకు ఏఐఎస్ఎఫ్ ముందడుగు

**ఒక మనిషికి ఒక చెట్టు" నినాదంతో ఏఐఎస్ఎఫ్ కార్యక్రమం**

**ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆకాష్ నాయక్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మక కార్యక్రమం**



**షాద్నగర్ 1(స్కైన్యూస్):**పర్యావరణ పరిరక్షణకు ప్రతి విద్యార్థి తోడ్పడేలా కృషి చేయాలని అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ (ఏఐఎస్ఎఫ్) జిల్లా సహాయ కార్యదర్శి ఆకాష్ నాయక్ పిలుపునిస్తూ.... జిల్లేడు మండల కేంద్రంలోని చౌదరిగూడ ప్రభుత్వ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో శుక్రవారం చెట్టు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. పాఠశాల ఆవరణను ఆకుపచ్చగా తీర్చిదిద్దేందుకు ఉద్దేశ్యంతో వివిధ జాతుల మొక్కలు నాటబడ్డాయి. ప్రతి ఒక్కరిలో పర్యావరణ స్ఫూర్తిని రగిలించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆకాష్ నాయక్ మాట్లాడుతూ ...ప్రతీ మనిషి బాధ్యతగా కనీసం ఒక చెట్టు నాటి దాన్ని పరిరక్షించాలన్నారు. కాలుష్యానికి చెక్ పెట్టేందుకు వృక్షాలు ప్రధాన ఆయుధమని, ప్రకృతి సమతుల్యత కోసం చెట్లు అనివార్యమని చెప్పారు. ఇది ఒకరోజు కార్యక్రమంగా కాకుండా, ప్రతి ఏడాది వర్షాకాలంలో నిరంతరంగా కొనసాగించాలని ఉపాధ్యాయులు ఏఐఎస్ఎఫ్ నేతలు పిలుపునిచ్చారు. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు సునీత అలాగే ఉపాధ్యాయులు మాట్లాడుతూ...విద్యార్థుల్లో పర్యావరణ చైతన్యం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని,చెట్టును నాటడమే కాకుండా దాన్ని పరిరక్షించే బాధ్యతను కూడా వారు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులే ఎప్పటికప్పుడు మొక్కలను పర్యవేక్షణ చేస్తూ వాటి ఎదుగుదలపై నిత్యం శ్రద్ధ వహించాలని సూచించారు. ఒక మనిషికి ఒక చెట్టు అనే నినాదాన్ని శబ్దింపజేస్తూ కార్యక్రమాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సునీత, టీచర్స్, సుశీల, శిరీష, స్వప్న, పార్వతి, వాణి,కళ్యాణి, భానుచంద్రిక, శంకర్ గౌడ్, కుషాల్, శ్రీనివాస్, నరేందర్, సాయి తదితర ఉపాధ్యాయులు, ఏఐఎస్ఎఫ్ జిల్లెడ్ చౌదరిగుడా మండల నాయకులు శివ, జాకీర్, అల్తాఫ్, చంద్రశేఖర్,విద్యార్థి విద్యార్థులు పాల్గొన్నారు..

# సంపూర్ణత అభియాన్ సమ్మాన్ సమరోహ ఆకాంక్షమేల






**చంచుపల్లి ఆగస్టు 1( స్కై న్యూస్ ):**సంపూర్ణత అభియాన్ సన్మాన సమర్వా ఆకాంక్షమేల కార్యక్రమాన్ని ఎసిబి నగర్ నందు గల రైతు వేదిక చంచుపల్లి మండలం నందు ఏర్పాటు చేయడం జరిగింది ఈ యొక్క కార్యక్రమానికి కొత్తగూడెం నియోజకవర్గ సంబంధించిన అన్ని మండలాల నుంచి రైతులని ఆహ్వానించాము అంటే పాడి రైతులు జీవాలు పెంపకదారులు కోళ్ల పెంపకదారులను ఆహ్వానించాము అదేవిధంగా పశు వైద్య పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ ఎం వెంకటేశ్వర్లు, రామ్ రెడ్డి జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ,డాక్టర్ అరుణ భారతి అసిస్టెంట్ డైరెక్టర్ ఏవి హెచ్ కొత్తగూడెం డాక్టర్ బద్దులాల్ పశువైద్యాధికారి జూలూరుపాడు మండల్ డాక్టర్ ఆనంద్ రావు పశువైద్యాధికారి రామవరం కొత్తగూడెం మండల్ వివిధ మండలాలలో పనిచేసే పశు వైద్య సిబ్బంది ఔత్సాహిక పాడి రైతులు జీవాల పెంపకం దారులు కోళ్ల పెంపకం దారులు..ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా పశువైద్య పశుసంవర్ధక శాఖ అధికారి మాట్లాడుతూ భారతదేశంలో సమానత్వం సమగ్ర అభివృద్ధి సాధించాలని లక్ష్యంతో భారత ప్రభుత్వం ముఖ్యంగా నీతి ఆయోగ్ అనేక కార్యక్రమాలు చేపట్టిందని ఈ కార్యక్రమాలను ఆకాంక్ష జిల్లాలు ఆకాంక్ష మండలాలు అనే కార్యక్రమాలు కీలకమైనవి ఈ కార్యక్రమాల ద్వారా వెనుకబడిన ప్రాంతాలను గుర్తించి వాటిలో వేగవంతమైన అభివృద్ధిని తీసుకురావడానికి కృషి చేస్తున్నారు. ఆకాంక్షమేల అంటే నీతి ఆయోగ్ యొక్క ఆకాంక్ష బ్రాండ్ కింద ప్రారంభించబడిన దేశవ్యాప్త కార్యక్రమం దీని ప్రధాన లక్ష్యం ఆకాంక్ష మండలాల నుండి వచ్చే స్థానిక ఉత్పత్తులు చేతివృత్తులు రైతు ఉత్పత్తిదారుల సంఘాలు తయారు చేసిన వస్తువులను ప్రోత్సహించడం ఈ క్రమంలో మేకపాల యొక్క పోషక విలువలను వాటి ప్రాముఖ్యతను మనుషులు మేకపాలు తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య సూచనలను తెలియజేసినారు అదే విధంగా ఈ యొక్క మేకపాలను ప్రతిరోజు మన జిల్లా హెడ్ క్వార్టర్ గవర్నమెంట్ హాస్పిటల్ కొత్తగూడెం ఫుడ్ కోర్ట్ నందు స్టాల్ నెంబర్ 6 నందు ప్రతిరోజు మేకపాలు లభ్యమవుతున్నాయని తెలియజేసినారు పాడి రైతులకు పాడిపశువులలో పునరుత్పత్తి వ్యవస్థకు సంబంధించిన ఆరోగ్య సూచనలను తెలియజేసినారు అదే విధంగా బ్యాంకింగ్ సంస్థ నుండి వచ్చిన వారు బ్యాంకు ద్వారా అందించే హెల్త్ ఇన్సూరెన్స్ గురించి తగిన సూచనలు తెలియజేసినారు అదే విధంగా లోన్ అప్లికేషన్ పెట్టుకోవడం తద్వారా రుణ సదుపాయం పొందాలంటే వాటికి సంబంధించిన అర్హత డాక్యుమెంట్లు ఏమేమి పొందుపరిచాలో సంబంధిత బ్యాంకింగ్ అధికారులు హాజరైన రైతులకు కూలంకషంగా విపులంగా తెలియజేసినారు ఈ యొక్క కార్యక్రమానికి సుమారుగా 35 మంది రైతులు హాజరై చాలా సహనంతో వారికి ఉన్న సందేహాలను అధికారుల ముందు ఉంచి అధికారుల నుంచి తగిన వివరణ తీసుకోవడం జరిగింది..

# అధికారులారా ఇళ్ల నిర్మాణాలకు అనుమతి ఇవ్వండి

**మాకు అన్యాయం చేయొద్దు**

**జిల్లేడు చౌదరిగుడ రెడ్ హిల్స్ వెంచర్ బాధితుల ఆందోళన**

**షాద్ నగర్ లో బాధితుల ధర్నా**




**రంగారెడ్డి జిల్లా షాద్ నగర్1(స్కైన్యూస్)** నియోజకవర్గ జిల్లేడు చౌదరి గూడెం మండలం లాల్ పహాడ్ వద్ద గత 12 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన రెడ్ హిల్స్ వెంచర్ పై అధికారులు విధించిన స్టేతస్కో నిర్ణయం సముచితం కాదని వెంటనే నిబంధనను ఎత్తివేసి పేదలు కొనుక్కున్న ఇళ్ల స్థలాలకు అనుమతి ఇవ్వాలని రెడ్ హిల్స్ వెంచర్ బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం షాద్ నగర్ మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. రెడ్ హిల్స్ వెంచర్ బాధితులు మిట్టె బాలరాజ్ వీరయ్య రమేష్ జంగమ్మ మల్లమ్మ వీరమని కృష్ణయ్య నర్సింలు పుష్పమ్మ గోపాల్ చంద్రశేఖర్ మహేందర్ వెంకటేష్ తదితరులు పెద్ద ఎత్తున ఆందోళన వ్యక్తం చేశారు. 12 ఏళ్ల క్రితం రెడ్ హిల్స్ వెంచర్ ద్వారా ప్లాట్లను కొన్నామని అయితే కొంతమంది దీనిపై దౌర్జన్యం చేసి తమకు ఇండ్ల స్థలాల్లో నిర్మాణాలు జరగకుండా అన్ని విధాలు అడ్డుకుంటున్నారని వారు ఆరోపించారు. గతంలో తమ స్థలాలను యంత్రాల ద్వారా చదును చేయించారని అప్పట్లో పోలీస్ స్టేషన్ ను ఆశ్రయించగా కేసులు కూడా కొంతమంది పై నమోదయ్యాయని తెలిపారు. అయితే గతంలో మూడు పర్యాయాలు కోర్టులో ప్రతివాదులు కేసులు వేసినప్పటికీ అవి వీగిపోయాయని మళ్లీ మరో కేసు వేసి కాలయాపన చేస్తున్నారని దాని అడ్డంగా పెట్టుకుని జిల్లా పంచాయతీ అధికారి (డిపిఒ) ఏకపక్షంగా ఇళ్ల నిర్మాణం చేపట్టకుండా స్టేటస్కో విధించారని ఆరోపించారు. పద్మారం ప్రాంతంలో డ్యాం నిర్మాణం జరిగితే తమ ఇల్లు మునుగుతాయని అప్పట్లో భూములు అన్ని అపో సపోజ్ చేసి లాల్పహాడ్ వద్ద రెడ్ హిల్స్ వెంచర్లో ఇండ్ల స్థలాలు కొన్నామని పేర్కొన్నారు. ఇప్పుడు దీనిని వివాదం చేసి అధికారులు తమాషా చూస్తున్నారని పేర్కొన్నారు. గతంలో వినాయకుడు తమ ఇండ్ల స్థలాల హద్దులను చెరిపేసి ఆజమాయిషి చలయించారని ప్రస్తుతం వారే ఇదంతా కుట నడుపుతున్నారని అధికారులు వారి మాటలు పట్టించుకోని తమకు ఇండ్ల నిర్మాణాలు చేసుకోకుండా నిబంధనలు విధించారని వెంటనే ఈ నిబంధనలను ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు..

# కలెక్టర్ ను కలిసిన బిజెపి నాయకులు



**గద్వాల, ఆగస్టు 1(స్కై న్యూస్:**ఇందిరమ్మ లబ్ధిదారుల సమస్యల పై 29వ వార్డు నుంచి 36వ వార్డు వరకు ఏడు వార్డులలో ఇందిరమ్మ ఇండ్ల లభించిన లబ్ధిదారులను ప్రకటించకపోవడంతో రజక జయశ్రీ నరసింహ (బిజెపి పట్టణ అధ్యక్షురాలు) ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ను కలసిన బీజేపీ నాయకులు. ఇందిరమ్మ ఇండ్ల లోన్ లు,కొత్త లబ్ధిదారులకు వెంటనే ప్రొసీడింగ్స్ ఇవ్వాలని మరియు కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని కలెక్టర్ ని కోరారు,గత ప్రజా పాలన దరఖాస్తుల ద్వారా ఇందిరమ్మ ఇండ్ల లోన్ ల కోసం దరఖాస్తు చెసుకున్న వారికి వార్డు ల వారిగా కొంత మంది లబ్ధిదారులను అధికారులు ఎంపిక చేయడం జరిగింది. వారందరికీ వెంటనే ప్రొసీడింగ్స్ ఇచ్చి వారికి రావాల్సిన ఇసుక,కంకర, కడ్డీ ఇంటికి సంబంధించిన మెటీరియల్ ను లబ్ధిదారులకు అందజేయాలని కలెక్టర్ ని కోరారు.అధికారులు వార్డ్ ల వారిగా లబ్ధిదారులను ఎంపిక చేసి వారికి తెలుపడంతో వారు అందరూ హడావుడిగా వారు నివసిస్తున్న ఇండ్లను ఖాళీ చేసి పడగొట్టుకొని ప్రభుత్వం నుంచి వచ్చే 5 లక్షలతో ఇల్లు పూర్తి చేసుకొని కొత్త ఇంట్లో అడుగుపెడదమని కోటి ఆశలతో ఉన్న వారికి నిరాశే మిగల్చడం తో పాటు వారు నివసిస్తున్న ఇల్లు లేక రోడ్డున పడేయడం దారుణంగా ఉంది.కావున వార్డు ల వారిగా మీరిచ్చిన లబ్ధిదారుల లిస్ట్ లో ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వం నుంచి వచ్చే 5 లక్ష ల రూపాయల ప్రొసీడింగ్స్ ఇచ్చి వారిని తక్షణమే ఆదుకోవాలని పట్టణ బీజేపీ పార్టీ ద్వారా జిల్లా కలెక్టర్ ని కోరాము.అలాగే కొత్త రేషన్ కార్డ్ లను కూడా త్వరలో లబ్ధిదారులకు అందించి ఆదుకోవాలని జిల్లా కలెక్టర్ ని సవినయంగా కోరాము.29 నుంచి 36 వ వార్డ్ లో గల ప్రజలకు ఇప్పటి వరకు వాళ్ళకి సంబంధించిన లిస్ట్ అధికారులు తెలపలేదని వాటిపై కూడా న్యాయం చేయాలని కలెక్టర్ ని కోరడంతో కలెక్టర్ వెంటనే స్పందించి అప్పటికప్పుడే దానికి సంబంధించిన అధికారులకు ఫోన్ చేసి ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల సమస్యలు తీర్చాలని అధికారులకు ఆదేశించడం జరిగింది. వారం లోపలే మీరు తెలిపిన సమస్యను తీరుస్తామని కలెక్టర్ హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దేవదాసు, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అనిల్, పట్టణ ప్రధాన కార్యదర్శి చిత్తారి కిరణ్, పట్టణ ఉపాధ్యక్షులు రమేష్, కృష్ణవేణి, నాగరదిన్నె పద్మ, ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి డబిలీటీ నరసింహ, దిల్వాలే కృష్ణ, వినోద్ ,శేఖర్, ములకలపల్లి నరసింహులు, మొదలగు బిజెపి నాయకులు పాల్గొన్నారు

## అంకితభావంతో మృత్తికే వన్నెతెచ్చిన శంకర్ గౌడ్...

**శేష జీవితాన్ని సమాజ సేవకు అంకితం చేయాలి: మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి**




**వనపర్తి ఆగస్టు1 (స్కై న్యూస్):** కళా సాహితీ వేదిక అధ్యక్షులు,ప్రధానోపాధ్యాయులు పలుస.శంకర్ గౌడ్ అంకితభావంతో విధులు నిర్వహించడం ద్వారా వృత్తికే వన్నెతెచ్చారని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు శుక్రవారం పదవీ విరమణ వీడ్కోలు సభ శ్రీ లక్ష్మీ కృష్ణ గార్డెన్ లో నిర్వహించారు ఈ సమావేశంలో మంత్రి నిరంజన్ రెడ్డి తో పాటు మాజీ ఎం.పి,మాజీ ఎం.ఎల్.ఏ రావుల.చంద్రశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిలుగా హాజరై పలుస.శైలజా శంకర్ గౌడ్ దంపతులను ఘనంగా సన్మానించారు.ఈ సమావేశానికి బైరోజు.చంద్రశేఖర్ అధ్యక్షత వహించాగా ఆయన మాట్లాడుతూశంకర్ గౌడ్ రిటైర్మెంట్ తర్వాత తన శేషజీవితాన్ని కాదు తన అనుభవంతో సమాజ సేవకు విశేషమైన జీవితాన్ని ఉపయోగించాలని సూచించారు. శంకర్ గౌడ్ రిటైర్మెంట్ నిన్న జరిగింది ఈరోజు తన పుట్టినరోజు కావడం యాదృచ్ఛికం అయినా సమాజములో శంకర్ గౌడ్ నూతన పాత్ర పోషించటానికి నాంది కావాలని ఆకాంక్షించారు. సాహితీ కళావేదిక ప్రారంభించి ఎందరో కళాకారులను,సంస్కృతి సాంప్రదాయాలను సమాజానికి తెలియజేసినారని వారి మున్ముందు చేయబోయే కార్యక్రమాలకు తమ సహకారం ఉంటుందని మరోసారి వారికి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు.మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఏ రంగంలోనైనా ఉన్నత శిఖరాలకు చేరాలంటే గురువుల బోధన,ఆశీర్వాదం ముఖ్యమని అటువంటి ఉపాధ్యాయ వృత్తిని నిర్వర్తించిన శంకర్ గౌడ్ ధన్యజీవి అని కొనియాడారు. శంకర్ గౌడ్ వృతి ఉపాధ్యాయుడు అయిన ప్రవృతి రీత్యా ఎన్నో సాంస్కృతిక కార్యక్రమాలు,సమాజ సేవలు చేశారని వారు స్థాపించిన కళా సాహితీ వేదిక భవిష్యత్తు తరాలకు మార్గదర్శనమైంది అని అన్నారు. వనపర్తి సంస్థానం విద్యకు,సాగునీరు,తాగు నీరుకు పాలకులు పెట్టింది పేరని అటువంటి మన వనపర్తిని పాలకులు ఎవరైనా బ్రాండ్ ఇమేజ్ కాపాడాలని సూచించారు.ఈ కార్యక్రమములో గట్టు యాదవ్, వామను గౌడ్,వాకిటి శ్రీధర్,పలుస.రమేష్ గౌడ్,నందిమల్ల.అశోక్, ఉపాధ్యాయులు రవిప్రసాద్,కంటే.ఆంజనేయులు,వరప్రసాద్,జన జ్వాల.రాధాకృష్ణ,రాజారాం ప్రకాష్,షేక్.జహంగీర్,బండారు.కృష్ణ,ఉంగ్లం. తిరుమల్, నాగన్న యాదవ్,ఆవుల.రమేష్,యుగంధర్ రెడ్డి,చిట్యాల.రాము తదితరులు పాల్గొన్నారు.

## సుప్రీం తీర్పు చారిత్రాత్మకం

**స్పీకర్ వెంటనే నిర్ణయం తీసుకోవాలి**

**బిజెపి జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ నందు**



**నారాయణపేట ఆగస్టు 1 ( స్కై న్యూస్ ):**ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రా త్మకమని నారాయణపేట జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ నందు నామా జీ ఒక ప్రకట నలో పేర్కొన్నారు.బి ఆర్ ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపు అం శంపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పునకు అనుగుణంగా అసెంబ్లీ స్పీకర్ వెంటనే నిర్ణయం తీసుకోవాలనీ అన్నారు.సుప్రీం కోర్టు తీర్పు మేరకు మూడు నేళల్లోపు నిర్ణయం తీసుకోవాలన్నా రు.గతంలో రాజీవ్ గాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు తెచ్చిన పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టానికీ కాంగ్రెస్ పార్టీ అనేక మార్పులు చేయడమే కాకుం డా దానిని దుర్వినియోగం చేసిందనీ విమర్శించా రు.అలాగే బి ఆర్ ఎస్ సైతం పార్టీ ఫిరాయింపులను సమ ర్థించుకుంది అన్నా రు.ఇప్పు డు కాంగ్రెస్ అదేపని చేస్తున్న దని అన్నారు.అసెంబ్లీ స్పీకర్ సుప్రీం కోర్టు కు అనుగుణంగా పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసి రాజ్యాంగా న్ని పరిరక్షించాలని కోరారు.

# రోస్టర్ విధానంతో మాలలకు తీరని అన్యాయం

**మెడిసిన్,ఇంజనీరింగ్ సీట్లలో రోస్టర్ విధానం తీసివేయాలి...**
**విద్యార్థుల జీవితాలు అంధకారంగా మారే ప్రమాదం...**
**ప్రభుత్వం పునరాలోచించి 99 జీవో రద్దు చేయాలి....**
**జాతీయ మాల మహానాడు జిల్లా అధ్యక్షులు... తోటమల్ల రమణమూర్తి**

**చర్ల, ఆగస్టు 1,( స్కై న్యూస్) :** మాల విద్యార్థుల భవిష్యత్తు అంధకారంగా మార్చే ఏకపక్ష రోస్టర్ 99 జీవోను వెంటనే రద్దు చేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు తోటమల్ల రమణమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలుపుతూ గత సంవత్సరం 2024లో సుప్రీంకోర్టు తీర్పు వెలువరించడం, తదనంతరం రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణ చేసి మాలల ఉనికే ప్రశ్నార్థకంగా మారే పరిస్థితి వచ్చేలా విడుదల చేసిన ఏకపక్ష రోస్టర్ 99 జీవో ను రద్దు చేయాలంటూ జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్ ఆగస్టు 1న సామాజిక విద్రోహ దినంగా పాటించాలని పిలుపునిచ్చిన నేపథ్యంలో మాల మహానాడు చర్ల మండల కమిటీ ఆధ్వర్యంలో మండల అధ్యక్షులు తోటమల్ల గోపాలరావు అధ్యక్షతన మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు తోటమల్ల రమణమూర్తి అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు.అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ రోస్టర్ 99 జీవో వల్ల మాల జాతి నిర్వీర్యమే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.విద్యార్థుల జీవితాలు భవిష్యత్తు అంధకారంగా మార్చే ఏకపక్ష రోస్టర్ 99 జీవోని వెంటనే రద్దు చేయాలని, ఎస్సీ 3 క్యాటగిరి రోస్టర్ పాయింట్లను తగ్గించాలని, తక్షణమే ఉద్యోగ ప్రమోషన్లు ఆపాలని, మెడికల్ సీట్లు, ఇంజనీరింగ్ సీట్లలో రోస్టర్ విధానాన్ని ఆపి 99 జీవోని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏకపక్షంగా మాలల ఉనికి లేకుండా చేయాలని రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుపట్టారు.వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరా ఆలోచన చేసి 99 జీవో ను



రద్దు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జాతీయ మాల మహానాడు సీనియర్ నాయకులు తడికల లాలయ్య, రిటైర్డ్ ఉపాధ్యాయులు కొంగూరు నరసింహారావు, దొడ్డా ప్రభుదాస్, మండల గౌరవాధ్యక్షులు మోతుకూరి ప్రభాకర్, నియోజకవర్గ నాయకులు తోటమల్ల విజయ రావు,రుంజా సుమన్,రుంజా రాజా, పాగా రాంప్రసాద్, సోషల్ మీడియా జిల్లా ఇన్ చార్జ్ బోళ్ల వినోద్, నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్ ఛార్జ్ నిట్ట అబ్బులు, నాయకులు తోటమల్ల కృష్ణారావు, కొంగూరు సత్యనారాయణ, జెట్టి వెంకటేశ్వర్లు, తోకల లక్ష్మణరావు, మాదరి శ్యామ్, శెట్టిపల్లి గణేష్, మంచాల బాలు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ



**శేరిలింగంపల్లి. ఆగస్టు 1: (స్కై న్యూస్)** రూ.30,67,000/- ముప్పై లక్షల అరవై ఏడు వేల రూపాయల చెక్కులను 51 మంది లబ్ధిదారులకు పంపిణీ చేసిన పీఏసీ చైర్మన్ శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని పలువురు వైద్య చికిత్స నిమిత్తం ముఖ్య మంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకొనగా 51 మంది లబ్ధిదారులకు ద్వారా మంజూరైన రూ.30,67,000/- ముప్పై లక్షల అరవై ఏడు వేల రూపాయల ఆర్థిక సహాయానికి సంబంధించిన %జవీ=ఖీ% చెక్కులను కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి తో కలిసి బాధిత కుటుంబాలకి అందచేసిన %ూూజ% చైర్మన్ ఆరెకపూడి గాంధీ ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరం అని, ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటున్నదని, అనారోగ్యంకు గురై ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు , అభాగ్యులకు అండగా..సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా నిస్తుందని.. ఈ సందర్బంగా తెలియచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంజీవ రెడ్డి,నాయి నేనీ చంద్రకాంత్ రావు, పోతుల రాజేందర్ ,%వీణ% ఇబ్రహీం, ఎల్లం నాయుడు,శ్రీధర్ రెడ్డి, రాంచందర్, భాస్కర్ రెడ్డి,వెంకటేశ్వర రావు, వెంకట్ నాయక్,పూర్ణ,వెంకటేష్, శ్రీకాంత్, యాసిన్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## నో వర్క్ నో పే సర్క్యులర్ విడుదల చేయాలని జి.ఎం. సివిల్ కి మెమోరండం



**కొత్తగూడెం ఆగస్టు 1 (స్కై న్యూస్ ):**కాంట్రాక్ట్ కార్మికుల పైన ఫైన్లు వేయవద్దని జి.ఎం.( సివిల్) కొత్తగూడెం కి సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్( ఎస్ సి సి డబ్ల్యూ యు- ఐ ఎఫ్ టి యు) ఆధ్వర్యంలో మెమోరాండం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఎన్. సంజీవ్'కొండపల్లి. శ్రీనివాస్ సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ కొత్తగూడెం రీజియన్ అధ్యక్ష కార్యదర్శులు. మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా జాతీయ కార్మిక సంఘాలు దేశవ్యాప్తంగా జూలై 9 వ తేదీ రోజున సమ్మె పిలుపు ఇవ్వడం జరిగింది. అందులో భాగంగా సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు కూడా సమ్మెలో పాల్గొనడం జరిగింది. నాలుగు లేబర్ కోడ్ లను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తే కాంట్రాక్టు కార్మికులకు కూడా తీవ్రమైన నష్టం జరిగే పరిస్థితి ఉంది. కనుక దేశవ్యాప్త సమ్మె పిలుపులో భాగంగా కాంట్రాక్టు కార్మికులు కూడా జూలై 9.వ తేదీన సమ్మెలో పాల్గొన్నారు. టెండర్ నాన్స్ ప్రకారంగా కాంట్రాక్టర్లు పెనాల్టీలు వేసే అవకాశం ఉంది. కనుక సింగరేణి యాజమాన్యం చొరవ తీసుకొని నో వర్క్ నోపే సర్క్యులర్ ను రిలీజ్ చేయాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ డిమండ్ చేస్తుంది. ఈ కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు, మల్లికార్జున్, అంజయ్య ,జే. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# తల్లిపాల ప్రాధాన్యతపై అవగాహన కల్పించాలి

**జిల్లా ట్రైని కలెక్టర్ సౌరభ్ శర్మ**

**భద్రాద్రి కొత్తగూడెం ఆగస్ట్( స్కై న్యూస్):**శుక్రవారం నాడు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయము నందు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు 2025 గోడపత్రికలను ట్రైని కలెక్టర్ సౌరభ్ శర్మ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ట్రైని కలెక్టర్ సౌరభ్ శర్మ మాట్లాడుతూ ఈనెల 1వ తేదీ నుండి 7వ తేదీ వరకు ప్రపంచవ్యాప్తంగా తల్లిపాల వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుంది అని,ఈ సందర్భంగా జిల్లాలోని 11 ప్రాజెక్టుల పరిధిలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తల్లిపాల ప్రాధాన్యతపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు, తల్లిపాలు ఎంతో శ్రేష్టమైనవని పుట్టిన ప్రతి బిడ్డకు మొదటి గంటలోపు తప్పనిసరిగా తల్లిపాలు పట్టాలని,అలాగే బిడ్డకు మొదటి ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలే బిడ్డకు సంపూర్ణ ఆహారం అని,దీనిని ప్రతి తల్లి పాటిస్తూ విస్తృతంగా ప్రచారం నిర్వహించే విధంగా కార్యచరణ రూపొందించుకోవాలని సూచించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే వారోత్సవాలలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్



ఆస్పత్రుల సిబ్బంది, ఆశాలు, స్వయం సహాయక సంఘాలు, ఎన్జీవోలు, డి ఆర్ డి ఏ, లైన్ డిపార్ట్మెంట్లు సిబ్బంది ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. ఈ సందర్భంగా ట్రేని కలెక్టర్ సౌరభ్ శర్మ తల్లిపాల వారోత్సవాల పోస్టర్ని ఆవిష్కరించి వారం రోజుల షెడ్యూల్ను విడుదల చేయడం జరిగింది. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా ఏ రోజు ఏం చేయనున్నారు దానికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆగస్టు 1న ప్రతి అంగనవాడి కేంద్రం ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపెయిన్ నిర్వహించనున్నారు. ఇందులో తల్లులకు తల్లిపాల ప్రాధాన్యతను వివరిస్తారు, రెండవ తేదీన ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో తల్లిపాల ప్రాధాన్యతను తల్లులకు, కుటుంబ సభ్యులకు అవగాహన కల్పిస్తారు, నాలుగో తేదీన అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించి అంగనవాడి టీచర్స్, ఆశా వర్కర్లు బ్రెస్ట్ ఫీడింగ్ పై అవగాహన కల్పిస్తారు. ఐదో తేదీన ఇంటింటికి వెళ్లి తల్లిపాల ప్రాధాన్యతపై ప్రచారం చేస్తారు, 6న చేతులను శుభ్రం చేసుకునే అంశంపై అవగాహన కల్పిస్తారు. ఏడోవ తేదిన స్వయం సహాయక సంఘాల సభ్యులు, మెప్మా, సెర్ఫ్ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి, బ్రెస్ట్ ఫీడింగ్ పై విస్తృత అవగాహన కల్పిస్తారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత లెనినా, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జయలక్ష్మి, సిడిపిఓ లక్ష్మీ ప్రసన్న, పోషణ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ పి.సంపత్, సూపర్వైజర్ రమా దేవి పోషణ అభియాన్ జిల్లా ప్రాజెక్టు అసిస్టెంట్ బి. రాము, బ్లాక్ కోఆర్డినేటర్ సోనీ తదితరులు పాల్గొన్నారు.

## జాడి మంజులను పరామర్శించిన జై తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం

**-ప్రభుత్వం దృష్టికి తీసుకెళతాం**
**జై తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు రషీద్**




**కొత్తగూడెం, ఆగస్టు 1 ( స్కై న్యూస్):**కొత్తగూడెం జిల్లా కేంద్రం లోని రైటర్ బస్తి ఏరియాలో పేద కుటుంబానికి చెందిన తెలంగాణ ఉద్యమ నాయకురాలు, విద్యార్థి,మహిళా నాయకురాలు జాడి మంజుల గత కొంత కాలంగా గుండె, లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. తెలంగాణ ఉద్యమంలో పని చేసినటువంటి మహిళా నాయకురాలు అనారోగ్య పరిస్థితి చూసి చలించి పోయారు.సోషల్ మీడియాలో విషయం తెలుసుకొని , వారి స్వగృహం కు వెళ్ళి కొంత ఆర్థిక సహాయం చేసి, పూర్తి విషయాలు తెలుసుకుని ధైర్యం చెప్పి ఈ విషయాన్నీ ప్రజా ప్రభుత్వం అయినటువంటి ముఖ్యమంత్రి, మంత్రుల దృష్టికి తీసుకెళ్లి, మాట్లాడి పూర్తి సహకారం మీ కుటుంబానికి ఉంటుందని హామీ ఇచ్చారు అయితే ప్రస్తుతం మంజుల హైదరాబాద్ లోని మహవీర్ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందు తున్నారు. వారి కుటుంబానికి ఆర్థికంగా తోడ్పాటు అందిస్తామని రషీద్ అన్నారు.అలాగే తోటి ఉద్యమ మిత్రులు, శ్రేయోభిలాషులు, సామాజిక, విద్యార్థి, యువజన, మహిళ,రాజకీయ,ప్రజా సంఘాల నాయకులు మానవత్వంతో స్పందించి మహిళ ఉద్యమకారురాలు మంజులని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తమకు తోచినంత సాయం చేయాలని అన్నారు వారి వెంట ఐలయ్య,బుడగం నాగేశ్వరరావు, రేగళ్ల శ్రీనివాస్, ఎస్ డి టి ఉసేన్, తాజుద్దీన్, వీరభద్రం, పాల్గొన్నారు

# ఉండవల్లి గురుకుల పాఠశాల సంఘటన పునరావృతం కారాదు

**జోగులాంబ గద్వాల, ఆగస్టు 1 (స్కై న్యూస్):** గురుకులాలు, సంక్షేమ శాఖల వసతి గృహాల విద్యార్థుల పట్ల నిర్లక్ష్యానికీ తావులేదని, ఉండవల్లి జ్యోతిబాపూలే బిసి బాలుర గురుకుల పాఠశాలలో జరిగిన సంఘటన పునరావృతం కాకుండా చూసుకోవాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడీఓసీ సమావేశం హాల్లో రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టల్స్ నిర్వహణపై జిల్లా ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖపై ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. పాఠశాలలు, హాస్టల్స్ నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం చేసిన తగిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఇటీవల ఒక పాఠశాలలో జరిగిన ఘటనపై డిప్యూటీ వార్డెన్, సూపర్వైజర్లను సస్పెండ్ చేసిన విషయాన్ని గుర్తుచేశారు. నిర్లక్ష్యం వహించిన ఇతర సంబంధిత అధికారులకు కూడా మెమోలు జారీ చేశామని తెలిపారు. పాఠశాలలో విద్యార్థుల సంక్షేమం కోసం మండల స్థాయి అధికారులు పరస్పరం సమన్వయంతో పనిచేయాలని అన్నారు. అన్ని మండలాలకు జిల్లా స్థాయి స్పెషల్ అధికారులను నియమించడం జరిగిందని, ప్రతి నెలా కనీసం రెండు సార్లు పాఠశాలలు సందర్శించి అక్కడి విద్యా భద్రతా,మౌలిక వసతులైన త్రాగునీరు, మరుగుదొడ్లు, ఇతర అవసరాలను సమీక్షించాలని సూచించారు. తహసీల్దారులు, ఎంపీడీవోలు తమ పరిధిలోని వసతి గృహాలలో తనిఖీలు నిర్వహిస్తూ అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు వెంటనే స్పందించాలన్నారు. విద్యార్థులకు ప్రతిరోజూ మెనూ ప్రకారం నాణ్యమైన




పోషకాహారంతో కూడిన భోజనం తప్పనిసరిగా అందించాలని, ప్రతి పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆహార కమిటీ పర్యవేక్షణలో,ప్రతి రోజు భోజన నాణ్యతను పరిశీలించి, ఇద్దరు విద్యార్థుల సంతకాలతో రికార్డులు నిర్వహించాల్సిందిగా ఆదేశించారు. మెనూలో పేర్కొన్న ఆహార పదార్థాలలో ఏదైనా లోపం ఉంటే సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.స్కూళ్లను లేదా హాస్టల్స్‌ను సందర్శించే సమయంలో తాగునీరు, మరుగుదొడ్లు, పరిసరాల పరిశుభ్రత, స్టోర్ రూమ్, కిచెన్ వంటి కీలక మౌలిక వసతుల పరిస్థితిని తప్పనిసరిగా పరిశీలించాలని, నాణ్యతలేని పురుగుల బియ్యం ఉంటే వెంటనే మార్చుకోవాలని సూచించారు. వసతి గృహాలలో ఏదైనా సమస్యలు తలెత్తితే వెంటనే తహసిల్దార్, ఎంపీడీఓ, పోలీస్ అధికారులకు తెలియపరచాలని, తహసిల్దార్ మండల స్థాయి మెజిస్ట్రేట్ కాబట్టి వెంటనే స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. ఏమైనా తీవ్ర సమస్యలు తలెత్తితే ఇట్టి విషయాన్ని వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలలు, హాస్టల్స్ ప్రాంగణాలలో అనధికార వ్యక్తుల ప్రవేశాన్ని పూర్తిగా నిషేధించాలని, ముఖ్యంగా బాలికల హాస్టల్స్ విషయంలో మరింత నిఘా పెట్టాలన్నారు.జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు మాట్లాడుతూ, జిల్లాలో ఎలాంటి సంఘటన జరిగినా పోలీసు శాఖ ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని, వసతి గృహాల ప్రతి విషయం పట్ల అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అధికారుల నిర్లక్ష్యం, ఇతర వ్యక్తుల ప్రమేయం వల్ల విద్యార్థులు రోడ్లపైకి రావడం జరిగింది అన్నారు. పాఠశాలలు, వసతి గృహాలలో అనధికార వ్యక్తులు, ముఖ్యంగా మహిళల హాస్టల్లో ప్రవేశించకుండా కఠిన నిబంధనలు పాటించాలన్నారు. విద్యా వ్యవస్థలో బయటి వారికి అనుమతించకూడదని, వసతి గృహాల విద్యార్థుల హక్కులకు భంగం కలిగించే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. మండల స్థాయిలో అధికారులు, పోలీసు విభాగం పరస్పరం సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పోలీసు శాఖ జిల్లా యంత్రాంగానికి పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు లక్ష్మి నారాయణ, నర్సింగ రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసరావు,ఆర్డీఓ అలివేలు, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపిడిఓలు, స్పెషల్ ఆఫీసర్స్, విద్యా శాఖ అధికారులు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల ప్రిన్సిపాళ్లు మరియు ఇతర ఉన్నతాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాస్థాయి బాక్సింగ్ పోటీల్లో స్వర్ణ పతాకం

**గెలుపొందిన సెయింట్ జోసెఫ్ హై స్కూల్ విద్యార్థిని అభినందించిన ప్రిన్సిపల్ బ్రదర్ రాజశేఖర్ రెడ్డి..**



**చుంచుపల్లి ఆగస్ట్ 1(స్కై న్యూస్ ):**ధన్బాద్ గ్రామపంచాయతీలో గల సెయింట్ జోసెఫ్ హై స్కూల్ నందు 9వ తరగతి చదువుతున్న ఎస్.కె.అరహన్ అలీ జులై నెల 30 తేదీ ప్రగతి మైదాన్ ,కొత్తగూడెం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జరిగిన భద్రాద్రి కొత్తగూడెం డిస్ట్రిక్ట్ బాక్సింగ్ ఛాంపియన్షిప్ ఛాంపి 2025 పోటీల్లో సబ్ -జూనియర్స్ బాయ్స్ అండర్ 15 ఇయర్స్ కేటగిరీ విభాగంలో స్వర్ణం పతాకం సాధించారు ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్కే .అరహన్ ని అభినందించారు అంతేకాకుండా రాబోయే రోజుల్లో రాష్ట్రస్థాయి జాతీయస్థాయి పోటీల్లో మరెన్నో పథకాలు సాధించాలని ఆశాభావం వ్యక్తపరిచారు.

# సృష్టి కర్తకు భయపడండి. మరణం వెంటాడుతుంది

**మంచి పనులు చేయడం లో త్వరపడండి.**
**షేఖ్ అబ్దుల్ బాసిత్. జమాతే ఇస్లామి హింద్.**

**కొత్తగూడెం ఆగస్టు 1( స్కై న్యూస్ ):**భూకంపాలు, సునామీలు, వరదల లాంటి పకృతి వైపరీత్యాలు మనిషి సాధించిన శాస్త్ర సాంకేతిక ప్రగతిని వెక్కిరిస్తూ మనిషి నిజ జీవితాన్ని గుర్తు చేస్తున్నాయి అని జమాతే ఇస్లామి హింద్ సభ్యులు షేఖ్ అబ్దుల్ బాసిత్ అన్నారు.పవిత్ర శుక్రవారం వారం సందర్భంగా కొత్తగూడెం కార్పోరేషన్ మేధర బస్తీ లోని "మస్జిద్ ఎ వహీద్ ఆయన మాట్లాడుతూ, సృష్టి జీవరాశుల్లో అత్యుత్తమ జీవి అయిన మనిషి తన నిజ జీవితాన్ని మరచి సృష్టి కర్త ను ఆయన ఆదేశాలను ధిక్కరించి ధన సంపాదనే ధ్యేయంగా ఇష్టం వచ్చినట్లు, అధర్మాలకు , అన్యాయాలకు అక్రమాలకు పాలుపడంవల్ల అనేక అనర్థాలకు దారి తీస్తుంది అని అన్నారు.ఒకవైపు సాధించిన ప్రగతి పకృతి వైపరీత్యాల



వల్ల నాశనం అవుతున్నాయి.కట్టుకున్న మేడలు పేక ముక్కల్లా కులిపోతున్నాయి. మరో వైపు వింత వింత జబ్బులు ఏ క్షణానా మరణం మనల్ని ఈ లోకం నుంచి పట్టుకు పోతుందో తెలియడం లేదు.ఇంకో వైపు క్షణిక సుఖాల కోసం మానవ సంబంధాలు మంట కలిపివేస్తున్నారు దీనంతటికీ కారణం. మనిషి సృష్టి కర్త ను గుర్తించకపోవడమేనని ఇస్లాం బోధిస్తుంది అని అన్నారు.ఈ జీవితం శాశ్వతం కాదు. శాశ్వతమైనది మరణానంతరం జీవితం అని, ఎప్పుడూ? ఎక్కడా? ఎలా? మరణించి ఈ లోకాన్ని వీడ వలసి ఉంటుందో తెలియదు కనుక అనుక్షణం మంచిని చేస్తూ, సాటి మనుష్యులతో మంచితనంతో వ్యవహరిస్తూ జీవించాలని కోరారు.సమాజం పట్ల బాధ్యత సాటి మనుషుల పట్ల మానవతా విలువలు కలిగి జీవిస్తే మానసిక ఒత్తిడి తగ్గి ప్రశాంతత లభిస్తుంది అని తెలిపారు. ఆత్మ సంతృప్తి మానవ సేవలో ఉంది. మానవ సేవయే మాదవ సేవ అని గుర్తించాలి. మానవులందరికీ సృష్టి కర్త ఒక్కడే కనుక కులమతాలకు అతీతంగా అందరితో మంచితనం తో వ్యవహరించాలి అని కోరారు.ఈ కార్యక్రమంలో జమాతే ఇస్లామి హింద్ అధ్యక్షుడు షారుఖ్ యజ్దాని, మసీదు మౌలానా , యూసుఫ్ ఖాన్, జబ్బార్ సాబ్, ఆబీద్ హుస్సేన్ , తదితరులు పాల్గొన్నారు.

# మంథని నియోజకవర్గ సమగ్రాభివృద్ధే ఆయన లక్ష్యం

**-నేడు మంథని నియోజకవర్గంలో పర్యటించనున్న రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు**

**-అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, భూమి పూజలు చేయనున్న మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు**

**-నూతన ఏఎంసీ చైర్మన్ లను, పాలకవర్గాలను సన్మానించనున్న మంత్రి**



**మంథని:**మంథని నియోజకవర్గంలోని గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ఐటీ పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు పనిచేస్తున్నారు.ఆ దిశగా చర్యలు చేపడుతూ ముందుకు సాగుతున్నారు. మంథని నియోజకవర్గంలోని పలు మండలాలలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, భూమి పూజలు చేసేందుకు మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు శనివారం మంథని నియోజకవర్గంలో పర్యటించనున్నారు.ఆయన రాక సందర్భంగా మంథని నియోజక వర్గ పరిధిలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలంలో, పెద్దపెల్లి జిల్లా మంథని, కమాన్పూర్ మండలాల్లో ప్రభుత్వ యంత్రాంగం తగు ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు మంథని పట్టణంలోని మంత్రి క్యాంప్ కార్యాలయం మంత్రి శ్రీధర్ బాబు పర్యటన వివరాలను విడుదల చేసింది. శనివారం ఉదయం 8 గంటలకు మలహర్ రావు మండలం తాడిచెర్ల గ్రామంలో 50 లక్షల నిధులతో నిర్మించిన నూతన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవనాన్ని ,20 లక్షలకు నిధులతో నిర్మించిన నూతన గ్రంధాలయం భవనాన్ని, 15 లక్షలతో సిసి రోడ్లను మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభోత్సవం చేయనున్నారు అదేవిధంగా తహసిల్దార్ కార్యాలయ కాంపౌండ్ వాల్ శంకుస్థాపన చేయనున్నారు. ఆ తర్వాత ఉదయం 9గంటలకు మంథని మండలంలోని ఎగ్లాస్ పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా 2కోట్ల 70 లక్షలతో నిర్మించబోతున్న బాయ్స్ హాస్టల్ భవనానికి ఆయన చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నారు. ఉదయం 9-30 నిమి..లకు మంథని మున్సిపాలిటీ పరిధిలో 6 కోట్ల 70 లక్షలతో నిర్మించిన మంథని పెట్రోల్ బంక్ ఏరియా, పెద్దపల్లి రోడ్డు, గోదావరిఖని రోడ్డు నూతనంగానే నెలకొల్పబడిన సెంట్రల్ లైటింగ్ సిస్టంను మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభోత్సవము చేయనున్నారు. ఉదయం 10 గంటలకు సింగరేణి సిఎస్ఆర్ కింద పదో తరగతి విద్యార్థులకు ఉపయోగపడే క్యూఆర్ కోడ్స్ మెటీరియల్స్ ను పట్టణంలోని ప్రభుత్వ కాలేజీ గ్రౌండ్ లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంత్రి గారి చేతుల మీదుగా అందజేయనున్నారు. అటవీ శాఖ మరియు మునిసిపల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వన మహోత్సవం కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారు. ఉదయం 10-30నిమి..లకు మంథని మండల పరిషత్ కార్యాలయం వద్ద నమూనా ఇందిరమ్మ ఇంటిని, మంథని మునిసిపాలిటీలో త్వరలో 20 కోట్ల 50 లక్షల రూపాయలు ప్రతి లబ్ధిదారునికి ఐదు లక్షల ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు నిర్మించబోతున్న 410 ఇల్లులకు పైలాన్ శంకుస్థాపన మంత్రి గారి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేసి అక్కడే మహాత్మా గాంధీ నేషనల్ రూరల్ ఎంప్లాయిమెంట్ గ్రాంట్ స్కీమ్ నిధుల నుండి నూతన గ్రామపంచాయతీ భవనాలకు కోటి 40 లక్షలతో మంథని మండలంలోని అడవి సోమనపల్లి, ఖానాపూర్, మల్లేపల్లి, అరెంద, గోపాల్ పూర్, ఉప్పట్ల, తోటగోపయ్యపల్లి గ్రామపంచాయతీ నూతన భవనాలకు శంకుస్థాపన చేయనున్నారు. మధ్యాహ్నం 11గంటలకు మంథనిలోని మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద నూతనంగా ఎన్నిక కాబడిన వ్యవసాయ కమిటీ చైర్మన్ మరియు పాలకవర్గం సన్మాన కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ కార్యక్రమానంతరం మధ్యాహ్నం 12 గంటలకు మంథని గంగాపురి వద్ద ఆర్ఆర్ గార్డెన్ లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. మంథని , రామగిరి, ముత్తారం, కమాన్ పూర్ నాలుగు మండలాల లబ్ధిదారులకు మరియు అన్ని మండల 308 ముఖ్యమంత్రి సహాయ నిధి (కోటి 8లక్షలు విలువ చేసే) చెక్కులు,14 కల్యాణ లక్ష్మి చెక్కుల లబ్ధిదారులకు మంథని ఆర్ఆర్ గార్డెన్ లో మంత్రి చేతుల మీదుగా అందజేయనున్నారు, అక్కడే ఇందిరా మహిళా శక్తి ఆధ్వర్యంలో నిర్వహించే సెలబ్రేషన్ లో పాల్గొంటారు. అదేవిధంగా మధ్యాహ్నం 2 గంటలకు రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలో 2 కోట్ల 60 లక్షల నిధులతో నిర్మించిన కల్వచర్ల నుండి లొంక కేశారం వరకు సిసి రోడ్డు ప్రారంభోత్సవం చేయనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు కమాన్ పూర్ లోని మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద నూతనంగా ఎన్నిక కాబడిన వ్యవసాయ కమిటీ చైర్మన్, పాలకవర్గం సన్మాన కార్యక్రమంలో పాల్గొంటారు.

# ఈ-కామర్స్ డెలివరీ సంస్థల స్టోర్లపై దాడులు..

**కుళ్లిపోయిన..పాడైన పదార్థాల అమ్మకం**



**హైదరాబాద్, ఆగస్టు1:**హైదరాబాద్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారులు జెప్టో, స్విగ్గీ వంటి ప్రముఖ ఈ-కామర్స్ సంస్థల స్టోర్లపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఆహార భద్రతా నిబంధనలు పాటించకపోవడం, పరిశుభ్రత లోపించడంతో పాటు నాసిరకం వస్తువులు డెలివరీ అవుతున్నాయని ఫిర్యాదులు రావడంతో ఈ తనిఖీలు చేపట్టారు. స్టోర్లలో ఈగలు, దోమలు విపరీతంగా ఉండటం, సిబ్బంది పరిశుభ్రత పాటించకపోవడాన్ని అధికారులు గుర్తించారు. సేకరించిన ఆహార నమూనాలను పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపారు. వినియోగదారులు ఆహారం కొనేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.ప్రస్తుత రోజుల్లో ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ అనేది చాలా సాధారణమైపోయింది. సమయం లేకనో, వంట చేయడానికి బద్ధకించి కొందరు, లేదా కొత్త రుచులు ఆస్వాదించడానికి ఇంకొందరు ఇలా ఆన్‌లైన్‌లో ఆహారం ఆర్డర్ చేస్తున్నారు. అయితే.. ఈ సౌలభ్యంతో పాటు ఆహార నాణ్యత, పరిశుభ్రతపై అనేక సందేహాలు తలెత్తుతున్నాయి. ఇటీవల కాలంలో దీనిపై పెరుగుతున్న ఫిర్యాదుల నేపథ్యంలో, ఫుడ్ సేఫ్టీ అధికారులు రంగంలోకి దిగారు.తాజాగా.. హైదరాబాద్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారులు ప్రముఖ ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లైన జెప్టో, స్విగ్గీ, జొమాటో, బ్లింకిట్, ఇన్‌స్టా మార్ట్, బిగ్ బాస్కెట్ల స్టోర్స్, డెలివరీ పాయింట్లపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ తనిఖీలలో షాకింగ్ నిజాలు బయటపడ్డాయి. ఈ సంస్థల స్టోర్‌లలో ఆహార భద్రతా నిబంధనలు అస్సలు పాటించడం లేదని అధికారులు గుర్తించినట్లు సమాచారం.ఆన్‌లైన్‌లో ఆర్డర్ పెడితే నాసిరకం వస్తువులు డెలివరీ అవుతున్నాయని జీహెచ్ఎంసీకి (గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్) పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు అందాయి. ఈ ఫిర్యాదుల ఆధారంగా.. నగరవ్యాప్తంగా 27 స్టోర్‌లలో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేసి.. 36 ఆహార నమూనాలను సేకరించారు. వీటిని తదుపరి పరీక్షల కోసం ఫుడ్ సేఫ్టీ ల్యాబ్‌కు పంపారు.తనిఖీలలో స్టోర్‌లలో ఈగలు, దోమలు విపరీతంగా తిరుగుతున్నట్లు అధికారులు గమనించారు. అంతేకాదు.. అక్కడ పనిచేసే సిబ్బంది ఎలాంటి ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలు పాటించడం లేదని, పరిశుభ్రతకు అస్సలు ప్రాధాన్యత ఇవ్వడం లేదని అధికారులు వెల్లడించారు. ఇది కస్టమర్ల ఆరోగ్యానికి తీవ్రమైన ముప్పు కలిగించే అంశం.ఈ-కామర్స్ డెలివరీ సంస్థల స్టోర్లలోనే కాదు, ఇటీవల కాలంలో చాలా హోటల్స్, రెస్టారెంట్లలో కూడా పరిశుభ్రత పాటించకపోవడం అధికారుల తనిఖీల్లో వెలుగు చూస్తోంది. ఆహార పదార్థాల్లో కల్తీ కూడా పెరిగిపోతుండటం ఆందోళన కలిగించే విషయం. పాడైపోయిన వంట నూనెలు వాడటం, నిల్వ ఉన్న ఆహారాన్ని తిరిగి వేడి చేసి విక్రయించడం, రంగులు, హానికర రసాయనాలు వాడటం వంటివి జరుగుతున్నాయి.ఈ కల్తీ ఆహారం తీసుకోవడం వల్ల జీర్ణ సమస్యలు, ఫుడ్ పాయిజనింగ్, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. కాబట్టి, వినియోగదారులు ఆహార పదార్థాలు కొనేటప్పుడు, ఆర్డర్ చేసేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి. నమ్మకమైన, పేరున్న రెస్టారెంట్లు లేదా స్టోర్ల నుంచే ఆహారాన్ని తీసుకోవాలి. అలాగే, డెలివరీ వచ్చిన ఆహారం నాణ్యత, ప్యాకింగ్ పరిశీలించుకోవాలి. ఏదైనా అనుమానం వస్తే, వెంటనే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయడం ద్వారా ఇలాంటి మోసాలను అరికట్టవచ్చు. మీ ఆరోగ్యం మీ చేతుల్లోనే ఉందన్న విషయం మర్చిపోవద్దు.

# ఈనెల 13వరకు అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ ప్రవేశాలకు గడువు

**మంథని:**అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో బి.ఏ., బీ.కాం., మరియు బీఎస్సీ కోర్సులలో మొదటి సంవత్సరంలో ప్రవేశాలకై గడువు ఆగస్టు 13 వరకు ఉన్నదని మంథని అభ్యాసకుల సహాయ కేంద్రం సమన్వయకర్త కర్నాటి కృష్ణ, మంథని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జై కిషన్ ఓజా తెలియజేశారు.రెగ్యులర్ లేదా ఓపెన్ ఇంటర్, పాలిటెక్నిక్ లేదా ఐటిఐ మొదలైన రెండేళ్ల కోర్సును పూర్తి చేసుకున్న విద్యార్థులందరూ ఓపెన్ డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి అర్హులని తెలియజేశారు. దరఖాస్తులను ఆన్లైన్ ద్వారా యూనివర్సిటీ వెబ్సైట్ను సందర్శించి చేసుకోవచ్చు. అలాగే రెండవ మరియు మూడవ సంవత్సర విద్యార్థులు తమ ట్యూషన్ ఫీజును చెల్లించాలని తెలియజేశారు. మరిన్ని వివరాలకు మంథని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని అభ్యాసకుల సహాయ కేంద్రాన్ని లేదా మొబైల్ నెంబర్ 7382929649 లో సంప్రదించాలన్నారు.

# విధులను సమర్థవంతంగా నిర్వహించాలి...

**- అడిషనల్ డిజిపి అబిలాష్ బిస్త్**



**పెద్దపల్లి:**పోలీసులు తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాల ని అడిషనల్ డిజిపి అబిలాష్ బిస్త్ అన్నారు. పెద్దపల్లి డీసీపీ కార్యాలయంలో రామగుండం కమిషనరేట్ పెద్దపల్లి జోన్ పరిధిలోని డీసీపీ, ఏసీపీ, ఎస్ హెచ్ ఓ మహిళా పోలీస్ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మొదట పెద్దపల్లి డీసీపీ కార్యాలయం చేరుకున్న అబిలాష్ బిస్త్ పెద్దపల్లి డీసీపీ కరుణాకర్ మర్యాదపూర్వకం గా మొక్కను అందచేసి స్వాగతం పలికారు. అనంత రం ఏ.ఆర్ సాయిదా దళ సిబ్బంది గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మహిళా పోలీసు సిబ్బంది డ్యూటీలు, పోస్టింగ్‌లు, సెలవులు, పోలీస్ స్టేషన్ లో నిర్వహిస్తున్న డ్యూటీల గురించి, పని చేసే ప్రదేశంలో సమస్యలు, కుటుంబ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మహిళా సిబ్బంది, పురుషులతో తో సమానంగా పిటిషన్ ఎంక్వయిరీ, బ్లూ క్లోట్స్, పెట్రోలింగ్ డ్యూటీ, నైట్ డ్యూటీ, కోర్ట్ డ్యూటీ, పోలీస్ స్టేషన్ డ్యూటీలతో పాటు బయట డ్యూటీలు చేయడాని కి దైర్యంగా సిద్ధంగా ఉండాల న్నారు. పోలీస్ స్టేషన్ లో స్కూటీలు ఏర్పాటు చేయాలని మహిళా సిబ్బంది కి డ్రైవింగ్ శిక్షణ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశం లో పెద్దపల్లి డీసీపీ కరుణాకర్, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ మల్లారెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, పెద్దపల్లి సీఐ ప్రవీణ్ కుమార్, సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేన రెడ్డి, గోదావరిఖని 2 టౌన్ సీఐ ప్రసాద్ రావు, ఎస్ఐలు పాల్గొన్నారు.

# కరీంనగర్ కొత్తపల్లిలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

**45 వాహనాలు స్వాధీనం**

**కరీంనగర్:**కరీంనగర్ కొత్తపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని, కొత్తపల్లి కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ ఆపరేషన్లో పలు అంశాలపై తనిఖీలు కొనసాగినవన్నారు. పాత నేరస్థులు అద్దెకు ఇల్లు తీసుకుని నివసిస్తున్నారా అని ఆరాదీశారు. సరైన ధృవపత్రాలు లేని 45 వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటిలో 43 బైకులు, రెండు ఆటోలు ఉన్నాయి. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు స్థానిక ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.

**సైబర్ నేరాలపై అవగాహన:**

సైబర్ నేరాలు జరుగుతున్న తీరును వివరించి, సైబర్ నేరానికి గురైనట్లయితే వెంటనే స్పందించి, నేరం జరిగిన గంట లోపల 1930 నంబర్కు ఫోన్ చేయడం ద్వారా తస్కరించబడిన సొమ్మును ఫ్రీజ్ చేసి తిరిగి పొందవచ్చని తెలిపారు.మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై హెచ్చరిక:మాదక ద్రవ్యాలను దుర్వినియోగం చేయడం, వాటిని అక్రమంగా రవాణా



చేయడం, అమ్మకం, వినియోగించడం చట్ట ప్రకారం నేరం అని పోలీసులు స్పష్టం చేశారు. అంతేకాకుండా, వాటి వలన కలిగే దుష్పరిణామాలపై స్థానికులకు అవగాహన కల్పించారు.

**షీ టీం అవగాహనా కార్యక్రమం:**

షీ టీం ఇన్స్పెక్టర్ శ్రీలత మాట్లాడుతూ, సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న మోసాల గురించి విద్యార్థినులకు వివరించారు. ముఖ్యంగా అమ్మాయిలు తమ ఫోటోలను నమ్మి ఎవరికీ పంపవద్దని, అలా పంపిన ఫోటోలను అడ్డుపెట్టుకొని బ్లాక్ మెయిల్ చేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని హెచ్చరించారు. ఆకతాయిల వేధింపులకు గురైతే అటువంటి పరిస్థితుల్లో భయపడకుండా ధైర్యంగా షీ టీమ్కు ఫిర్యాదు చేయాలని సూచించారు. షీ టీమ్లో ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని ఆమె హామీ ఇచ్చారు. ట్రాఫిక్ నియమాలు మరియు రోడ్డు ప్రమాదాల నివారణ పై అవగాహనా:ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు రోడ్డు భద్రత నియమాలను గురించి అవగాహనా కల్పించారు. చాలా వరకు ప్రమాదాలు రోడ్డు నియమాలను పాటించక పోవడం వలన జరుగుతున్నాయని తెలిపారు. అందువలన ప్రజలు తమవంతు భాద్యతగా ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఏసీపీ వెంకటస్వామి, ఇన్స్పెక్టర్లు నిరంజన్ రెడ్డి, శ్రీలత, పుల్లయ్య, ప్రదీప్ కుమార్ లతో పాటు దాదాపు 150 పోలీసు అధికారులు సిబ్బంది తో పాటు 500 మంది స్థానికులు విద్యార్థులు పాల్గొన్నారు.

# శరవేగంగా సాగుతున్న ఖైరతాబాద్ గణనాధుడి పనులు



**హైదరాబాద్, ఆగస్టు 1:**గణేష్ ఉత్సవాలు సమీపిస్తుండటంతో భాగ్యనగరంలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరుస్తోంది. ఖైరతాబాద్ బడా గణేశుడు ఈసారి 'శ్రీ విశ్వశాంతి మహాశక్తి గణపతి'గా 69 అడుగుల ఎత్తులో దర్శనమివ్వనున్నాడు. విగ్రహ తయారీ పనులు వేగంగా జరుగుతున్నాయి. పర్యావరణ హితమైన మట్టి, సహజ రంగులతో విగ్రహాన్ని రూపొందిస్తున్నారు. భారీ వర్షాల నుంచి రక్షణ కోసం ప్రత్యేక షెడ్లు ఏర్పాటు చేశారు. ఆగస్టు 27న వినాయక చవితి జరగనుండగా, లక్షలాది మంది భక్తుల కోసం పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.గణేష్ ఉత్సవాలు దగ్గర పడుతుండటంతో.. భాగ్యనగరంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటోంది. ఈ ఉత్సవాలకు ప్రధాన ఆకర్షణగా నిలిచే ఖైరతాబాద్ బడా గణేశుడి విగ్రహ తయారీ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ సంవత్సరం భక్తులకు స్వామివారు ' శ్రీ విశ్వశాంతి మహాశక్తి గణపతి 'గా దర్శనమివ్వనున్నారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన ఈ విగ్రహం 69 అడుగుల భారీ ఎత్తుతో రూపుదిద్దుకుంటుంది. ప్రస్తుతం మేకింగ్ పనులు జరుగుతున్నాయి. వీటి తర్వాత కలర్స్ విగ్రహానికి కలర్స్ వేయనున్నారు.ప్రతి సంవత్సరం వలే.. ఈ సారి కూడా మూడు నెలల ముందుగానే కర్రపూజతో విగ్రహ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. నిత్యం 50 మందికి పైగా శిల్పులు, కళాకారులు అహర్నిశలు శ్రమిస్తూ.. ఈ భారీ విగ్రహానికి ప్రాణం పోస్తున్నారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని, మట్టి, సహజ రంగులు, కర్ర వంటి పర్యావరణ హితమైన పదార్థాలతో విగ్రహాన్ని రూపొందిస్తున్నారు. ఇది నిమజ్జనం సమయంలో పర్యావరణానికి ఎటువంటి హాని కలగకుండా చూస్తుంది.భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున.. పనులకు ఎటువంటి ఆటంకం కలగకుండా తగిన జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని కమిటీ సభ్యులు తెలిపారు. వర్షం నుంచి విగ్రహాన్ని, పనిముట్లను రక్షించడానికి ప్రత్యేక షెడ్లను ఏర్పాటు చేశారు. ప్రతి సంవత్సరం ఒక ప్రత్యేక థీమ్‌తో గణపతిని రూపొందించడం ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ కమిటీ ప్రత్యేకత. ఈ సంవత్సరం 'శ్రీ విశ్వశాంతి మహాశక్తి గణపతి' అనే పేరులోనే ప్రపంచ శాంతి, సామూహిక శక్తి అనే సందేశం దానిలో దాగి ఉంది.సంవత్సరాల మాదిరిగానే.. ఈ ఏడాది కూడా లక్షలాది మంది భక్తులు ఖైరతాబాద్ గణపతి దర్శనానికి తరలివచ్చే అవకాశం ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని, భద్రతా ఏర్పాట్లను పటిష్టం చేయాలని కమిటీ సభ్యులు, పోలీసులు ప్రణాళికలు రచిస్తున్నారు. భక్తుల రద్దీని నియంత్రించడానికి, సురక్షితమైన దర్శనాన్ని కల్పించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నారు.గణేష్ చతుర్థి రోజున విగ్రహ ప్రతిష్ఠాపన అనంతరం, అనంత చతుర్దశి నాడు నిమజ్జనం కోసం భారీ క్రేన్‌ల సహాయం తీసుకోనున్నారు. హుస్సేన్‌సాగర్‌లో సురక్షితమైన, పర్యావరణ హితమైన నిమజ్జన ప్రక్రియను పూర్తి చేయడానికి అధికారులు కృషి చేస్తున్నారు. ఈ సంవత్సరం వినాయక చవితి ఆగస్టు 27వ తేదీన జరుపుకోనున్నారు. ఇంకా దాదాపు నెల రోజుల సమయం ఉంది. ఆగస్టు 20వ తేదీ నాటికి దాదాపు పనులు పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయి.

# ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులోకి బర్లను తోలి నిరసన..



**జయశంకర్ భూపాలపల్లి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో గురువారం సాయంత్రం ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ లోకి బర్రెలను పంపించి నిరసన తెలిపారు. పోలీసులు అడ్డుకొని వెనక్కి పంపించారు. బాధితులు తెలిపిన ప్రకారం.. భూపాలపల్లి టౌన్ మంజూరు నగర్ కి చెందిన కూరాకుల ఓదెలు, లలిత దంపతులు పశుపోషణ చేస్తూ జీవిస్తున్నారు. స్థానికంగా ఉన్న వారి స్థలంలో ఇల్లు కట్టుకొని, బర్ల కోసం షెడ్డు వేశారు. వీరి ఇంటికి కొద్ది దూరంలో సింగరేణి స్థలం ఉంది. అక్కడి వరకు సీసీ రోడ్డు వేయాలంటే బర్ల కొట్టం అడ్డంగా ఉంది. అది ప్రభుత్వ స్థలంలో ఉందని ఓదెలు కుటుంబానికి నోటీసులు ఇచ్చి.. గురువారం పోలీసుల సహకారంతో మున్సిపల్ ఆఫీసర్లు షెడ్డును కూల్చేశారు.ఎందుకు కూల్చారని బాధితులు అడిగితే.. ఆఫీసర్లు ఎమ్మెల్యే పేరు చెప్పడంతో కోపంతో ఓదెలు దంపతులు ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులోకి తమ బర్లను తోలుకుని వెళ్లి నిరసన తెలిపారు.న్యాయం చేయకపోతే పురుగుల మందు తాగి చస్తామని మందు డబ్బాతో హెచ్చరించారు. పోలీసులు అడ్డుకుని ఓదెలు దంపతులను స్టేషన్ కు తరలించారు.

**నాకు తెల్వకుండా చేశారు: ఎమ్మెల్యే గండ్ర**

మున్సిపల్ ఆఫీసర్లు బర్ల కొట్టాన్ని కూల్చివేసినది తనకు తెలియదని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. షెడ్డును కూల్చివేయమని ఎవరికీ చెప్పలేదని, బాధ్యులైన ఆఫీసర్లపై చర్యలు తీసుకుని, ఓదెలు కుటుంబానికి న్యాయం చేస్తానన్నారు.

# నేడు మంత్రి శ్రీధర్ బాబు చేతుల మీదుగా సీఎంఆర్ఎఫ్, కల్యాణ లక్ష్మి చెక్కులపంపిణీ

**-308 సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు చేయించి అండగా నిలిచిన మంత్రి శ్రీధర్ బాబు**

**మంథని:**మంథని నియోజకవర్గ పరిధిలోని పెద్దపల్లి జిల్లాలోని మంథని, ముత్తారం, రామగిరి, కమాన్ పూర్, పాలకుర్తి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాటారం, మల్హర్, మహాముత్తారం, మహదేవ్ పూర్, పలిమెల మరియు ఇతర మండలాలకు సంబంధించి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 308 చెక్కులకు గాను 1 కోటి 8 లక్షల 46 వేల రూపాయలను తెలంగాణ రాష్ట్ర ఐటి పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మంజూరు చేయించారు. శనివారం దుద్దిళ్ళ శ్రీధర్ బాబు గారి చేతుల మీద రేపు ఉదయం 11 గంటలకు మంథని మున్సిపల్ పరిధిలోని గంగాపురిలో గల ఆర్ఆర్ గార్డెన్స్ లో ముఖ్యమంత్రి సహాయనిధి లబ్ధిదారులకు,14మంది కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేయనున్నారు. మంథని మండలానికి సీఎంఆర్ఎఫ్ 74 చెక్కులు, ముత్తారం మండలానికి సీఎంఆర్ఎఫ్ 40 చెక్కులు. రామగిరి మండలానికి సీఎంఆర్ఎఫ్ 38 చెక్కులు, కమాన్ పూర్ మండలానికి సీఎంఆర్ఎఫ్ 25 చెక్కులు, పాలకుర్తి మండలానికి - సీఎంఆర్ఎఫ్ 08 చెక్కులు, కాటారం మండలానికి సీఎంఆర్ఎఫ్ 27 చెక్కులు,మహాముత్తారం మండలానికి సీఎంఆర్ఎఫ్ 20 చెక్కులు, మహదేవ్ పూర్ మండలానికి సీఎంఆర్ఎఫ్ 18 చెక్కులు, మల్హర్ రావు మండలానికి సీఎంఆర్ఎఫ్ 35 చెక్కులు, పలిమెల మండలానికి సీఎంఆర్ఎఫ్ 2 చెక్కులు, ఇతర మండలాలకు సంబంధించి సీఎంఆర్ఎఫ్ 21 చెక్కులను మంత్రి శ్రీధర్ బాబు మంజూరు చేయించారు. మంథని నియోజకవర్గంలోని ప్రజలు పలు ఆస్పత్రిలలో అనారోగ్యంతో చికిత్స పొంది సహాయం కొరకు మంత్రి క్యాంప్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్న వారికి ఐటీ మరియు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వీరికి ప్రభుత్వం నుండి సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంజూరు చేపించి అండగా నిలిచారు.

# అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తాం

**ఇది పేదల ప్రజా ప్రభుత్వం.**

**రాష్ట్ర పశుసంవర్ధక, డైరీ డెవలప్మెంట్, క్రీడలు యువజన సర్వీసులు మరియు మత్స్యశాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి.**





**నారాయణపేట ఆగస్టు 1 (స్కైన్యూస్)** పేదలు ఎన్నుకున్న ప్రజా ప్రభుత్వంలో అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తామని రాష్ట్ర పశుసంవర్ధక, డైరీ డెవలప్మెంట్, క్రీడలు యువజన సర్వీసులు మరియు మత్స్యశాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. అనాడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు మంజూరు చేశారని, మళ్ళీ ఇన్నేళ్లకు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లను పార్టీలకు అతీతంగా ఇస్తోందని చెప్పారు. తమ ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలుకు కేవలం అర్హతను, పేదరికాన్ని మాత్రమే చూస్తుందని, ముఖాలు చూసి బొట్టు పెట్టే రకం తాము కాదని మంత్రి పేర్కొన్నారు. శుక్రవారం నారాయణపేట జిల్లా ఉట్కూరు మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్లు, నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం లో భూమి కోల్పోయిన రైతులకు నష్ట పరిహారం చెక్కుల పంపిణీ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై ఊట్కూర్ మండలానికి మంజూరైన 1261కొత్త రేషన్ కార్డులు, 122 మందికి ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ లతో పాటు మండలానికి చెందిన 14 మంది భూ నిర్వాసితులకు 50 లక్షల నష్టపరిహారం చెక్కులను జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం పూర్తయితే ఉట్కూర్ మండలం సస్యశ్యామలం అవుతుందని తెలిపారు. గత పాలకులు ఉట్కూర్ కు సాగు నీరు తీసుకు వస్తామని హామీ ఇచ్చి విస్మరించారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఉట్కూర్ మండలానికి రూ.25 కోట్ల నిధులతో 500 ఇండ్లు మంజూరు చేశానని, అవి తొందరగా పూర్తి చేసుకుంటే అదనంగా మరో 500 ఇండ్లు మంజూరు చేయిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఇండ్ల మంజూరు, నిర్మాణ విషయంలో ఎవరైనా ఒక్క పైసా అడిగినా నేరుగా తనకు ఫోన్ చేయాలన్నారు. అలాగే ఇంకా రేషన్ కార్డులు రాని వారు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని అర్హత కలిగిన వారు ఉంటే మరో 1000 రేషన్ కార్డులను మంజూరు చేస్తామన్నారు. పేదల ఆశీర్వాదంతో తాను ఎమ్మెల్యే అయ్యానని, ఎమ్మెల్యే అంటే కొమ్ములు ఉండవని చెప్పారు. ప్రజల ఓట్లతో గెలిచి ప్రజల కు సంక్షేమ పథకాలు లబ్ధి చేకూర్చడమే ఎమ్మెల్యే బాధ్యత అన్నారు. గేట్ల ముందు నిలబెట్టే సంస్కృతి పోయిందన్నారు. ఈ ప్రాంతం గురించి ఆలోచించాలి అన్నారు. బీడు వారిన ఈ ప్రాంతం జీవో 69 ద్వారా 39 వేల ఎకరాలకు అందించే సాగునీటితో పచ్చగా మారుతుందని, ప్రస్తుతం ఉట్కూర్ పేదలు ఇతర ప్రాంతాలకు కూలీ పనికి వెళ్తున్నారని, ఎత్తిపోతల పథకం పూర్తయితే ఇతర రాష్ట్రాల నుంచి ఉట్కూర్ కు కూలీలు వలస వస్తారన్నారు. దేశంలో 28 రాష్ట్రాలలో రేషన్ కార్డుల కు దొడ్డు బియ్యం సరఫరా చేస్తుంటే కేవలం మన రాష్ట్రంలో మాత్రమే సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం వరి వేస్తే ఉరి అన్నారని, కానీ సీఎం రేవంత్ రెడ్డి వరి వేస్తే ఉరి కాదు సిరి అని చెప్పి సన్న వడ్లకు గిట్టుబాటు ధరతో పాటు అదనంగా 500 బోనస్ ఇచ్చి రైతులతో వరి కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ఒక్క మక్తల్ నియోజకవర్గంలోనే రూ.39 కోట్ల రూపాయలు బోనస్ ను రైతులకు అందజేసినట్లు మంత్రి తెలిపారు. అలాగే రూ.363 కోట్ల రుణమాఫీ చేయడం జరిగిందన్నారు. ఉట్కూర్ మండలంలో నెలకు ఉచిత విద్యుత్ బిల్లులు రూ. 40 లక్షలు ప్రభుత్వం చెల్లిస్తోందన్నారు. ఉచిత బస్సు ప్రయాణం పథకంలో భాగంగా 200 కోట్ల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేశారని చెప్పారు. ప్రభుత్వం ఇంత చేస్తున్నా తమ పార్టీ కార్యకర్తలు, నాయకులు చేసింది ప్రజలకు చెప్పక పోవడం బాధాకరం అన్నారు. ఇప్పుడు మండలానికి ఇస్తున్న కొత్త రేషన్ కార్డుల లబ్ధిదారులు 5045 మందికి ఒకరికి 6 కిలోల చొప్పున ఇచ్చే 30,624 కిలోల సన్న బియ్యం పంపిణీకి నెలకు ప్రభుత్వం రూ.కోటి 40 లక్షలు ఖర్చు చేస్తుందన్నారు. మహిళా సంఘాలకు 20 లక్షల వడ్డీ లేని రుణాలు ఇస్తున్నామన్నారు. అలాగే మహిళా సమాఖ్య సంఘానికి 30 లక్షల ఇచ్చి సంఘం తరపున 6 లక్షలు చెల్లిస్తే రూ.36 లక్షలతో బస్సును కొని ఇచ్చి, ఆ బస్సును ఆర్టీసీ కి అద్దెకివ్వడం ద్వారా ఆ మహిళా సంఘానికి నెలకు 2.10 లక్షల ఆదాయం సమకూరుతుందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో తొలిసారి గా మహిళా సంఘానికి పెట్రోల్ బంక్ ను నారాయణపేట జిల్లా మహిళా సమాఖ్య కు కేటాయించగా, నారాయణపేట సింగారం చౌరస్తాలో పెట్రోల్ బంక్ నిర్వహిస్తున్నారన్నారు. మండలానికి ఓ ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు అయిందని చెప్పారు. గత పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు, ఒక్క ఇల్లు రాలేదన్నారు. ఇన్నేళ్లు ఉట్కూర్ ను మరచిన నాయకులు, ఇప్పుడు తాను అభివృద్ధి చేస్తుంటే ఎందుకు అడ్డుపడుతున్నారని ప్రశ్నించారు. తాను బీద కుటుంబం నుంచి వచ్చిన నాయకుడిని అని, పేదల బాధలేంటో తెలిసిన వాడిని అన్నారు. తాను ఆలస్యంగా వచ్చినందుకు కోపం వచ్చి ఉంటుందని, కానీ కోపం కంటే కోపన్ కార్డు ముఖ్యమని మంత్రి చమత్కరించారు, ఎందుకు తిడుతున్నారో చెప్పి తిట్టాలని, తాను ఓపిగ్గా నిలబడి సమాధానం ఇస్తానని, అప్పుడే అన్ని కావని, ఇచ్చిన మాట ప్రకారం ఒక్కొక్కటిగా అమలు చేస్తూ వస్తున్నామని ఆయన తెలిపారు. ఉట్కూర్ మండల ప్రజలు ఇన్నేళ్లు పడ్డ బాధ చాలని, అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేసి,అన్ని విధాలుగా అభివృద్ధి చేసే బాధ్యత తనదని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రామచంద్రనాయక్,ఆత్మకూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రహముతుల్లా, హౌసింగ్ పీ డీ శంకర్ నాయక్, డీ ఎస్ ఓ బాలరాజ్, ఇంచార్జీ తహసిల్దార్ సతీష్ కుమార్, ఎంపీడీఓ ధనుంజయ్ గౌడ్, తహసిల్దార్ సింధూజ, రెవెన్యూ అధికారులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు పూర్తిస్థాయిలో న్యాయం చేస్తాం

**యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కోట్ల మధుసూదన్ రెడ్డి**




**నారాయణపేట ఆగస్టు 01( స్కై న్యూస్):**నారాయణపేట కొడంగల్ ప్రాజెక్టు కింద భూమి నష్టపోతున్న రైతులకు పూర్తిస్థాయిలో న్యాయం చేస్తామని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కోట్ల మధుసూదన్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల సాగునీటి పథకంపై రాష్ట్ర జాగృతి అధ్యక్షురాలు,ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత భాధ్యత రహితంగా మాట్లాడారని, ఈ ప్రాంత రైతుల ఆశయం పై నీళ్లు చాల్లే ప్రయత్నం మానుకోవాలని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేక హక్కులు, నీళ్ల-నిధులు-నియామకాలు లక్ష్యంగా తెచ్చామని చెప్పుకున్న బీఆర్ఎస్ నాయకురాలు కల్వకుంట్ల కవిత నారాయణపేట జిల్లా కనుకుర్తి గ్రామానికి వచ్చిన సందర్భంగా ప్రాజెక్టు పై రైతులను తప్పుదారి పట్టించే వ్యాఖ్యలు చేయడం సరైన పద్ధతి కాదన్నారు.ప్రాజెక్టు పూర్తైతే నారాయణపేట,మక్తల్, కొడంగల్ నియోజకవర్గాల్లోని వేల ఎకరాల భూములకు సాగునీరు అందుతాయన్నారు.ఎవరూ బలవంతంగా భూములు ఇవ్వడం లేదని, కోర్టు మార్గం కూడా అందుబాటులో ఉందని స్పష్టం చేశారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా కాలువల నిర్మాణం చేయకుండానే నీళ్లు ఇస్తామని, ఉగాది కి ఆ నీళ్లు తో నే పచ్చడి తాగుదామని అప్పటి మాజీ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి రైతులను మోసం చేస్తే ప్రజలు ఓడించి ఇంట్లో కూర్చోపెట్టారన్నారు. గత 20 ఏళ్ల నుండి ఈ ప్రాంత అభివృద్ధి కి ప్రజల సంక్షేమనికి తన సామాజిక సేవలతో ఓ ఆశయం తో పనిచేస్తూ,నేడు రైతుల గొంతుకగా ఉన్న కుంభం.శివకుమార్ రెడ్డి వారి భవిష్యత్తు కోసం పనిచేస్తున్నారన్నారు.అలాంటి వ్యక్తి పై ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు.

# యువ నైపుణ్యాల గురించి అవగాహన కార్యక్రమం





**నల్గొండ ఆగస్టు 01( స్కై న్యూస్):**లయన్స్ క్లబ్ మరియు శేఖర్స్ ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల నల్గొండ విద్యార్థినులకు యువ వికాస్ మరియు కెరియర్ గైడెన్స్ ప్రోగ్రాం నిర్వహించడం జరిగింది. ఈ ప్రోగ్రాం కి ఉమెన్స్ కాలేజ్ విద్యార్థులు తోపాటు లైన్స్ క్లబ్ నల్గొండ జిల్లా గవర్నర్ పీఎంజేఎఫ్ మదన్మోహన్ రేపాల గారు మరియు యూత్ ఎంపవర్మెంట్ శ్రీనివాస్ ఎర్రమద మరియు జోన్ చైర్ పర్సన్ కృష్ణయ్య గారు జోన్ చైర్ పర్సన్ ఝాన్సీరాణి మేడం గారు , పాస్ట్ ప్రెసిడెంట్ నీలకంఠం శేఖర్ గారు, శేఖర్స్ ఇన్స్టిట్యూట్ అధ్యాపక బృందం జీ.కే అండ్ కరెంట్ అఫైర్స్ ఫ్యాకల్టీ మధు సార్ గారు మరియు అర్థమెటిక్ అండ్ రీజనింగ్ ఫ్యాకల్టీ అశోక్ సార్ గారు , కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాస్ గారు, కళాశాల అధ్యాపకుడు డాక్టర్ సుంకరి రాజారామ్ గారు గైడెన్స్ లో విద్యార్థులకు కెరియర్ మరియు యువ వికాస్ సంబంధించిన మెలికలు నేర్పించారు. శేఖర్ ఇన్స్టిట్యూట్ వారు మూడవ తేదీ (ఆదివారం) ఉదయం 9: 30 లకు నిర్వహించే డెమో ప్రోగ్రాం కి అటెండ్ అయ్యి, టాలెంట్ టెస్ట్ లో పాల్గొన్న 15 మంది కళాశాల విద్యార్థినులకు ఉచిత కోచింగ్ ఇస్తామని విద్యార్థులకు తెలియజేశారు... ఈ అవకాశాన్ని అందరు విద్యార్థులు ఉపయోగించుకోవాలని కోరారు

# శ్రీ రాఘవేంద్ర గురు సార్వభౌముల వారి 354 వ ఆరాధన మహోత్సవములు



**జోగులాంబ గద్వాల,ఆగస్టు1(స్కై న్యూస్):** మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి మఠం దిగ్విజయ విద్యాసింహాసనాధీశులైన పీఠాధిపతి పరమపూజ్య 1008 శ్రీ సుబుధేంద్ర తీర్థ శ్రీ పాదుల వారి ఆజ్ఞానుసారముగా వారి ఆశీస్సులతో ఈనెల తేది 10, 11, 12 స్థానిక శ్రీ రాఘవేంద్రస్వామి మఠం, షేరెల్లివీధి యందు శ్రీ రాఘవేంద్రస్వామి ఆరాధన మహోత్సవములు విశేషంగా నిర్వహించబడుననీ బాలయ్య విచారణ కర్త మేనేజర్లు తెలిపారు. శ్రీ రాఘవేంద్రస్వామి వారు సశరీరముగా బృందావన ప్రవేశము చేసి నేటికి 354 సం॥లు అయినది. ఇప్పటికి కూడ భక్తుల సర్వాభీష్టములు తీర్చుతూ భక్తుల పాలిటి కలియుగ కల్పతరువు కామధేనువై విరాజిల్లుచున్నారు. కావున సమస్త భగవద్ భక్తులు శ్రీ స్వామి వారి ఆరాధనా మహోత్సవములందు పాల్గొని తను, మన, ధనములతో సేవలు గావించి తీర్థప్రసాదములు స్వీకరించి, శ్రీ స్వామి విశేషానుగ్రహమునకు పాత్రులు కాగలరని ప్రార్థన. శ్రీ శేషదాస మరియు శ్రీ రాఘవేంద్ర భజనమండలీ గద్వాల వారిచే భజన కార్యక్రమము

**కార్యక్రమములు..**

తేది 09-08-2025 శనివారము ఉ? 9-00 గం?లకు ఋగ్వేద నిత్య నూతన ఉపాకర్మ ఉ? 10-00 గం?లకు యజుర్వేద నిత్యనూతన ఉపాకర్మ మరియు సామూహిక శ్రీ సత్యనారాయణస్వామి పూజ సా? 6-00 గం?లకు గోపూజ, ధ్వజారోహణం, లక్ష్మీపూజ, ధాన్యపూజ మొ॥నవి జరుగును. తేది 10-08-2025 నుండి 12-08-2025 వరకు జరుగు రోజువారి కార్యక్రమములు 6-00 సుప్రభాతం, నిర్మాల్య విసర్జనం మహా పంచామృత అభిషేకం10-30 ప్రహ్లాదుల వారి పాదుపూజ, అష్టోత్తర పారాయణం సహితం 11-00 తులసీ అర్చన 11-30 అలంకార సేవ మ? 12-30 గం?లకు హస్తోదకం తీర్థప్రసాదముల వితరణ 10-08-2025 తేదీ సా? 7-00 గం॥లకు రథోత్సవము సా? 7-00 గం?లకు రథోత్సవముఫిబ్రవరి 11-08-2025 తేదీ 12-08-2025 మంగళవారం ఉ? 09-00 గం?లకు పురవీధులగుండా ప్రహ్లాదరాయల రథోత్సవ కార్యక్రమము జరుగును. సేవా వివరములు కార్యాలయంలో సంప్రదించగలరను ఆలయ విచారణ కర్త, మేనేజర్ తెలిపారు.

# కమలానికి పన్నీరు బైబై...




**చెన్నై, ఆగస్టు1:**తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఓ పన్నీర్‌సెల్వం నేతృత్వంలోని అన్నాడీఎంకే క్యాడర్ హక్కుల పునరుద్ధరణ కమిటీ గురువారం బీజేపీ నేతృత్వంలోని నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (ఎన్‌డీఏ) నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించింది. పన్నీర్‌సెల్వం, ఇతర ప్యానెల్ సభ్యులతో కలిసి జరిగిన విలేకరుల సమావేశంలో ప్రముఖ నేత, కమిటీ సలహాదారు పన్రుతి ఎస్ రామచంద్రన్ ఈ ప్రకటన చేశారు. "ఇకపై కమిటీ ఎన్డీఏలో భాగం కాదు" అని రామచంద్రన్ విలేకరులతో అన్నారు. ప్రజలతో మమేకం కావడానికి, కమిటీ స్థావరాన్ని బలోపేతం చేయడానికి పన్నీర్‌సెల్వం త్వరలో తమిళనాడులోని వివిధ ప్రాంతాలలో పర్యటిస్తారని ఆయన అన్నారు. రాజకీయ పరిస్థితిని బట్టి, భవిష్యత్తులో రాజకీయ పొత్తులపై తాము నిర్ణయం తీసుకుంటుందని రామచంద్రన్ అన్నారు. పన్నీర్ సెల్వం నాయకత్వంలో వాలంటీర్ల హక్కుల పునరుద్ధరణ కమిటీ ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాజకీయ పరిస్థితి, భవిష్యత్తును పరిగణనలోకి తీసుకుని తాము నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్‌తో సంబంధాలను తెంచుకుంటున్నాం. నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ నుండి వైదొలగడానికి గల కారణం దేశం మొత్తానికి తెలుస్తుంది. 2026 అసెంబ్లీ ఎన్నికలను పరిగణనలోకి తీసుకుంటే.. పన్నీర్ సెల్వం తమిళనాడు అంతటా పర్యటించి ప్రజలను, స్వచ్ఛంద సేవకులను కలుస్తారు. ప్రస్తుతం మేం ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోవడం లేదు. ఇకపై ఎప్పటికీ బిజెపి కూటమిలో భాగం కాము. భవిష్యత్తులో పరిస్థితిని బట్టి ఏ పార్టీతో పొత్తు పెట్టుకోవాలో నిర్ణయిస్తాం రామచంద్రన్ స్పష్టం చేశారు.టీవలే అఖిల భారత అన్నా ద్రవిడ మున్నేట్ర కజగం, ఓపీఎస్ బృందంతో కూడిన నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్‌తో పొత్తు పెట్టుకుంది. రాబోయే 2026 అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే జనరల్ సెక్రటరీ ఎడప్పాడి పళనిస్వామి ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఉంటారని కూడా చెబుతున్నారు. ఇప్పటికే అన్నాడీఎంకే ఎవరిదిఅనే దానిపై ఎడప్పాడి పళనిస్వామి, పన్నీర్‌సెల్వం మధ్య విభేదాలు ఉన్నాయి. అందులో ప్రస్తుత అన్నాడీఎంకే జనరల్ సెక్రటరీ ఎడప్పాడి పళనిస్వామికి మద్దతుగా ఆదేశాలు జారీ చేసిన తర్వాత అన్నాడీఎంకేను మళ్ళీ కైవసం చేసుకునే లక్ష్యంతో ఓపీఎస్ బృందం ఎడప్పాడి పళనిస్వామికి వ్యతిరేకంగా మద్దతుదారులు, స్వచ్ఛంద సేవకులను సేకరిస్తోంది. దీని కారణంగానే నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్‌లో చేరిన అన్నాడీఎంకేతో కలిసి పనిచేయలేక ఓపీఎస్ బృందం అధికారికంగా పార్టీని విడిచిపెట్టింది.ఎన్డీయే నుంచి బయటికి వస్తున్నట్లు రామచంద్రన్ ప్రకటించే సమయంలో సెల్వం కూడా అక్కడే ఉన్నారు. కాగా, మార్నింగ్ వాక్ సమయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను పన్నీర్ సెల్వం కలిశారు. పలు విషయాలపై చర్చించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఎన్డీయే నుంచి వైదొలగుతున్నట్లు ప్రకటించడం గమనార్హం. సీఎంతో చర్చల తర్వాత ఈ సంచలన నిర్ణయం తీసుకోవడం ఆసక్తికరంగా మారింది.

# హైదరాబాద్ అమెరికా కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్‌కు మంత్రి శ్రీధర్ బాబు ఆత్మీయ వీడ్కోలు



**హైదరాబాద్:**అమెరికా కాన్సుల్ జనరల్‌గా తన పదవీకాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న జెన్నిఫర్ లార్సన్‌కు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆత్మీయ వీడ్కోలు పలికారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే చేనేత చీరను ఆమెకు బహుకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ – అమెరికా మధ్య సత్సంబంధాలను బలోపేతం చేసేందుకు ఆమె విశేష కృషి చేశారని కొనియాడారు. విద్య, సాంస్కృతిక మార్పిడి, వాణిజ్య రంగాల్లో భాగస్వామ్యాన్ని పెంపొందించడంలో కీలకంగా వ్యవహరించారన్నారు. ఆమె అందించిన సహకారం, దార్శనికతకు రాష్ట్ర ప్రభుత్వం తరపున కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లోనూ తెలంగాణ – అమెరికా మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలోపేతం అయ్యేలా సహకారం అందించాలని కోరారు. ఆమె తదుపరి ప్రయాణంలోనూ విజయం సాధించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.

# ముఖం చూపించాల్సిందే..!

**హైదరాబాద్:** ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు ఇక ముఖ గుర్తింపు ఫేషియల్ రికగ్నిషన్ సిస్టం ఎఫ్ఆర్ఎస్, హాజరు అమలు చేయాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డీఈఓలు ఆయా ఎంఈఓలు, హెచ్ఎంలను ఆదేశించారు. గత ఏడాది ఫిబ్రవరినుంచి రాష్ట్రంలోని పెద్దపల్లి జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా టీచర్ల ముఖగుర్తింపు హాజరును అమలు చేస్తున్నారు. అక్కడ విజయవంతం కావడంతో శుక్రవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా, హనుమకొండ, వరంగల్ జిల్లాల్లోని అన్ని ప్రభుత్వ, జిల్లా పరిషత్, కేజీబీవీలు, మోడల్ స్కూల్స్, యూఆర్ఎస్, టీజీఆర్ఈఐఎస్‌లలో అమలు చేయనున్నారు.

**డీఎస్ఈ ఎఫ్ఆర్ఎస్ యాప్ ద్వారా..**

ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికే విద్యార్థులకు ముఖ గుర్తింపు హాజరు తీసుకుంటున్నారు. అందుకు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ డీఎస్ఈ ఎఫ్ఆర్ఎస్, యాప్‌ను వినియోగిస్తున్నారు. ఇదే యాప్ ద్వారా హెచ్ఎంలు, టీచర్ల, నాన్ టీచింగ్ ఉద్యోగుల ముఖ గుర్తింపు హాజరు అమలుచేయనున్నా రు. హెచ్ఎంలు తమ సెల్‌ఫోన్‌లోని డీఎస్ఈ యాప్‌లో టీచర్ మా డ్యూల్ టీచర్లకు, నాన్‌టీచింగ్ మాడ్యూల్‌లో నాన్‌టీచింగ్ సిబ్బందికి రిజిస్ట్రేషన్ చేయాలి. ఫొటో తీసి వారి వివరాలు, పాఠశాల సమయం తదితర వివరాలు అప్‌లోడ్ చేయాలి. రిజిస్ట్రేషన్ పూర్తయ్యాక టీచర్లు, నాన్‌టీచింగ్ సిబ్బంది తమతమ సెల్‌ఫోన్లలో సంబంధిత యాప్‌లో ఇక ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్ తీసుకోవచ్చు. నేటినుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. జియోట్యాగింగ్‌ను కూడా ఇస్తారు. పాఠశాలలోనే ముఖ గుర్తింపు హాజరు తీసుకోవాల్సి. ఒకవేళ సెలవు పెడితే తప్పనిసరిగా యాప్‌లో రిక్వెస్ట్ పెట్టుకోవాల్సి ఉంటుంది. దీనిపై విద్యాశాఖ ఉన్నతాధికారులు డీఈఓలకు డెమో ఇచ్చినట్లు సమాచారం. విద్యార్థులకు ఇప్పటికే ముఖగుర్తింపు హాజరు తీసుకుంటున్నప్పటికీ కొన్నిపాఠశాలల్లో అమలుచేయటంలేదు. ఇందుకు పలు కారణాలు చూపుతున్నారు.

**ప్రభుత్వ పాఠశాలల వేళలు ఇలా:**

పీఎస్‌లు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు, యూపీఎస్‌లు, హైస్కూళ్లు ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటలవరకు పనివేళలున్నాయి. టీచర్లు ఉదయం నిర్దేశించిన సమయం కంటే ముందుగానే, సాయంత్రం విధుల సమయం ముగిశాక అంటే రోజుకు రెండుసార్లు ముఖ గుర్తింపు హాజరు తీసుకోవాల్సింటుంది.

**ఇప్పటికే కలెక్టర్ ప్రతీరోజు సమీక్ష:**

హనుమకొండ జిల్లాలో ఇప్పటికే విద్యార్థులకు తీసుకుంటున్న ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్‌ను కలెక్టర్ స్నేహ శబరీష్ ప్రతీరోజు సమీక్షిస్తున్నారు. హాజరు తక్కువగా ఉన్న పలు పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నారు. ఇప్పుడు టీచర్ల ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్‌ను సైతం కలెక్టర్ ఏరోజుకారోజు పర్యవేక్షించే అవకాశం ఉంది. మరోవైపు డీఈఓ కార్యాలయాల్లో డ్యాష్‌బోర్డులు ఏర్పాటు చేస్తారు. డీఈఓలు కూడా టీచర్ల అటెండెన్స్‌ను పర్యవేక్షిస్తారు.

దుమ్మాకు చెక్‌పడినట్లేనా? విధులకు దుమ్మా కొట్టే కొందరు టీచర్లకు ముఖగుర్తింపు హాజరుతో చెక్‌పడే అవకాశం ఉందని భావిస్తున్నారు. జిల్లా కేంద్రాలనుంచి గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే టీచర్లు కొందరు సక్రమంగా విధులు నిర్వర్తించడంలేదనే ఆరోపణలున్నాయి. ఆలస్యంగా వెళ్లడం, సాయంత్రం నిర్దేశించిన సమయం కంటే ముందే వెళ్లిపోవడంలాంటివి జరుగుతున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రం నుంచి ఇతర జిల్లాలకు రైలు, బస్సుల ద్వారా, గ్రామీణ ప్రాంతాలకు షటిల్ సర్వీస్ చేసే టీచర్లు ఉన్నారు.

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137